www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 6-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 321

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి తె. 4.15 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పూర్వాషాఢ మ. 2.53 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా. 10.16-11.45; దుర్ముహూర్తం: మ. 12.03-12.51; అమృతఘడియలు: ఉ. 10.18-11.50; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.34; సూర్యాస్తమయం: 6.20

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## రేపే కాంగ్రెస్ తొలి జాబితా!

గురువారం ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం

9 మందిని ప్రకటించే చాన్స్.. ఖమ్మం, భువనగిరి సహా కొన్ని సీట్లు పెండింగ్

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికలకు అన్ని ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఖరారును ముమ్మరం చేశాయి. తెలంగాణలోని 17 లోక్‌సభ సీట్లకుగాను బీజేపీ 9 సీట్లలో, బీఆర్ఎస్ 4 సీట్లలో అభ్యర్థులను ప్రకటించాయి. కాంగ్రెస్ కూడా ఆ దిశగా కసరత్తు ముమ్మరం చేసింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టితో భేటీ అయిన స్ర్కీనింగ్ కమిటీ.. పదికి పైగా సీట్లలో అభ్యర్థులను ప్రాధాన్యాలవారీగా గుర్తించింది. ఢిల్లీలో గురువారం సమావేశం కానున్న ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీ.. తొలి జాబితాను ఖరారు చేయనుంది. ఇప్పటికే స్పష్టత వచ్చిన 9 స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసి.. అదే రోజు ప్రకటించనున్నట్లు

మిగతా 12వ పేజీలో...

## పాపాలపుట్ట పగిలింది

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

### వట్టినాగులపల్లి భూదాన్ భూముల రిజిస్ట్రేషన్ల నిలిపివేత

హైకోర్టులో ఉన్న కేసులు తేలేవరకూ అన్ని రకాల క్రయవిక్రయాలూ నిలిపివేయండి

ఆ భూములను నిషేధిత జాబితాలో పెట్టండి.. అధికారులకు కలెక్టర్ శశాంక ఆదేశం

నిషేధిత జాబితాలో బోయినపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా, హీరో శ్రీకాంత్ తదితరులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

గండిపేట మండలం వట్టినాగులపల్లిలోని భూదాన్ భూములకు సంబధించిన పాపలపుట్ట పగిలింది. కొందరు బడాబాబులు దొడ్డిదారిన స్వాహా చేసిన ఈ భూముల్లో రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. గతంలో హైకోర్టు ఈ భూములపై ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా ఈ భూములను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో పెట్టాలని.. హైకోర్టులో ఈ భూములపై పెండింగ్‌లో ఉన్న కేసులన్నీ తేలేవరకూ

మిగతా 13వ పేజీలో...



## జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసులో దొంగలు పడ్డారు

రంగారెడ్డి కార్యాలయంలోకి నలుగురు దుండగులు

గుర్తుపట్టకుండా ఉండేందుకు సీసీ కెమెరాల ధ్వంసం

హెచ్ఎండీఏ పరిధిలో ఖరీదైన భూములు

తాలూకు రికార్డులు ఎత్తుకెళ్లినట్లు అనుమానాలు

ఘటనపై ప్రభుత్వం సీరియస్.. రంగంలోకి పోలీసులు

ఆందోళన వద్దు.. డిజిటల్ రికార్డులు సేఫ్: అధికారులు

కరీంనగర్, భువనగిరిలోనూ ఇదే తరహా చోరీలు

13



# తెలంగాణ ప్రభుత్వంపై సర్జికల్ స్ట్రైక్స్

### ఇందుకు తెలంగాణ ప్రజల సంపూర్ణ సహకారం కావాలి: ప్రధాని మోదీ

కాంగ్రెస్ పార్టీకి కొత్త ఏటీఎంగా రాష్ట్రం.. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య బలంగా అవినీతి బంధం

దోచుకోవడంలో 2 పార్టీలూ కలిసే ఉన్నాయి.. కాళేశ్వరం అవినీతిలో కాంగ్రెస్‌కూ పాత్ర

వారసత్వ పార్టీలు అధికారంలో ఉంటే కుటుంబాలు బాగుపడ్డాయి.. రాష్ట్రాలు నాశనమయ్యాయి

వాటి కుంభకోణాలను వెలికి తీస్తున్నాననే నా కుటుంబంపై దాడి చేస్తున్నారు

పటాన్‌చెరు విజయ సంకల్ప సభలో మోదీ.. ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతని పునరుద్ఘాటన

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణను కాంగ్రెస్ పార్టీ కొత్త ఏటీఎంగా మార్చుకుంది. ఒకరిని మరొకరు కాపాడుకునే ఆటలూ ఇక్కడ కొనసాగుతున్నాయి. ఇవి ఎక్కువ కాలం సాగవు. తెలంగాణ ప్రభుత్వంపై సర్జికల్ స్ట్రైక్స్ చేస్తాం. ఎయిర్ స్ట్రైక్స్ కూడా చేస్తాం. ఇందుకు తెలంగాణ ప్రజల సంపూర్ణ సహకారం కావాలి. స్వేచ్ఛగా సహకరించాలి" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. తద్వారా రాబోయే రోజుల్లో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతామని పరోక్షంగా హెచ్చరించారు. రెండో రోజు తెలంగాణ పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం ప్రధాని మోదీ సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన వేదిక నుంచి రాష్ట్రంలో దాదాపు రూ.7200 కోట్ల విలువైన భారీ ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. రాష్ట్రంలో కొత్తగా పలు అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. దక్షిణ భారత దేశానికి గేట్ వేగా ఉన్న తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అనంతరం, పటాన్‌చెరులో జరిగిన బీజేపీ విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. తెలంగాణలో బీఆర్ఎస్ అవినీతిపై విసిగి వేసారి కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇచ్చారని, కానీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ వేర్వేరు కాదని, ఒకే నాణేనికి ఇరువైపులా ఉండే బొమ్మాబొరుసు వంటివని

మిగతా 13వ పేజీలో...

# బీజేపీ, బీఆర్ఎస్ కలిసే పోటీ

## అందుకే, బీజేపీ పోటీ చేసే స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించలేదు

5 నెలల్లో దింపేస్తామని అంటున్నారంటే మోదీతో కేసీఆర్ కలిసినట్లేగా!?

కాళేశ్వరం రిపోర్టు ఎన్నికల తర్వాతేనట.. కేసీఆర్ కుటుంబంపై చర్యలు తప్పవ్

రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు గెలుస్తాం.. మా అన్నదమ్ములెవరూ పోటీ చేయరు

అన్నారంలో నీళ్లు నింపిన తర్వాత ఊళ్లు కొట్టుకుపోతే బాధ్యత ఎవరిది!?

ఎమ్మెస్సీలో పొలిటికల్ సైన్స్ చదివింది కేసీఆర్ ఒక్కరే.. ఆయన నోరు తెరిస్తే అబద్ధాలే

పన్నులు వేయకుండానే ఆదాయం పెంచాం.. ట్యాక్స్ పేయర్లకు రైతు భరోసా లేదు

మీడియాతో చిట్‌చాట్‌లో రేవంత్.. ముఖ్యమంత్రిని కలిసిన చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): "పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలిసే పోటీ చేయబోతున్నాయి. అందుకే బీజేపీ పోటీ చేసే స్థానాల్లో బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించడం లేదు. బీజేపీకి వదిలేసిన సీట్లు మినహా మిగతా స్థానాల్లో ప్రకటించింది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇద్దరూ కలిసి పోటీ చేసే యోచన లేకపోతే.. అందరికంటే ముందుగా చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా రంజిత్ రెడ్డి పేరును చెప్పిన కేసీఆర్ ఇప్పటి వరకు ఆయన్ను ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. అసలు మెదక్ అభ్యర్థి ఎవరన్న దానిని ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. సచివాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఆయన మీడియాతో

మిగతా 14వ పేజీలో...





పటాన్‌చెరు విజయ సంకల్ప సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ; బేగంపేట ఎయిర్‌పోర్టులో ప్రధాని మోదీకి వీడ్కోలు పలుకుతూ వినతిపత్రం ఇచ్చిన రేవంత్

## విన్నపాలు వినవలె..!

'తుమ్మిడిహెట్టి' నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించండి

'ఇంటింటికీ నల్లా నీరు'కు సహకరించండి

'హైదరాబాద్-శ్రీశైలం' కారిడార్ మంజూరు చేయండి

సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమకు తోడ్పడండి

ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తులు 13

## ఖరీఫ్ నుంచి 'ఉచిత' పంటల బీమా

రైతులు పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదు

ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయం

రాష్ట్రంలో అన్ని పంటలకు 'పీఎం- ఫసల్ బీమా యోజన'

రేవంత్‌రెడ్డి సర్కారు కీలక నిర్ణయం

నాలుగేళ్ల తర్వాత క్రాప్ ఇన్సూరెన్స్ పునరుద్ధరణ 3

అక్షరసత్యాలైన 'ఆంధ్రజ్యోతి' కథనాలు

## విపక్ష నేతలు, ప్రముఖుల ఫోన్ల ట్యాపింగ్

డీఎస్పీ ప్రణీత్‌రావు లీలలు.. ఎన్నికల ఫలితాల రోజే ఆధారాల ధ్వంసం..!


ఎలక్ట్రీషియన్ సాయంతో సీసీ కెమెరాలు బంద్ చేసి 42 హార్డ్ డిస్క్‌ల దహనం

క్రిమినల్ కేసు నమోదుకు రంగం సిద్ధం

హెడ్‌క్వార్టర్స్ వదిలి వెళ్లొద్దని ఆదేశాలు

సహకరించిన వారిపైనా త్వరలో చర్యలు





హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐబీలో డీఎస్పీగా పనిచేసిన ప్రణీత్‌రావు బీఆర్ఎస్ హయాంలో విపక్ష నేతలు, ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు, ఇతర ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేసిన అంశంపై నిఘా విభాగం దర్యాప్తు ముమ్మరం చేసింది. చట్టవిరుద్ధంగా ఫోన్లను ట్యాప్ చేయడంపై సమగ్రంగా దర్యాప్తు జరుపుతోంది. ఫోన్ ట్యాపింగ్ విషయంలో ప్రణీత్‌రావు పాత్ర ప్రాథమికంగా రూఢీ అవ్వడంతో డీజీపీ రవిగుప్తా అతణ్ని సోమవారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే..! సస్పెన్షన్‌కు ముందు వరకు ఆయన సిరిసిల్ల జిల్లాలో డీసీఆర్‌బీ(ఫంక్షనల్ వర్టికల్స్) విభాగం డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రణీత్‌రావు స్పెషల్ ఆపరేషన్ టీం(ఎస్‌వోటీ)కి నేతృత్వం వహించారు. ఆ సమయంలో అధికార దుర్వినియోగానికి పాల్పడి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు డీజీపీ జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు.. ప్రణీత్‌రావు ఆధారాలను ధ్వంసం చేసినట్లు నిఘా విభాగం ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది. ఆ రోజు ఓ ఎలక్ట్రీషియన్ సాయంతో సీసీ కెమెరాలను నిలిపివేసి, లాగర్ రూంలో ఉన్న 42 హార్డ్ డిస్క్‌లను దహనం చేసినట్లు తేల్చింది. ఎస్‌వోటీ విభాగంలో ఉన్న డెస్క్‌టా‌ప్‌లు, ల్యాప్‌టాప్‌లలోని సమాచారాన్ని కూడా తుడిచిపెట్టినట్లు నిర్ధారించింది. అప్పట్లో విపక్ష నేతలకు సంబంధించి సేకరించిన కాల్ డేటా రికార్డ్(సీడీఆర్)లు, ఐఎంఈఐ నంబర్లు.. ఇలా వందల సంఖ్యలో ఫైళ్లు, కీలకమైన డేటా ఆ కంప్యూటర్లలో ఉన్నట్లు

మిగతా 3వ పేజీలో...



## ఇసుక జారడం వల్లే బ్యారేజీ కుంగింది

మేడిగడ్డ ఏడో బ్లాక్‌పై ఈఆర్‌టీ నివేదిక ఇచ్చిన ఎల్ అండ్ టీ 14

## నేడు రాష్ట్రానికి ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ

హైదరాబాద్‌లో అధికారులతో భేటీ

7, 8న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిశీలన 14

అన్నారం, సుందిళ్లకు సంబంధించిన 19 రకాల సమాచారమివ్వాలని రాష్ట్రానికి లేఖ

# కారెక్కిన ఏనుగు!

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు

కేసీఆర్ ఇంటికి వెళ్లి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చర్చలు

పొత్తును స్వయంగా ప్రకటించిన ఇరువురు నేతలు

మాయావతితో మాట్లాడాక విధివిధానాలపై ప్రకటన

దీర్ఘకాలిక వ్యూహంతోనే బీఎస్పీతో దోస్తీ: కేసీఆర్

కాంగ్రెస్ కూడా బీజేపీ లాగే ప్రవర్తిస్తోంది

లౌకికవాదాన్ని కాపాడిన నేత కేసీఆర్: ప్రవీణ్‌కుమార్

ప్రవీణ్.. ఇప్పుడు కేసీఆర్ హీరో అయ్యారా?: మురళి

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్, బీఎస్పీ మధ్య పొత్తు కుదిరింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. పార్లమెంటు ఎన్నికల్లో గులాబీ పార్టీతో కలిసి ప్రచారంలో పాల్గొననున్నారు. అయితే ఈ పొత్తు అంశం హఠాత్తుగా బయటపడినప్పటికీ.. గత కొద్ది రోజులుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మధ్య అంతర్గతంగా చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. పార్లమెంటు స్థానాల్లో

మిగతా 12వ పేజీలో...



మీడియాతో మాట్లాడుతున్న కేసీఆర్, ప్రవీణ్‌కుమార్

## పార్టీ వీడిన వారిని మళ్లీ తీసుకోం

అవకాశవాదులు వస్తుంటారు.. పోతుంటారు 12

గెలిచినా, ఓడినా పార్టీ ఎల్లప్పుడూ ప్రజల్లో ఉండాలి

ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఎంతో చేసినా.. ఓడాం

కాంగ్రెస్ పాలన రోజు రోజుకూ దిగజారిపోతోంది

అలవికాని హామీలిచ్చి.. ఇప్పుడు తిట్లకు దిగుతున్నారు

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ నేతలతో కేసీఆర్

పాలమూరు ఎంపీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి

## ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి

ఆరోపణలను ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయింది

విచారణ కోర్టు తీర్పు న్యాయసూత్రాల మేరకు లేదు 2

కాబట్టే కొట్టివేస్తున్నాం, యావజ్జీవ శిక్షను రద్దు చేస్తున్నాం

ఈ కేసులో మరో ఐదుగురూ నిర్దోషులే: బాంబే హైకోర్టు

సుప్రీంకోర్టులో సవాల్ చేసిన మహారాష్ట్ర ప్రభుత్వం





## డీకే శివకుమార్‌పై కేసు కొట్టివేత

మనీలాండరింగ్ కేసులో ఈడీ వాదన చెల్లదు 2

ఈ కేసు 120-బి పరిధిలోకి రాదు: సుప్రీంకోర్టు

ఎట్టకేలకు న్యాయమే గెలిచింది: కర్ణాటక డిప్యూటీ సీఎం

## ధర్మాసనం నుంచి కమల దళంలోకి

బీజేపీలో చేరనున్న కలకత్తా హైకోర్టు మాజీ జడ్జి అభిజిత్

రాజీనామా చేసిన కొద్ది గంటల్లోనే ప్రకటన 2

గతంలో మమత సర్కారుకు వ్యతిరేకంగా పలు తీర్పులు

తీవ్రల భర్తీలో అక్రమాలంటూ తీర్పు చెప్పిన న్యాయమూర్తి

అసాధారణ నిర్ణయాలతో ఎన్నెన్నో వివాదాలు




## ఫేస్‌బుక్, ఇన్‌స్టా సేవల్లో అంతరాయం

మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిలిచిన సేవలు

ఎక్స్ వేదికగా ఖాతాదారుల మండిపాటు 2

రాత్రి 10:30 సమయంలో సేవలు అందుబాటులోకి

# ఏ పాము కరిచినా ఒకే ఇంజెక్షన్



న్యూయార్క్, మార్చి 5: ఎవరికైనా పాము కాటేస్తే.. వారికి యాంటీ వెనమ్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు. కానీ, ఇక్కడో చిక్కుంది. పాముల్లో చాలా రకాలుంటాయి. కరిచిన పామును బట్టి యాంటీవెనమ్ ఇంజెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే.. ఏ ప్రాంతంలో ఏ రకం పాములు ఎక్కువగా ఉంటే.. వాటి విషానికి విరుగుడుగా పనిచేసే ఇంజెక్షన్లను ఎక్కువగా ఉంచుతారు. పాము విషాన్ని స్వల్ప మోతాదుల్లో గుర్రాలు, గొర్రెల వంటివాటికి ఇచ్చి వాటి శరీరాల్లో ఆ విషానికి తయారైన యాంటీబాడీలను సేకరించి, వాటిని శుద్ధి చేసి తయారు చేసే ఇంజెక్షన్లు అవి. ఇంత ప్రయాస లేకుండా.. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో కనిపించే పలు రకాల 'ఎలాపిడ్' పాముల్లో ఏ జాతి సర్పం కరిచినా కాపాడే సింథటిక్ యాంటీబాడీతో తయారైన ఇంజెక్షన్ అందుబాటులోకి వస్తే? '95మ్యాట్5' అనే యాంటీబాడీతో అలాంటి సూదిమందునే తయారుచేశామని స్క్రిప్స్ రిసెర్చ్ శాస్త్రవేత్తలు అంటున్నారు. సాధారణంగా పాముల విషాలు.. న్యూరోటాక్సిక్, హీమోటాక్సిక్ అని రెండు రకాలుగా ఉంటాయి. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో కనిపించే కింగ్ కోబ్రా, బ్లాక్ మాంబా, సముద్రపాములు, కోరల్ స్నేక్స్, క్రైయిట్స్ వంటి 200 రకాల పాములు న్యూరోటాక్సిన్లను విడుదల చేస్తాయి. ఇవన్నీ ఎలాపిడ్ కుటుంబానికి చెందిన పాములు. వీటి విషం మన నాడీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుంది. ఫలితంగా మరణం సంభవిస్తుంది. ఇక హీమోటాక్సిక్ అంటే.. రక్తాన్ని గడ్డకట్టించే రకం విషం. ఈ తరహా విషాన్ని విడుదల చేసేవి వైపర్లు. ర్యాటిల్ స్నేక్స్, కాపర్‌హెడ్స్, కాటన్‌మౌత్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. స్క్రిప్స్ రిసెర్చ్ శాస్త్రవేత్తలు.. ఎలాపిడ్ పాముల విషంలో ఉండే లాంగ్‌చైన్ త్రీ ఫింగర్ ఆల్ఫా న్యూరోటాక్సిన్లను నిర్వీర్యం చేసే యాంటీబాడీని గుర్తించడం కోసం 10 వేల కోట్ల యాంటీబాడీలను జల్లెడ పట్టారు. వాటిలో.. 95మ్యాట్5 అనే యాంటీబాడీకి ఒక్క కింగ్‌కోబ్రా తప్ప బ్లాక్‌మాంబా సహా అన్ని రకాల పాముల విషాన్నీ విరిచే గుణం ఉన్నట్టు వెల్లడైంది. ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో అది రుజువైంది. కింగ్ కోబ్రా విషాన్ని ఎక్కించిన ఎలుకల్లో మాత్రం ఈ యాంటీబాడీ పనిచేయలేదు. విషప్రభావంతో అవి చనిపోయాయి. కానీ.. వాటి మరణాన్ని కొంత ఆలస్యం చేయగలిగింది యాంటీబాడీ!! కాగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ఏటా ప్రపంచవ్యాప్తంగా 81 వేల మంది నుంచి 1.38 లక్షల మంది పాముకాటుకు బలవుతున్నారు.

## రీసైకిల్ ప్లాస్టిక్‌లో విష రసాయనాలు

న్యూఢిల్లీ, మార్చి 5: రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ ఉత్పత్తుల్లో విషపూరితమైన రసాయనాలు అధికంగా ఉన్నాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఢిల్లీలోని 'టాక్సిక్ లింక్స్' ఈ అధ్యయనాన్ని నిర్వహించింది. 'ఎలాంటి నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ వాడకం ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్లాస్టిక్‌లో విషపూరితమైన రసాయనాలు ఉంటున్నాయి' అని మంగళవారం విడుదలైన తాజా అధ్యయనం పేర్కొంది. అధ్యయనంలో భాగంగా మార్కెట్‌లో విరివిగా లభించే 15 రకాల ప్లాస్టిక్ వస్తువుల నమూనాలను పరిశీలించిన పరిశోధకులు.. వాటిలో 60 శాతానికిపైగా విష రసాయనాలు ఉన్నాయని గుర్తించినట్టు వెల్లడించారు.

## లోకం తీరు




## ధర్మాసనం నుంచి కమల దళంలోకి..

- బీజేపీలో చేరనున్న కలకత్తా హైకోర్టు మాజీ జడ్జి అభిజిత్
- రాజీనామా చేసిన గంటల్లోనే ప్రకటన



కోల్‌కతా, మార్చి 5: కలకత్తా హైకోర్టు జడ్జి పదవికి రాజీనామా చేసిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ బీజేపీలో చేరనున్నారు. పదవికి రాజీనామా చేసిన కొద్ది గంటల్లోనే ఆయన ఈ మేరకు ప్రకటించారు. ఆయన తన రాజీనామా పత్రాన్ని మంగళవారం ఉదయమే రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిలకు పంపించారు. పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకున్న ఉపాధ్యాయుల భర్తీ కుంభకోణం, తదితర అంశాలపై ఆయన గతంలో తీర్పులు ఇవ్వడం గమనార్హం. రాజీనామా అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తృణమూల్ అవినీతికి మారుపేరుగా మారిందని ఆరోపించారు. బీజేపీ జాతీయ పార్టీ కావడం, తృణమూల్ అవినీతిపై పోరాడుతున్నందువల్లనే ఆ పార్టీలో చేరనున్నట్టు తెలిపారు. బహుశా గురువారం ఆ పార్టీలో చేరే అవకాశం ఉందని వెల్లడించారు. బీజేపీ నాయకత్వం తనతో సంప్రదింపులు జరిపిందని తెలిపారు. ఉపాధ్యాయ భర్తీ కుంభకోణంపై తాను తీర్పు ఇచ్చిన తరువాత తృణమూల్ నాయకులు తనను దుర్భాషలాడారని, అందుకే రాజకీయాల్లో చేరి తృణమూల్‌పై పోరాడాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఆ పార్టీకి రోజులు దగ్గర పడ్డాయని, మరో రెండు అరెస్టులు జరిగితే ఆ పార్టీ ఉనికే ఉండదని అన్నారు. ప్రధాని మోదీ కష్టజీవి అని, మతాన్ని, దేవుడ్ని నమ్ముకొని దేశం కోసం ఎంతో చేస్తున్నారని ప్రశంసించారు. అభిజిత్ గన్యాయమూర్తిగా ఉన్నప్పుడు పలు అసాధారణ నిర్ణయాలు తీసుకొని వివాదాస్పదునిగా మారారు. విచారణ జరుపుతున్న కేసుపై ఇంటర్వ్యూ ఇవ్వడం, దీనిపై ఏకంగా సుప్రీం కోర్టుకే నోటీసులు ఇవ్వడం, సహచర జడ్జిపై విమర్శలు చేయడం, లాయర్లతో ఘర్షణకు దిగి విమర్శలకు గురయ్యారు.

### తృణమూల్‌కు తపస్ రాయ్ రాజీనామా

కోల్‌కతా, మార్చి 5: తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తపస్ రాయ్ సోమవారం పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఆయన 1996 నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడం గమనార్హం. మున్సిపాలిటీ ఉద్యోగాల భర్తీలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఈడీ తన నివాసంలో సోదాలు చేసినా సీఎం మమత మాటమాత్రంగా ఖండించలేదంటూ కినుక వహించి ఈ నిర్ణయం తీసుకున్నారు. తాను ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నా ఏనాడూ మెడికల్ బిల్లులు పెట్టుకోలేదని, అలాంటిది తనపై ఈడీ దాడులు జరిగాయని వాపోయారు. ఆయన బీజేపీలో చేరే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

### బీజేపీలో చేరిన వారాణసీ మాజీ ఎంపీ రాజేశ్

న్యూఢిల్లీ, మార్చి 5: ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సీనియర్ నాయకుడు, వారాణసీ మాజీ ఎంపీ రాజేష్ మిశ్రా బీజేపీలో చేరారు. కాంగ్రెస్‌లో మొదలైన తన రాజకీయ జీవితం ఇక నుంచి బీజేపీకే అంకితమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షానికి వారాణసీ నియోజకవర్గంలో బూత్ కార్యకర్త దొరకడం కూడా గగనమేనని ఆరోపించారు. కాగా, మోదీ వరుసగా మూడోసారి వారాణసీ నుంచి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే.

### 12 నుంచి రైలు ప్రయాణికులకూ స్విగ్గీ సేవలు

న్యూఢిల్లీ, మార్చి 5: ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ రైలు ప్రయాణికులకు కూడా తమ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 12వ తేదీ నుంచి దక్షిణాదిలో తమ సేవలు అందించేందుకు సిద్ధమైంది. తొలివిడతలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నంతో పాటు కర్ణాటకలోని బెంగళూరు, ఒడిసాలోని భువనేశ్వర్ రైల్వేస్టేషన్లలో ఈ సేవలు ప్రారంభంకానున్నాయి. రాబోయే రోజుల్లో మరో 59 స్టేషన్లకు ఈ సేవలు విస్తరించనున్నట్టు స్విగ్గీ తెలిపింది. ఫుడ్ డెలివరీకి స్విగ్గీ, ఐఆర్‌సీటీసీ మధ్య మంగళవారం ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ప్రయాణికులు స్విగ్గీలో ఫుడ్ ఆర్డర్ చేయాలంటే ఐఆర్‌సీటీసీ యాప్‌ను వినియోగించాల్సి ఉంటుంది. అందులో పీఎన్ఆర్ నంబర్‌ను ఎంటర్ చేసి.. తాము కోరుకున్న ఆహారాన్ని, కావాల్సిన స్టేషన్‌లో డెలివరీ తీసుకోవచ్చు.

### ఫేస్‌బుక్, ఇన్‌స్టా సేవల్లో తీవ్ర అంతరాయం!

న్యూఢిల్లీ, మార్చి 5: ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సేవలు మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా యూజర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు తమ ఖాతాలు హ్యాక్ అయ్యాయేమోనని కంగారుపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా 90వేలకు పైగా ఫేస్‌బుక్ ఖాతాలు, 16వేలకుపైగా ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు స్తంభించిపోయాయంటూ రిపోర్టులు వచ్చాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టా సేవలు నిలిచిపోవడానికి కారణం తెలియరాలేదు. అయితే ఖాతాదారులు మాత్రం ఎక్స్ (ట్విటర్) వేదికగా తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. రాత్రి 10:30 ప్రాంతంలో సేవలు అందుబాటులోకొచ్చాయి.

### ప్రపంచ కుబేరుడుగా మళ్లీ అమెజాన్ అధినేత

సెంట్రల్ డెస్క్, మార్చి 5: ప్రపంచంలో అత్యంత ధనికుడుగా అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ నిలిచారు. ఎలాన్ మస్క్ నుంచి ఆయన ఈ స్థానాన్ని మళ్లీ దక్కించుకున్నారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం ఆయన ఆస్తి విలువ 200 బిలియన్ డాలర్లు. మస్క్ ఆస్తి విలువ 198 బిలియన్ డాలర్లకు తగ్గిపోయింది. మంగళవారం ప్రచురించిన బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం టెస్లా సీఈవో మస్క్ గత ఏడాది 31 బిలియన్ డాలర్ల సంపద కోల్పోయారు. ఇదే కాలంలో బెజోస్ సంపద 23 బిలియన్ డాలర్లు పెరిగింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేష్ అంబానీ, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ ఈ జాబితాలో 11, 12 స్థానాల్లో నిలిచారు. వారి సంపద 115, 104 బిలియన్ డాలర్లుగా ఉంది.

### ఫ్రాన్స్‌లో అబార్షన్ ఇక రాజ్యాంగ హక్కు

న్యూఢిల్లీ, మార్చి 5: ఫ్రాన్స్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అబార్షన్‌ను మహిళల రాజ్యాంగ హక్కుగా నిర్ణయిస్తూ తీసుకొచ్చిన బిల్లును ఫ్రాన్స్ పార్లమెంట్ ఆమోదించింది. సోమవారం జరిగిన ఉభయసభల (జాతీయ అసెంబ్లీ, సెనేట్) ప్రత్యేక ఉమ్మడి సమావేశంలో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. ఎంపీలు, సెనేటర్లు ఓటింగ్‌లో పాల్గొనగా ఈ బిల్లుకు మద్దతుగా 780 ఓట్లు, వ్యతిరేకంగా 72 ఓట్లు వచ్చాయి. ఆమోదం అనంతరం సభ్యులంతా లేచి నిలబడి కరతాళ ధ్వనులతో సంఘీభావం తెలిపారు. దీంతో.. అబార్షన్‌ను రాజ్యాంగ హక్కుగా గుర్తించిన తొలి దేశంగా ఫ్రాన్స్ చరిత్ర సృష్టించింది. బిల్లు ఆమోదం సందర్భంగా ఫ్రాన్స్ ప్రధాని గాబ్రియెల్ అటల్ మాట్లాడుతూ.. ఇకపై అబార్షన్ విషయంలో మహిళలు సొంతంగా నిర్ణయం తీసుకోవచ్చన్నారు.

### మాల్దీవులకు చైనా ఉచిత సైనిక సాయం

మాలె, మార్చి 5: భారత్‌తో దౌత్యపరమైన వివాదాలను పెంచుకుంటున్న మాల్దీవుల్లో పాగాకు చైనా సిద్ధమైంది. ఈ క్రమంలో ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా.. మాల్దీవులకు సైనిక సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. దీనిపై ఇరు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మాల్దీవుల రక్షణ శాఖ మంగళవారం వెల్లడించింది. సోమవారం మాల్దీవుల రక్షణ మంత్రి మహమ్మద్ ఘాసన్, చైనా మేజర్ జనరల్ జాంగ్ బావోకున్ ఈ ఒప్పందంపై సంతకాలు చేసినట్లు చెబుతూ.. చైనా ఉచితంగా సైనిక సహకారం అందజేస్తున్నట్లు వివరించింది. హిందూ మహాసముద్రంలో పాగాకు చైనా చేస్తున్న యత్నాలను అడ్డుకుంటున్న భారత్‌కు ఇది ఒకింత ఇబ్బందికరమైన పరిణామమే..! ఇప్పటికే శ్రీలంకకు చైనా దగ్గరైంది.

# సుప్రీం తీర్పు నిర్వీర్యానికి ఎత్తు!

**ఎలక్టోరల్ బాండ్ల వివరాలిస్తే గుట్టు రట్టవుతుందని బీజేపీకి భయం.. అందుకే ఎస్‌బీఐపై ఒత్తిడి: ఖర్గే**



న్యూఢిల్లీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎలక్టోరల్ బాండ్లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)ని వాడుకుంటోందని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. రాజ్యాంగవిరుద్ధమైన ఈ బాండ్ల స్కీంలో ప్రధాన లబ్ధిదారు బీజేపీయేనని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు నగదు చేసుకున్న ఎలక్టోరల్ బాండ్ల సమగ్ర వివరాలు ఈ నెల 6వ తేదీలోగా సమర్పించాలని సుప్రీంకోర్టు ఎస్‌బీఐని ఆదేశించగా.. జూన్ 30 వరకు గడువివ్వాలని బ్యాంకు సోమవారం కోర్టును ఆశ్రయించడంపై ఖర్గే మంగళవారం 'ఎక్స్'లో తీవ్రంగా స్పందించారు. సందేహాస్పద లావాదేవీలను కప్పిపుచ్చుకోవడానికి మోదీ సర్కారు ఎస్‌బీఐని కవచంలా వాడుకుంటోందని విమర్శించారు. 'జూన్ 15లోపు లోక్‌సభ ఎన్నికలు ముగుస్తాయి. ఆ తర్వాతే ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎస్బీఐ కోర్టుకు అందించాలని బీజేపీ కోరుకుంటోంది. అందుకే జూన్ 30 వరకు ఎస్‌బీఐ గడువు కోరింది. హైవేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పవర్ ప్లాంట్లు తదితర కాంట్రాక్టులను మోదీ అనుకూల పెట్టుబడిదారులకు కట్టబెట్టినందుకు బాండ్ల రూపంలో బీజేపీ సాగించిన అక్రమ లావాదేవీలను ప్రభుత్వం దాచిపెడుతోంది. బాండ్ల డోనర్లకు సంబంధించి 44,434 ఆటోమేటిక్ డేటా ఎంట్రీలను క్రోడీకరించి 24గంటల్లో వివరాలు ఇవ్వొచ్చని నిపుణులు చెబుతున్నారు. మరి ఎస్‌బీఐ 4నెలలు ఎందుకు అడుగుతోంది? మోదీ సర్కారు సుప్రీం తీర్పును కాలరాయడానికి ఎస్‌బీఐని పావుగా వాడుకుంటోంది' అని ఖర్గే విరుచుకుపడ్డారు.

### బీజేపీకి రూ.6,566 కోట్ల లబ్ధి: కాంగ్రెస్

2017 నుంచి గత ఆర్థిక సంవత్సరం వరకు అన్ని పార్టీలూ మొత్తం రూ.12 వేల కోట్ల విలువ చేసే ఎలక్టోరల్ బాండ్లు అందుకోగా.. అందులో సగానికి పైగా.. రూ.6,566.11 కోట్ల విలువ చేసే బాండ్లు ఒక్క బీజేపీకే వచ్చాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనతే ఢిల్లీలో తెలిపారు. "2018-23 నడుమ కేంద్ర ఏజెన్సీల చర్యలు ఎదుర్కొన్న 30 కంపెనీలు ఆ పార్టీకి రూ.335 కోట్లు విరాళంగా ఇచ్చాయని మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దని ఎస్‌బీఐపై మోదీ సర్కారు, బీజేపీ ఒత్తిడి తెస్తున్నాయి" అని ఆరోపించారు. ఒక్క క్లిక్‌తో ఐదు నిమిషాల్లో చేతుల్లోకి వచ్చే సమాచారాన్ని కోర్టుకు ఇవ్వడానికి అతిపెద్ద కంప్యూటరైజ్డ్ బ్యాంకుకు 4 నెలల సమయం ఎందుకని నిలదీశారు. 23 వేల బ్రాంచ్‌లు, 48 కోట్ల బ్యాంకు ఖాతాలు, 66 వేల ఏటీఎంలు కలిగి ఉన్న ఎస్‌బీఐకి కేవలం 22,217 ఎలక్టోరల్ బాండ్ల సమాచారం ఇవ్వడానికి నాలుగు నెలలు ఎందుకని ప్రశ్నించారు.

### కేంద్రానికి మేలు చేసేందుకే: ప్రశాంత్

ఎన్నికల బాండ్ల వివరాల వెల్లడితో కేంద్ర ప్రభుత్వానికి ఇబ్బంది లేకుండా.. దానికి ఎన్నికలయ్యేదాకా సమయం దక్కేందుకే ఎస్‌బీఐ గడువు కోరుతోందని ప్రముఖ లాయర్ ప్రశాంత్ భూషణ్ 'ఎక్స్'లో మంగళవారం ఆరోపించారు. తద్వారా బీజేపీకి అందిన రూ.10వేల కోట్ల విలువైన ఎన్నికల బాండ్ల వివరాలు వెంటనే బయటకు రాకుండా చూస్తుందన్నారు. ఎన్నికల బాండ్లు కొన్నవారు, వాటిని తీసుకున్న రాజకీయ పార్టీలకు సంబంధించి ఎస్‌బీఐ ఒక రహస్య సంఖ్యను నిర్వహిస్తుందని తెలిపారు.

## జై శ్రీరామ్ అనాలి.. ఆకలితో చావాలి

**నిరుద్యోగ యువతకు మోదీ పిలుపు ఇదే: రాహుల్**

న్యూఢిల్లీ, మార్చి 5: నిరుద్యోగం, ఆకలి సమస్యలతో చనిపోయే ప్రజలను ఆదుకోవాల్సిన ప్రధాని మోదీ, వారు జై శ్రీరామ్ అని అనాలని పిలుపునిస్తున్నారని రాహుల్‌గాంధీ విమర్శించారు. నిరుద్యోగ యువత రోజంతా ఫోన్లలో రీల్స్ చూడాలనీ, ఆ తర్వాత జై శ్రీరామ్ అంటూ ఆకలితో చనిపోవాలని మోదీ కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లోని సారంగపూర్‌లో మంగళవారం భారత్ జోడో న్యాయ యాత్ర కొనసాగింది. సారంగపూర్‌లో పాదయాత్ర చేస్తున్న రాహుల్‌ను ఉద్దేశించి కొందరు బీజేపీ యువ కార్యకర్తలు.. 'జై శ్రీరామ్.. జై శ్రీరామ్..', 'మోదీ.. మోదీ..' అంటూ నినాదాలు చేశారు. వారిని ఉద్దేశించి ఆయన కొద్దిసేపు మాట్లాడారు. అగ్నిపథ్ పథకం యువత అవకాశాలను హరించిందన్నారు. "సైన్యంలో యువతకు రెండు రకాల హామీలు ఉండేవి. గతంలో వారికి పెన్షన్ ఇచ్చేవారు. సర్వీసులో చనిపోతే తగిన గౌరవం లభించేది. మోదీ ప్రభుత్వంలో ఈ రెండింటికీ యువత దూరమైంది. అగ్నిపథ్ పథకానికి నాలుగు ఎంపికైతే, నాలుగేళ్ల తర్వాత వారిలో ముగ్గురిని సైన్యం నుంచి పంపించివేస్తారు. ఆ ముగ్గురూ ఎస్సీలు, ఎస్టీలు, బీసీలే అయి ఉంటారు" అని రాహుల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 'తమిళనాడు ప్రజలు జైశ్రీరామ్ నినాదాన్ని గానీ, 'భారత్‌మాత' నినాదాన్ని గానీ అంగీకరించరు' అని వ్యాఖ్యానించి డీఎంకే ఎంపీ రాజా మరో వివాదంలో చిక్కుకున్నారు. రాజా వ్యాఖ్యలపై కేంద్ర బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు.

## ఉష్ణోగ్రతలు

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| హనుమకొండ | 36.0 | 19.2 |
| ఖమ్మం | 36.0 | 23.0 |
| నల్లగొండ | 36.0 | 24.2 |
| హైదరాబాద్ | 35.5 | 22.5 |

## 'ఎల్‌నినో' తగ్గినా... వేసవిలో సెగలే!

**ఈసారి రికార్డు ఉష్ణోగ్రతలు: డబ్ల్యూఎంవో**

న్యూఢిల్లీ, మార్చి 5: ఎల్‌నినో బలహీనపడినప్పటికీ పసిఫిక్ మహాసముద్రం ఉపరితలం నుంచి వచ్చే వేడిగాలులతో దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ మార్చి నుంచి మే నెల వరకూ సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంవో) హెచ్చరించింది. మార్చి-మే నెలల్లో ఎల్‌నినో కొనసాగడానికి 60% అవకాశం ఉండగా, ఏప్రిల్ నుంచి జూన్ వరకూ తటస్థ పరిస్థితులు నెలకొనడానికి 80% అవకాశం ఉందని డబ్ల్యూఎంవో అంచనా వేసింది. 2023 జూన్ నుంచి ప్రతి నెలా సరికొత్త ఉష్ణోగ్రత రికార్డును నెలకొల్పింది. దీనికి ఎల్‌నినో కూడా కొంతవరకూ దోహదం చేసింది. ప్రపంచవ్యాప్తంగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు గత 10 నెలలుగా అసాధారణంగా పెరగడం ఆందోళనకరం' అని డబ్ల్యూఎంవో సెక్రటరీ జనరల్ సెలస్టే సౌలో పేర్కొన్నారు. కాగా, జూన్ నుంచి తటస్థ పరిస్థితులు ప్రారంభమై ఆగస్టు నాటికి లానినా మొదలవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

## మనీలాండరింగ్ కేసులో డీకే శివకుమార్‌కు ఊరట

**కేసును కొట్టేసిన సుప్రీంకోర్టు**



బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు ముందు కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు అతిపెద్ద ఊరట లభించింది. ఆయనపై ఈడీ దాఖలు చేసిన మనీల్యాండరింగ్ కేసును సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ధర్మాసనం ఈ కీలకతీర్పునిచ్చింది. 2017 ఆగస్టు 2న ఆదాయ పన్నుశాఖ అధికారులు బెంగళూరు, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో ఏకకాలంలో డీకే శివకుమార్ ఇళ్లు, కార్యాలయాలపై దాడులు నిర్వహించారు. ఆ సందర్భంలో ఆయన ముఖ్య అనుచరుడి వద్ద లభించిన భారీ నగదును డీకే శివకుమార్ బినామీ ఆస్తిగా పరిగణించిన ఈడీ, మనీ ల్యాండరింగ్ కేసుగా మార్చి.. ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆ కేసును రద్దు చేయాలని కోరుతూ డీకే శివకుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసుకున్నా తీర్పు సానుకూలంగా రాలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు 120-బి పరిధిలోకి రాదని, ఈడీ వాదన చెల్లదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసు నుంచి విముక్తి పొందిన తర్వాత శివకుమార్ బెంగళూరులో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ...ఎట్టకేలకు న్యాయమే గెలిచిందని అన్నారు.

# ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి

- ఆయనపై ఆరోపణలను ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయింది
- బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ తీర్పు
- సుప్రీంకోర్టులో సవాల్ చేసిన మహారాష్ట్ర



నాగ్‌పూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై గత పదేళ్లుగా జైలులో ఉన్న ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాను బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ నిర్దోషిగా ప్రకటించింది. సాయిబాబాపై ఉన్న ఆరోపణలను నిరూపించటంలో ప్రాసిక్యూషన్ పూర్తిగా విఫలమైందని ధర్మాసనం పేర్కొంది. 54 ఏళ్ల సాయిబాబాపై ఉన్న యావజ్జీవ కారాగార శిక్షను కోర్టు కొట్టివేసింది. ఆయనతోపాటు ఇదే కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న హేమ్ మిశ్రా, మహేష్ టిర్కీ, నారాయణ్ సాంగ్లీకర్, ప్రశాంత్ రాహి, పాండు నరోటెలు కూడా నిర్దోషులేనని తీర్పు చెప్పింది. ఈ ఆరుగురిలో పాండు నరోటె ఇప్పటికే మరణించారు. జస్టిస్ వినయ్ జోషి, జస్టిస్ వాల్మీకి ఎస్ఏ మెంజెస్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ తీర్పు ఇచ్చింది. నిందితులపై ఉగ్రవాద కార్యకలాపాల వ్యతిరేక చట్టం ఉపా కింద అభియోగాలు నమోదు చేయటానికి గతంలో ప్రాసిక్యూషన్‌కు లభించిన అనుమతి చెల్లదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసులో గతంలో విచారణ కోర్టు ఇచ్చిన తీర్పు న్యాయసూత్రాల మేరకు లేదని, కాబట్టి దానిని పక్కనపెట్టి నిందితులందరినీ విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నామని తెలిపింది. కాగా, తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేయటానికి వీలుగా తీర్పు అమలును ఆరు వారాలపాటు నిలిపివేయాలని ప్రాసిక్యూషన్ న్యాయవాది మౌఖికంగా కోర్టును కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. స్టే కోరుతూ విజ్ఞాపనను దాఖలు చేయమని ఆదేశించింది. ఈ నేపథ్యంలో, మహారాష్ట్ర ప్రభుత్వం బాంబే హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

### ఇంటికి తిరిగొచ్చే వరకూ ఆందోళనే!

ప్రొఫెసర్ సాయిబాబాను హైకోర్టు విడుదల చేస్తూ తీర్పు ఇవ్వటంపై ఆయన భార్య వసంత కుమారి హర్షం వ్యక్తం చేశారు. చాలా సంతోషంగా ఉందని, అయితే, 2022లో కూడా ఇలాగే తీర్పు వచ్చినప్పటికీ.. ఆ తీర్పును ప్రభుత్వం సవాల్ చేసిందని, కాబట్టి, ఈసారి సాయిబాబా ఇంటికి వచ్చే వరకూ కుటుంబమంతా ఆదుర్దాగానే ఎదురు చూస్తుంటామని తెలిపారు. తన భర్త జైలులో ఉన్న పదేళ్లు తమకు మానసికంగానేగాక ఆర్థికంగానూ సవాళ్లతో కూడుకున్న కష్ట కాలమని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిబాబా తరఫు న్యాయవాది ఇందిరా జైసింగ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'సాయిబాబాను పదేళ్ల తర్వాత నిర్దోషిగా తేల్చారు. ఆ నష్టానికి బాధ్యులెవరు' అని ప్రశ్నించారు.

### మావోయిస్టులతో భేటీకి ఏర్పాటు చేశారని..

ఐదేళ్ల వయసులోనే పోలియో సోకడంతో సాయిబాబాకు 90 శాతానికిపైగా వైకల్యం ఏర్పడింది. చిన్ననాటి నుంచే ఆయన వీల్‌ఛైర్‌కు పరిమితమయ్యారు. ఢిల్లీ యూనివర్సిటీకి అనుబంధంగా ఉండే రామ్‌లాల్ ఆనంద్ కాలేజీలో సాయిబాబా ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పని చేసేవారు. ఆయనకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని పోలీసులు పలుమార్లు ఆరోపించారు. మావోయిస్టులతో భేటీ కానున్నారనే ఆరోపణలపై హేమ్ మిశ్రా, ప్రశాంత్ రాహీలను పోలీసులు 2013లో అరెస్టు చేశారు. వారు మావోయిస్టులను కలిసేందుకు ప్రొఫెసర్ సాయిబాబా ఏర్పాటు చేశారని 2014లో మహారాష్ట్ర పోలీసులు సాయిబాబాను ఢిల్లీలోని ఆయన ఇంటిలోనే అరెస్టు చేశారు. అప్పటి నుంచి నాగ్‌పూర్ సెంట్రల్ జైలులో ఉన్నారు.

# సందేశ్‌ఖాలీ అల్లర్ల కేసులు సీబీఐకి

- ఈడీ అధికారులపై దాడి చేయించిన షాజహాన్ కూడా సీబీఐ కస్టడీకే
- సీబీఐ, రాష్ట్ర పోలీసుల ఉమ్మడి సిట్ రద్దు
- కలకత్తా హైకోర్టు ఆదేశం



కోల్‌కతా/న్యూఢిల్లీ, మార్చి 5: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో జరిగిన అల్లర్లపై దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ మంగళవారం కలకత్తా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈడీ అధికారులపై టీఎంసీ నేత షాజహాన్ మద్దతుదారుల దాడి, దీనిపై నమోదైన కేసులను కూడా సీబీఐకి అప్పగించాలని ఆదేశించింది. అంతకుముందు ఈ సంఘటనలపై విచారణకు సీబీఐ, రాష్ట్ర పోలీసులతో సిట్‌ను ఏర్పాటు చేయాలని జనవరి 17న ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను తాజాగా హైకోర్టు రద్దు చేసింది. అయితే, గతంలో ఏకసభ్య ధర్మాసనం ఆదేశాలను సవాలు చేస్తూ అటు ఈడీతో పాటు రాష్ట్ర పోలీసులు కూడా హైకోర్టు డివిజన్ బెంచ్ ముందు అప్పీలు చేశారు. దర్యాప్తును కేవలం తమకే అప్పగించాలని రాష్ట్ర పోలీసులు, కేవలం సీబీఐ చేతనే దర్యాప్తు జరిపించాలని ఈడీ అధికారులు కోరారు. దాంతో సిట్ బదులు సీబీఐ దర్యాప్తు చేస్తుందని డివిజన్ బెంచ్ తెలిపింది. నిందితుడు షాజహాన్‌ను వెంటనే సాయంత్రం 4.30 గంటలకల్లా సీబీఐ కస్టడీకి అప్పగించాలని ఆదేశించింది. ఆయనను కస్టడీలోకి తీసుకోవడానికి పారామిలటరీ దళాల సాయంతో సీబీఐ బృందం కోల్‌కతాలోని సీఐడీ కార్యాలయానికి వెళ్లింది. ఈ సందర్భంగా రాష్ట్ర పోలీసుల తీరుపై హైకోర్టు తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. వారు పూర్తిగా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించింది. నిందితుడ్ని రక్షించడానికి దర్యాప్తులో ప్రతిసారీ ఆలస్యం చేస్తున్నారని పేర్కొంది. అయితే, హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పుపై బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఇదిలా ఉండగా, షాజహాన్‌కు కోల్‌కతా, సందేశ్‌ఖాలీలో ఉన్న రూ.12.78 కోట్ల ఆస్తులను అటాచ్ చేసినట్టు ఈడీ తెలిపింది.

### రాష్ట్రపతి పాలన విధించండి

సందేశ్‌ఖాలీ అలర్లపై క్షేత్రస్థాయిలో దర్యాప్తు జరిపిన జాతీయ మహిళా కమిషన్ మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి నివేదిక సమర్పించింది. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని సిఫార్సు చేసింది. పోలీసులు, టీఎంసీ కార్యకర్తలు తమను వేధిస్తున్నారని పలువురు మహిళలు చెప్పినట్లు పేర్కొంది. సందేశ్‌ఖాలీలోనే కాకుండా రాష్ట్రంలో పలుచోట్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. అంతకు ముందు జాతీయ ఎస్సీ కమిషన్ కూడా రాష్ట్రపతి పాలన విధించాలని సిఫార్సు చేయడం గమనార్హం.

# జైలు నుంచే బెంగళూరు పేలుళ్ల కుట్ర!

- ఏడు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు
- ఐదుగురు అనుమానితులు అదుపులోకి

బెంగళూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో శుక్రవారం పేలుళ్లకు పాల్పడిన ఘటనలో ఐదుగురు అనుమానితులను ఎన్ఐఏ మంగళవారం తమిళనాడులో అదుపులోకి తీసుకుంది. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక సహా 7 రాష్ట్రాల్లోని మొత్తం 17 ప్రదేశాలలో ఎన్ఐఏ సోదాలు జరిపింది. హార్డ్ డిస్క్‌లు, పెన్‌డ్రైవ్‌లతో పాటు కొన్ని పత్రాలను కూడా స్వాధీనం చేసుకుంది. 16 మందికి నోటీసులు జారీ చేసింది. బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న అనుమానిత ఉగ్రవాదులు జైలు నుంచే విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నారని ఎన్ఐఏ గుర్తించింది. రామేశ్వరం కేఫ్‌లో పేలుడు కూడా అందులో భాగమేనని భావిస్తోంది. కీలకసూత్రధారులుగా భావిస్తున్న లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన టి.నాసిర్, జునైద్ అహ్మద్‌ల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా, కర్ణాటక సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లకు ఉగ్రవాదుల నుంచి బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. రామేశ్వరం ఘటన ట్రయల్ మాత్రమేనని, 2.5 మిలియన్ డాలర్లు చెల్లించకపోతే మరిన్ని విధ్వంసాలు సృష్టిస్తామని ఆ మెయిల్స్‌లో హెచ్చరించినట్టు సిద్దరామయ్య తెలిపారు. మరోవైపు, ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగిని చంపేస్తామన్న మహ్మద్ రసూల్ అనే వ్యక్తిపై కర్ణాటకలోని యాదగిరి జిల్లా సురపుర పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. యాదగిరి జిల్లాకు చెందిన మహ్మద్ రసూల్ తెలంగాణలోని హైదరాబాద్‌కు వెళ్లి స్థిరపడ్డాడు. అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు సురపుర పోలీసులు మంగళవారం మీడియాకు తెలిపారు.

## ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడి.. భారతీయుడి మృతి

జెరూసలేం, మార్చి 5: ఇజ్రాయెల్‌పై హిజ్బుల్లా మిలిటెంట్లు చేసిన క్షిపణి దాడిలో ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు భారతీయులు సహా ఏడుగురు విదేశీయులు గాయపడ్డారు. ఈ దుర్ఘటన ఉత్తర ఇజ్రాయెల్‌లో సోమవారం జరిగింది. బాధిత భారతీయులు ముగ్గురిని కేరళ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో హిజ్బుల్లా మిలిటెంట్లు లెబనాన్ నుంచి ఉత్తర ఇజ్రాయెల్ సరిహద్దు సమీపంలోని ఓ వ్యవసాయక్షేత్రంపై యాంటీ- ట్యాంక్ క్షిపణిని ప్రయోగించారని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. ఈ దాడిలో చనిపోయిన వ్యక్తిని కేరళలోని కొల్లామ్‌కు చెందిన పట్నిబిన్ మాక్స్‌వెల్(31)గా గుర్తించారు. గాయపడిన భారతీయులు బుష్ జోసెఫ్ జార్జ్(31), పాల్ మెల్విన్(28) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో జోసెఫ్ జార్జ్ భారత్‌లోని తన కుటుంబసభ్యులతో మాట్లాడారని అధికారులు తెలిపారు.

## టీఎస్ ఐసెట్-24 నోటిఫికేషన్ విడుదల

» రేపట్నుంచి దరఖాస్తుల స్వీకరణ.. జూన్ 4, 5 తేదీల్లో పరీక్షలు

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసిఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన టీఎస్ ఐసెట్-24 పరీక్ష నోటిఫికేషన్ మంగళవారం విడుదలైంది. ప్రవేశ పరీక్షను ఈ ఏడాది జూన్4, 5 తేదీల్లో మూడు సెషన్స్‌లో నిర్వహించనున్నట్లు ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ నర్సింహాచారి వెల్లడించారు. తెలంగాణలో 16 చోట్ల ఆంధ్రప్రదేశ్‌లో 4 కేంద్రాల్లో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 7 నుంచి ఏప్రిల్ 30 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ. 550, మిగతా వాళ్లు రూ. 750 రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మే 17 వరకు రూ. 250, మే 27 వరకు రూ. 500 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. దరఖాస్తులు సమర్పించిన తర్వాత ఏవైనా తప్పులు దొర్లితే మే 17 నుంచి 20వ తేదీ వరకు సవరించుకోవాలన్నారు. మే28 నుంచి హాల్‌టికెట్లు విడుదల చేయనున్నట్లు చెప్పారు. జూన్ 15న ప్రాథమిక కీ విడుదల చేస్తామని, జూన్ 16 నుంచి 19 వరకు అభ్యంతరాలను స్వీకరించి తుది కీతోపాటు ఫలితాలను జూన్ 28న వెల్లడిస్తామని చెప్పారు.

## త్వరలో టీఎస్‌టీపీపీ స్టేజ్-2 నిర్మాణం

» ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్, మార్చి 5: తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ) రెండో దశ (స్టేజ్ 2) నిర్మాణానికి తాము సిద్ధమని రామగుండం ఎన్టీపీసీ, టీఎస్‌టీపీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదిరిన తరువాత 2400 మెగావాట్ల (800 మెగావాట్ల 3 యూనిట్లు) స్టేజ్ 2 నిర్మాణ పనులు చేపడుతామని తెలిపారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీలో కేదార్ రంజన్ విలేకరులతో మాట్లాడారు. టీఎస్‌టీపీపీ స్టేజ్-2 ప్రాజెక్టు నుంచి 85 శాతం విద్యుత్ తెలంగాణాకే సరఫరా చేస్తామన్నారు. 2600 మెగావాట్ల రామగుండం ఎన్టీపీసీలో ఎఫ్‌జీడీ నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయని ఈడీ పాండు తెలిపారు. రామగుండంలో త్వరలో సోలార్ విద్యుత్‌ను విస్తరిస్తామని, కొత్తగా 176 మెగావాట్ల ప్రాజెక్టు నెలకొల్పుతామని ఈడీ తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలో నిర్మాణ పనులు మొదలుపెడుతామన్నారు.

## రూ.1,500కోట్ల బిల్లులను విడుదల చేయాలి

» లేదంటే ఎంపీ అభ్యర్థులుగా నామినేషన్లు వేస్తాం

» తెలంగాణ సర్పంచ్‌ల సంఘం నేతలు

నల్లకుంట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సర్పంచ్‌లకు చెల్లించాల్సిన రూ. 1,500 కోట్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి కొలను శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థులుగా నామినేషన్లు వేస్తామని, గ్రామాల్లోకి వచ్చే ప్రజాప్రతినిధులను అడ్డుకుంటామని హెచ్చరించారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఫైనాన్స్ నిధులు 30 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు ప్రజావాణి కార్యక్రమంలో ప్లానింగ్ కమిటీ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యావాణిని కలిసి వినతిపత్రం సమర్పించినట్లు వెల్లడించారు.

## 4+4 పీఎస్‌వో భద్రత కల్పించేలా ఆదేశించండి

» హైకోర్టులో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిటిషన్

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రత్యర్థుల నుంచి తనకు ముప్పు ఉందని, 4+4 పీఎస్‌వో(పర్సనల్ సెక్యూరిటీ) భద్రత కల్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈ పిటిషన్‌లో మధ్యంతర ఉత్తర్వులు జారీచేయడానికి హైకోర్టు నిరాకరించింది. సెక్యూరిటీ పెంచాలని శ్రీనివాస్ గౌడ్ గత డిసెంబరులోనే హోంశాఖ, డీజీపీకి దరఖాస్తు చేసుకున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై మంగళవారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఈనెల 19కి వాయిదా వేసింది.

## మ్యాన్‌హోల్స్‌లోకి బలవంతంగా దించొద్దు

» జాతీయ సఫాయి కర్మాచారి చైర్మన్ వెంకటేశన్

అఫ్జల్‌గంజ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కాంట్రాక్టర్లు మ్యాన్‌హోల్ పనులు చేపటేప్పుడు కార్మికులను బలవంతంగా లోపలికి దించకూడదని జాతీయ సఫాయి కర్మాచారి చైర్‌పర్సన్ వెంకటేశన్ అన్నారు. లోపలికి దిగాలంటూ కార్మికులను ఒత్తిడి చేసేవారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఇటీవల హైదరాబాద్‌లోని జియాగూడ బైపాస్ రోడ్డులో ముగ్గురు కార్మికులు మ్యాన్‌హోల్‌లోకి దిగి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం ఘటనాస్థలాన్ని పరిశీలిం చారు. వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి, ఇతర అధికారులను అడిగి ప్రమాద తీరును తెలుసుకున్నారు. ఆ తర్వాత బాధిత కుటుంబాలకు వారికి రూ.10 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. మిగిలిన రూ.20 లక్షలను 15 రోజుల్లో చెల్లించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

# ఖరీఫ్ నుంచి 'ఉచిత' పంటల బీమా!

## రైతులు నయాపైసా చెల్లించక్కర్లేదు.. ప్రభుత్వమే మొత్తం చెల్లించాలని నిర్ణయం

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు శుభవార్త..! రాష్ట్రంలో పంటల బీమా పథకం(క్రాప్ ఇన్సూరెన్స్) పథకం అమలుపై కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. వచ్చే ఖరీఫ్(వానాకాలం) సీజన్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'ఉచిత పంటల బీమా' పథకాన్ని అమలుచేయాలని రేవంత్‌రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. రైతులపై నయాపైసా ఆర్థికభారం పడకుండా.. రాష్ట్ర సబ్సిడీతోపాటు రైతుల తరుపున ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయించారు. 2020లో కేసీఆర్ హయాంలో 'ప్రధానమంత్రి పంటల బీమా పథకం' నుంచి బయటకు వచ్చిన విషయం తెలిసిందే..! ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ సర్కారు 'పీఎం-ఎఫ్‌బీవై' పథకంలో చేరటంతోపాటు.. పశ్చిమబెంగాల్ తరహాలో రైతుల ప్రీమియాన్ని కూడా భరించాలని నిర్ణయించింది.

### రాష్ట్ర ప్రభుత్వానికి భారమే..!

2016లోనూ ఈ పథకాన్ని ప్రారంభించినప్పుడు రైతుల వాటా పోగా.. మిగిలిన సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాయి. రైతుల వాటా వేర్వేరుగా ఉండేది. ఆహార ధాన్యాలు, నూనెగింజల పంటలకు ఖరీఫ్‌లో 2%, యాసంగిలో 1.5%, ఉద్యాన, వార్షిక వాణిజ్య పంటలకు 5%



మేర రైతులు తమ వాటాగా చెల్లించేవారు. ఇప్పుడు కేంద్రం తన సబ్సిడీ వాటాను 30శాతానికి తగ్గించింది. దీంతో ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం 70% సబ్సిడీ ప్రీమియం, పంట, సీజన్‌తో సంబంధం లేకుండా రైతుల వాటాను చెల్లించాల్సి ఉంటుంది. దీనివల్ల ప్రభుత్వంపై సీజన్‌కు రూ.1,500 కోట్ల చొప్పున ఏటా రూ. 3 వేల కోట్ల మేర భారం పడుతుంది. పశ్చిమబెంగాల్ కూడా పీఎం-ఎఫ్‌బీవై నుంచి వైదొలగింది. అయితే.. 'బంగ్లా సస్య బీమా యోజన' పేరుతో సొంతంగా పథకాన్ని అమలు చేస్తోంది. రైతులపై నయాపైసా భారం పడకుండా మొత్తం ప్రీమియాన్ని సర్కారే చెల్లిస్తోంది.

ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం కూడా రాష్ట్ర రైతులకు పశ్చిమ బెంగాల్ తరహాలో వెసులుబాటు కల్పించనుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఐదెకరాల్లోపు భూములు ఉన్నవారికి ఉచిత ప్రీమియం చెల్లించాలని రైతు సంఘాలు, వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం మాత్రం భూమిపై ఎలాంటి పరిమితి లేకుండా బీమాకు సిద్ధమైనట్లు తుమ్మల వివరించారు. "ఆటోమేషన్ ఆఫ్ యీల్డ్ ఎస్టిమేషన్(ఎస్‌టెక్) పద్ధతిలో వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకుంటాం" అని పేర్కొన్నారు.

### అక్షరసత్యాలుగా 'ఆంధ్రజ్యోతి' కథనాలు

గత ప్రభుత్వ హయాంలో పంటలబీమా పథకం అమలుచేయకపోవటంతో జరిగిన నష్టాలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే..! కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. జనవరి 4వ 'ఖరీఫ్ నుంచి పంటల బీమా!', ఫిబ్రవరి 11న 'పశ్చిమ బెంగాల్ తరహాలో పంటల బీమా!' శీర్షికలతో ప్రచురించిన కథనాలు ఇప్పుడు అక్షర సత్యాలయ్యాయి.

## మేడారం జాతర ఆదాయం 12.7 కోట్లు

హనుమకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతర ఆదాయం రూ.12,71,79,280 వచ్చింది. గతంలో కన్నా ఈసారి రూ.26,29,553 ఎక్కువ వచ్చింది. ఈసారి భక్తులు ఎక్కువగానే వచ్చినా.. హుండీ ఆదాయం పెద్దగా పెరగలేదు. కాగా, మేడారం హుండీల లెక్కింపు మంగళవారం ముగిసింది. భక్తుల నుంచి కానుకగా వచ్చిన 800 గ్రాముల బంగారం, 55 కిలోల 150 గ్రాముల వెండిని బ్యాంకులో భద్రపరిచారు. నాణేలను లెక్కించాల్సి ఉంది.



# నేటి నుంచి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'రైతునేస్తం'!

» నేడు సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో విస్తరణ కార్యకలాపాలను బలోపేతం చేయడం ద్వారా రైతులకు నూతన సాంకేతిక వ్యవసాయంపై అవగాహన కల్పించి వ్యవసాయ ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యంతో బుధవారం రైతు నేస్తం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతువేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్‌ను అనుసంధానంచేసే కార్యక్రమాన్ని బుధవారం సచివాలయం నుంచి సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని వెల్లడించారు. గతంలో ప్రతి ఐదు వేల ఎకరాలకు (క్లస్టర్) ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించి క్లస్టర్‌కు ఒక్కో రైతు వేదిక చొప్పున 2,601 రైతు వేదికలను నిర్మించినప్పటికీ అనుకున్న లక్ష్యాన్ని చేరలేకపోయామని అన్నారు. నిరుపయోగంగా ఉన్న రైతు వేదికలను ఉపయోగంలోకి తీసుకరావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రైతు వేదికల ద్వారా అధిక రాబడిని పొందడంలో, వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడంలో రైతులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. లాభసాటి ధరలు, మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు, అధిక ఉత్పాదకత, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడం లాంటి అంతిమ లక్ష్యాన్ని సాధించడం కోసం రైతులను సమూహాలుగా సంఘటితం చేయనున్నట్లు తెలిపారు. రైతులెదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకోవడానికి, కొత్త వ్యూహాలను రూపొందించడానికి, ప్రస్తుత వ్యవస్థను అప్ గ్రేడ్ చేయడానికి, వ్యవసాయ కార్యక్రమాలను బలోపేతం చేయడానికి 2,601 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్సింగ్ యూనిట్లను స్థాపించడానికి "రియల్ టైమ్ సొల్యూషన్ త్రూ డిజిటల్ ప్లాట్ ఫారమ్" అనే ప్రాజెక్టును ప్రభుత్వం ఆమోదించినట్లు తెలిపారు. మొదటగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 110 రైతు వేదికల్లో వీసీ యూనిట్లను ఏర్పాటుచేశామని, ఈ ఉగాది నాటికి మిగిలిన అన్ని రైతువేదికల్లో వీసీ యూనిట్లు ఏర్పాటుచేస్తామని తుమ్మల వెల్లడించారు. ఈ రైతువేదికలో శాస్త్రవేత్తలు, అధికారులు, రైతుల మధ్య పరస్పర విషయ మార్పిడి సులభతరం చేయడానికి, తక్షణ పరిష్కారాలు పొందడానికి జూమ్/యూట్యూబ్ లైవ్ ద్వారా రైతువేదికలను లింక్ చేయడం వీలవుతుందని తెలిపారు. విషయ నిపుణులు, ప్రగతిశీల రైతుల ద్వారా ప్రతి మంగళవారం, శుక్రవారం నేరుగా ఆన్‌లైన్ వేదికగా శిక్షణలు ఇవ్వనున్నట్లు తెలిపారు. తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టీఎస్‌టీఎస్ లిమిటెడ్) అవసరమైన సాంకేతిక మద్దతు, పరికరాల సరఫరాతో పాటు బీఎస్ఎన్ఎల్, టీఫైబర్ నుండి ఇంటర్నెట్ కనెక్టివిటీని అందించడానికి ప్రధాన ఏజెన్సీగా వ్యవహరించడానికి ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వీసీ యూనిట్లు రైతు నేస్తం' పేరుతో ప్రతి మంగళవారం, శుక్రవారం జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి నేరుగా ముఖాముఖి శిక్షణలు నిర్వహించనున్నట్లు చెప్పారు.



# విపక్ష నేతలు, ప్రముఖుల ఫోన్ల ట్యాపింగ్

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది. ఈ విషయాలను ప్రాథమికంగా నిర్ధారించుకున్నాకే.. ప్రణీత్‌రావును సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ విచారణ పూర్తయ్యేదాకా ప్రణీత్‌రావును రాజన్న-సిరిసిల్ల జిల్లా దాటరాదని, ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే.. ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి అని డీజీపీ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ప్రణీత్‌రావు కుట్రపూరితంగా ఫోన్లను ట్యాప్ చేయడం వల్ల త్వరలో అతనిపై క్రిమినల్ కేసులను నమోదు చేసే దిశగా దర్యాప్తు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల ఫలితాల రోజు ఎస్ఐబీ కార్యాలయంలో సీసీ కెమెరాలను నిలిపివేసేందుకు ప్రణీత్‌రావుకు సహకరించిన ఎలక్ట్రిషియన్, ఇతర సిబ్బందినీ నిఘా విభాగం అధికారులు ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నారు. మరికొందరు సిబ్బంది పైనా శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేశారు.

### ధ్వంసం చేసిన హార్డ్ డిస్క్‌లలో ఏముంది?

ప్రణీత్‌రావు ధ్వంసం చేసిన 42 హార్డ్ డిస్క్‌లలో ఏముంది? ఇప్పుడు ఈ అంశంపైనే నిఘా విభాగం దృష్టి సారించింది. ఎస్ఓటీలో మావోయిస్టులపై నిఘాకు సంబంధించిన సమాచారం ఉంటుంది. మావోయిస్టుల పేర్లు చెప్పి.. కాంగ్రెస్ నేతలు, ఇతర ప్రముఖుల కాల్స్‌ను ప్రణీత్‌రావు ట్యాపింగ్ చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అయితే.. ప్రణీత్‌రావు తాను ట్యాప్ చేసిన వివరాలతోపాటు.. మావోయిస్టులు, ఉగ్రవాదులకు సంబంధించిన డేటాను కూడా తుడిచిపెట్టి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేయాల్సిన అవసరమేమొచ్చిందనే అంశంపై అధికారులు దృష్టిసారించారు. ప్రణీత్‌రావు ఉదంతంతో మరోమారు ఫోన్‌ట్యాపింగ్ అంశం చర్చనీయాంశమైంది. నిజానికి ఒక వ్యక్తి ఫోన్‌ను ట్యాప్ చేయాలంటే.. దర్యాప్తు సంస్థలు ముందుగా కేంద్ర హోంశాఖ కార్యదర్శి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. గతంలోనూ ఈ అంశంపై కాంగ్రెస్-బీజేపీ మధ్య మాటల యుద్ధం జరిగిన విషయం తెలిసిందే..! మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు కేసులోనూ నందకుమార్ ముందు నుంచి తన ఫోన్‌ను ప్రభుత్వం ట్యాప్ చేస్తోందని ఆరోపిస్తూ వచ్చారు. రాష్ట్రానికి చెందిన కొందరు కాంగ్రెస్ నేతలు ఏకంగా తమ ఫోన్లు ట్యాప్ అవుతున్నాయంటూ హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు ప్రణీత్‌రావు అంశంతో ఈ వ్యవహారం మరోమారు చర్చనీయాంశమైంది.



# యూఏఈలోని భారత కార్మికులకు ప్రత్యేక బీమా

» సహజ మరణాలకూ వర్తింపు

» దుబాయ్‌లోని భారత కాన్సులేట్ వెల్లడి


(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దుబాయ్ సహా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని వివిధ ఎమిరేట్లలో పనిచేస్తున్న ప్రవాస భారతీయ కార్మికుల సంక్షేమం కోసం దుబాయిలోని భారతీయ కాన్సులేట్ లైఫ్ ప్రొటెక్షన్ ప్లాన్(ఎల్‌పీపీ) అనే వినూత్న పథకాన్ని ప్రకటించింది. ఇది సహజమరణాలకు కూడా వర్తించనుంది. సహజ, ప్రమాద మరణాలకు ఈ పథకం కింద రూ.8లక్షల నుంచి రూ.16 లక్షల వరకు బీమా లభిస్తుందని భారతీయ కాన్సుల్ జనరల్ సతీశ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఓరియంట్, గార్గశ్ బీమా కంపెనీలు దీన్ని సంయుక్తంగా అమలు చేస్తాయన్నారు. చట్టబద్ధ ఉపాధి వీసా కింద యూఏఈ వెళ్లిన 18-70ఏళ్లలోపు భారతీయులు ఈ పథకానికి అర్హులు. ఈ కార్మికులు సెలవులపై భారతదేశంలో ఉన్నప్పుడు కూడా పాలసీ వర్తిస్తుంది. కార్మికుల మృతదేహాలను పంపించడానికి రూ.2.70లక్షలు చెల్లించేలా పాలసీలో నిబంధనలున్నాయి. గడిచిన రెండేళ్లలో దుబాయిలోని భారత కాన్సులేట్ 2,613 మరణాలు నమోదు చేయగా అందులో 90% సహజమరణాలే అని తేలింది. యూఏఈ సహా గల్ఫ్ దేశాలన్నింటిలో ప్రవాస భారతీయుల కోసం రోడ్డు, వృత్తిపరమైన ప్రమాదాలకు మాత్రమే బీమా పథకం అమల్లో ఉంది. దీంతో సహజ మరణాలు సంభవించినప్పుడు కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం, మృతదేహాల తరలింపు ఇబ్బందిగా మారింది.

# బీజేపీ, కాంగ్రెస్ ముమ్మాటికీ ఒకటే

» ప్రాంతీయ పార్టీలు ఉండొద్దన్నదే వాటి లక్ష్యం

» విద్యార్థుల మరణాలపై సమీక్షించరా?: ఎమ్మెల్సీ కవిత



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

భిక్కనూరు/కామారెడ్డి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ పార్టీలు ఉండొద్దన్నదే.. బీజేపీ, కాంగ్రెస్ లక్ష్యమని, రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను బలహీనపరిచేందుకు ఆ రెండు కేంద్ర పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ ముమ్మాటికీ ఒక్కటేనని అన్నారు. ఆర్ఎస్ఎస్ మూలాలు ఉన్న రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని పెద్దన్న అనడంలో అతిశయోక్తి లేదని, ఆయన నిజ స్వరూపం బయటపడిందని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్క రూపాయీ కేటాయించని మోదీని ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు.

బోధన్ హాస్టల్‌లో జరిగిన ఘటనలో డిగ్రీ విద్యార్థి వెంకట్ మృతి చెందిన విషయం తెలిసిందే. కామారెడ్డి జిల్లాలోని తిప్పారంలో సదరు విద్యార్థి కుటుంబాన్ని మంగళవారం కవిత పరామర్శించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. విద్యార్థి వెంకట్ మృతి బాధాకరమన్నారు. హాస్టల్ వార్డెన్, వాచ్‌మన్ లేకపోవడం వల్ల జరిగిన ఘటనలో ఒకరు చనిపోగా.. పలువురు విద్యార్థులపై హత్యకేసు నమోదైందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందన్నారు. మృతుడి తల్లికి పింఛన్, సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.15లక్షల పరిహారం, ఒక డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలు వరుసగా జరుగుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. భువనగిరిలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలు నిరసన తెలిపితే అరెస్టు చేస్తారా!? ఇదేనా కాంగ్రెస్ చెబుతున్న మార్పు? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను విమర్శించడమే రేవంత్ పనిగా పెట్టుకున్నారని, విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సమీక్షించే సమయం కూడా ఆయనకు లేదని వ్యాఖ్యానించారు. ఎల్ఆర్ఎస్ పేరిట ఎలాంటి రుసుము తీసుకోకుండానే క్రమబద్ధీకరించాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## బ్యాంకు విప్పని గుట్టు

రాజకీయ పార్టీలకు ఎన్నికల బాండ్ల రూపంలో గుప్తనిధులను సమకూర్చిపెట్టే విధానానికి ఏకైక వ్యవహర్తగా, కర్తగా ఉన్న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సోమవారం సుప్రీంకోర్టుకు పెద్ద షాక్ ఇచ్చింది. ఎన్నికల బాండ్లు రాజ్యాంగవ్యతిరేకం అంటూ ఫిబ్రవరి 14న ఆ విధానాన్ని కొట్టివేసి, వాటి అమ్మకాలను నిలిపివేసిన సుప్రీంకోర్టు, గత నాలుగేళ్ళలో అమ్మిన బాండ్లు, వాటిని కొన్నవారి సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మార్చి 6వ తేదీలోగా బ్యాంక్ అందించాలనీ, ఈసీ ఆ వివరాలను మార్చి 13లోగా బహిర్గతపరచాలనీ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ తీర్పు వెలువడిన మూడు వారాలకు, గడువుకు కేవలం రెండు రోజుల ముందు, ఈ ప్రక్రియ అత్యంత సంక్లిష్టమైనదనీ జూన్ 30 వరకూ గడువు పెంచాలనీ సుప్రీంకోర్టుకు ఎస్‌బీఐ విన్నవించుకుంది. సార్వత్రిక ఎన్నికల్లోగా ఈ బాండ్ల సంగతి తేల్చి, గోప్యతను ఛేదించి, సమస్త వివరాలను ప్రజలకు అందించాలని సుప్రీంకోర్టు సంకల్పిస్తే, ఎస్‌బీఐ ఇప్పుడు ఆ సదాశయాన్ని వమ్ముచేయడానికి ప్రయత్నిస్తున్నది. కోర్టు ఆదేశాలకు కట్టుబడి ఉన్నానని అంటూనే ఎన్నికలు ముగిసేవరకూ రహస్యాన్ని దాచాలనుకుంటోంది.

సుప్రీం తీర్పును వమ్ముచేయకండి, అడ్డదారులు తొక్కకండి అని విపక్షపార్టీ నేతలతో సహా న్యాయకోవిదులు, మేధావులు అప్పట్లోనే ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. మోదీ ప్రభుత్వం ఆర్డినెన్సుతో తీర్పును వమ్ముచేయవచ్చునని కొందరు అనుమానించారు. ఇప్పుడు బ్యాంకును అడ్డుపెట్టుకొని మోదీ ప్రభుత్వం కొత్త కుట్రలకు తెరదీసిందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రోజూ లక్షలాది లావాదేవీలు నిర్వహించే భారతదేశపు అతిపెద్ద బ్యాంకుకు 22వేల ఎన్నికల బాండ్ల వివరాలను కోర్టుకు ఇవ్వడానికి నిజంగానే నాలుగున్నర నెలలు అవసరమా? దేశాన్ని డిజిటల్ ఇండియాగా మార్చేసిన తరువాత కూడా ఈ కాస్తంత సమాచారానికే నెలలకొద్దీ సమయం అడుగుతూ ఎస్‌బీఐ డైరెక్టర్లు ప్రధానిని అవమానిస్తున్నారని, వారిని శిక్షించాలని శివసేన నాయకుడు సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలో కాస్తంత వెటకారం ఉన్నా, సరైనదే. ఎన్నికల బాండ్ల విధానంలోనే తీవ్రమైన సంక్లిష్టత, గోప్యత, దాతలు వివరాలు దాచడం అంతర్లీనమైన విలువలు కనుక, బ్యాంకు తదనుగుణంగానే వాటిని కంప్యూటర్‌లో దాచకుండా, పాలకులకు ప్రీతిపాత్రమైన సీల్డ్ కవర్ మార్గాన్నే అనుసరించింది. బాండు కొన్నవారి వివరాలు ఒక సీల్డు కవరులో, రాజకీయపార్టీలు నగదుగా మార్చుకుంటున్న సందర్భంలో ఆ వ్యవహారం వివరాలు మరో సీల్డుకవర్‌లో వేర్వేరుగా ఉంచి, వాటిని ఒకదానితో ఒకటి సరిపోల్చి అతుకువేయడానికి తనకు మరింత సమయం కావాలని అడుగుతోంది. బాండ్ల సంఖ్య వంటి అతికొన్ని వివరాలు డిజిటల్ రూపంలో, కొనుగోలుదారు పేరు, కెవైసీ ఇత్యాది కీలకమైన వివరాలు ఫిజికల్‌గా రికార్డు అయివున్నందున పనిచక్కబెట్టడం సులభం కాదని అంటోంది. దశాబ్దాల క్రితమే బ్యాంకులు రాతకోతలు వదిలేసి, కంప్యూటర్ల వాడకం ఆరంభిస్తే, డిజిటల్ లావాదేవీల్లో అగ్రస్థానంలో ఉన్న ఓ అతిపెద్ద బ్యాంకు ఎన్నికల బాండ్ల లావాదేవీలకు మాత్రం కాగితాలనే వాడటం ఆశ్చర్యం. దేశంలో ఒకచోట ఒక కార్పొరేట్ కంపెనీ ఈ బాండ్లు కొంటే, రాజకీయ పార్టీలు వేరొకచోట నగదుగా మార్చుకుంటే, వాటిని అమ్మిన, స్వీకరించిన బ్రాంచ్‌లన్నీ ఆ వివరాలన్నీ కాగితాలమీద రాయడం, సీల్డు కవర్లలో దాచడం విచిత్రమైన విన్యాసం. తద్వారా, ఒక దాత పదికోట్ల రూపాయల బాండ్లు కొంటే, అతడి చేతికి కోటి విలువైన బాండ్లు పది ఇస్తే పది కవర్లు తయారవుతాయి. వాటిని వేర్వేరు బ్రాంచ్‌లలో వేర్వేరు పార్టీలు నగదుగా మార్చుకున్నప్పుడు మరిన్ని సీల్డు కవర్లు తయారవుతాయి. నాలుగేళ్ళలో అమ్మిన బాండ్ల సంఖ్య 22వేలు కావచ్చుకానీ, కంప్యూటర్‌లను వాడకుండా, సీల్డు కవర్లను మాత్రం అధికంగా తయారుచేసి బ్యాంకు పాలకుల ఆశయాన్ని చక్కగా నెరవేర్చింది.

ఇక, దేశవ్యాప్తంగా 29 బ్రాంచ్‌లలో బాండ్ల లావాదేవీలు ఎన్ని జరిగినా, సీల్డు కవర్లన్నీ ముంబైలోని ప్రధాన కార్యాలయానికే చేరినందున వాటిని సరిపోల్చడానికీ, జతచేయడానికీ నిజంగానే అన్ని నెలలు పడుతుందా? దాతల, స్వీకర్తల వివరాలను గుదిగుచ్చి, రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూండమని 2019లోనే సుప్రీంకోర్టు చెప్పిన నేపథ్యంలో, బ్యాంకు ఆ ఆదేశాలను ఉల్లంఘించి అయినా ఉండాలి, ఇప్పుడు కోర్టుకు అబద్ధమైనా చెప్పివుండాలి. బ్యాంకు అభ్యర్థన వెనుక రాజకీయ పెద్దల ప్రమేయం ఉన్నదా లేదా అన్నది అనవసరం. కానీ, తన ఆదేశాన్ని బేఖాతరుచేసి, సదాశయాన్ని వమ్ము చేయడానికి ప్రయత్నిస్తున్న బ్యాంకును ఓ నాలుగు చీవాట్లు పెట్టి, చివరకు దాని ఒత్తిడికే లొంగిపోవడం కాక, సుప్రీంకోర్టు తీవ్రంగా, భిన్నంగా వ్యవహరించడం అవసరం.

---

తెలంగాణ రాష్ట్రంలోని అతి పెద్ద నియోజకవర్గమైన మంథనిలో ల్యాండ్ లైన్‌తో సహా ఏ విధమైన నవీన సమాచార వ్యవస్థ లేని ఆ కాలంలో ఉత్తరాల ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకుంటూ వాటి పరిష్కారానికై బస్సులో జిల్లా కేంద్రం కరీంనగర్, రాజధాని హైదరాబాద్‌కు రాక పోకలు సాగించిన శ్రీపాదరావు తరహా నాయకులను ఈ కాలంలో ఊహించగలమా?

## ప్రజల మనిషి శ్రీపాదరావు

సమాజ హితమే ధ్యేయంగా, ప్రజల సేవలో నిస్వార్థంగా నిరంతరం నిమగ్నమయ్యే నాయకుల తరం దాదాపుగా అంతరించిపోతోంది. వ్యాపార ప్రయోజనాల కోసమే రాజకీయాలలోకి వచ్చి చట్టసభలలో తిష్టవేసేవారు గణనీయంగా పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో నిన్నటి నాయకోత్తములను స్మరించుకోవడాన్ని సైతం సమాజం విస్మరిస్తోంది. కాల వైపరీత్యం!

అడవులు, నదులు, వాగులు, వంకల మధ్య కాలినడకన లేదా ఎండ్ల బండ్లపై గ్రామ గ్రామానికి వెళుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించే నాయకులు ఉండే వారంటే ఇప్పటి తరానికి ఒకింత ఆశ్చర్యం కూడ కలుగవచ్చు. గోదావరి, ప్రాణహిత, మానేరు నదులు పారుతూ అడవులు విస్తారంగా ఉన్న మంథని ఒక విలక్షణ ప్రాంతం.

వేద పండితులకు నెలవుగా, వేద ఘోషల మంత్రపురిగా పేరొందిన మంథనికి తెలంగాణ తొలితరం విద్యావేత్త ముద్దు రామకృష్ణయ్య (1907–85), తొలి తెలుగు ప్రధాని పీవీ నరసింహారావు దాకా పలువురు మహానుభావులను తెలుగు నేలకు, విశాల భారతదేశానికి అందించిన సుప్రసిద్ధ చరిత్ర ఉన్నది. ఆ జన హితుల, నాయక శ్రేష్ఠుల కోవలోనివాడే దివంగత దుద్దిళ్ళ శ్రీపాదరావు (1935–99). గ్రామపంచాయితి స్థాయిలో రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టి శాసనసభ స్పీకర్ పదవి నిర్వహించి, ఒక దశలో ముఖ్యమంత్రి పదవికీ పోటీపడిన విలక్షణ నేత ఆయన.

తెలంగాణ రాష్ట్రంలో భౌగోళిక విస్తీర్ణంలో అతి పెద్ద నియోజకవర్గమైన మంథనిలో ల్యాండ్‌లైన్‌తో సహా ఏ విధమైన నవీన సమాచార మార్పిడి వ్యవస్థ లేని ఆ కాలంలో

**గల్ఫ్ లేఖ**

ఉత్తరాల ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకుంటూ వాటి పరిష్కారానికై బస్సులో జిల్లా కేంద్రం కరీంనగర్, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రాకపోకలు సాగించిన శ్రీపాదరావు తరహా నాయకులను ఈ కాలంలో ఊహించగలమా? సొంత నియోజకవర్గంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు చివరి గ్రామాలకు సాగు నీరు అందడం లేదన్న ఫిర్యాదుతో ఆయన నాలుగు గంటల బస్సు ప్రయాణం చేసి జగిత్యాలకు వచ్చి ప్రాజెక్టు అధికారుల వద్దకు వెళ్లేవారు. ఎలాంటి వ్యక్తిగత భద్రత (ఆ కాలంలో శాసనసభ్యులు ఎవరు కూడ గన్‌మాన్లను కోరుకునేవారు కాదు) లేకుండా అటవీ గ్రామాలలో తిరుగుతూ అందరికీ అందుబాటులో ఉండేవారు.



మంథని అడవులలో పని చేయడాన్ని ఒక శిక్షగా ప్రభుత్వ ఉద్యోగులు భావించే వారు. సాధారణంగా సస్పెన్షన్‌కు బదులుగా మంథని, మహాదేవపూర్ తాలుకాలకు ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేయడం పరిపాటిగా ఉండేది. ఇటువంటి ప్రతికూల పరిస్థితులలో తన నియోజకవర్గంలో విధులు నిర్వహించడానికి శ్రీపాదరావు ప్రభుత్వ ఉద్యోగులను ఒప్పించుకుని తీసుకువచ్చేవారు.

మహారాష్ట్ర సీనియర్ నాయకుడు, లోక్‌సభ స్పీకర్, మాజీ కేంద్ర హోం మంత్రి అయిన శివరాజ్ పాటిల్‌తో కలిసి ఉస్మానియా విశ్వవిద్యాలయ హస్టల్‌లో ఒక గదిలో ఉండి చదువుకున్న శ్రీపాదరావు పీవీ నరసింహారావుకూ ఆప్తుడు. అయినా తన దైనందిన ప్రజాజీవితంలో ఆ సాన్నిహిత్యాన్ని ఆయన ఎప్పుడు వాడుకోలేదు.

1983 ఎన్టీఆర్ ప్రభంజనంలో సైతం శ్రీపాదరావు శాసన సభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత వరుసగా మూడుసార్లు ఎన్నికయినా 1994లో ఓటమి పాలయ్యారు. 1999లో శ్రీపాదరావును నక్సలైట్లు హతమార్చారు. నక్సలైట్ల దుశ్చర్యపై సర్వత్రా నిరసన వ్యక్తమయింది.

డి.జి.పిగా పని చేసి పదవి విరమణ చేసిన యం. మహేందర్ రెడ్డి తన ఉద్యోగ జీవితాన్ని ఏయస్పిగా గోదావరిఖని నుంచి ప్రారంభించారు. అప్పుడు ఆయన పరిధిలోకి వచ్చే మంథని నక్సలైట్ల ప్రాబల్య ప్రాంతంలో ఉండడంతో శ్రీపాదరావు భద్రత ఆయనకు ఒక ఆందోళనకరమైన ఆంశంగా ఉండేది. అయితే శ్రీపాదరావు స్వీయ భద్రత గరించి పట్టించుకునేవారు కాదు. తాను ప్రజల మనిషినని వారి మధ్య ఉంటూ సమయం వచ్చినప్పుడు అదే మట్టిలో కన్ను మూస్తానని ఆయన తరచు అనేవారు.

శ్రీపాదరావు హత్యానంతరం ఆయన వారసుడుగా ఆయన కుమారుడు శ్రీధర్‌బాబు రాజకీయాలలోకి ప్రవేశించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో పరిశ్రమలు, ఐ.టి మంత్రిగా న్యూ ఢిల్లీలోని అధికార వర్గాలలో గుర్తింపు పొందుతున్నారు. ఆయన ఇటీవల తన తండ్రి జయంతిని అధికారికంగా నిర్వహించారు.

రాజనీతిజ్ఞుడు పీవీ నరసింహారావు, విద్యావేత్త ముద్దు రామకృష్ణయ్య, కార్యదక్షుడు శ్రీపాదరావు వంటివారితో పాటు పలువురు ఆధ్యాత్మిక, అభ్యుదయ, విప్లవ రచయితలతో పాటు దేశంలోను, విదేశాలలోనూ కీలక ఇంజినీరింగ్ రంగాలలో నిష్ణాతులయిన నిపుణులు కూడా ఎంతో మంది మంథని నుంచి ప్రభవించారు. శ్రీపాదరావు జయంత్యుత్సవాలకు ఏటా విదేశాల నుంచి కూడా కొంత మంది విచ్చేస్తుంటారు.

అవసరం లేకున్నా భద్రత సిబ్బంది, అనుచరగణం హంగామా, డాబు దర్పాలతో కార్లలో తిరిగితే మాత్రమే శాసన సభ్యులుగా గౌరవం పొందే ఈ కాలంలో శ్రీపాదరావు తరహా నాయకుల పేర ఉత్సవాలు నిర్వహించడం మాత్రమే కాదు, కనీసం కొంత మేరకయినా వారి అడుగుజాడలలో నడిచేందుకు ప్రయత్నించాలి. అదే శ్రీపాదరావుకు నిజమైన నివాళి.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

---

# సుప్రీం తీర్పుతో వ్యవస్థలు మారేనా?



■ ఎ. కృష్ణారావు

**ఇండియాగేట్**

ఈ దేశంలో వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కలిగించడం గురించి ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడడం చెప్పుకోదగ్గ విషయమే. చట్టసభల్లో ఓటు వేసేందుకు, ప్రసంగించేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు ముడుపులు తీసుకుంటే వారిపై అవినీతి నిరోధక చట్టం క్రింద చర్యలు తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు సోమవారం వెలువరించిన తీర్పు వెలువడిన క్షణాల్లోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం ప్రకటించారు. ఈ తీర్పు రాజకీయాలను అవినీతి నుంచి ప్రక్షాళనం చేసేందుకు, వ్యవస్థలపై ప్రజలకు ప్రగాఢమైన నమ్మకాన్ని కలుగచేసేందుకు దారితీస్తుందని మోదీ అన్నారు.

చట్టసభల్లో ఓటింగ్ చేసేందుకు సభ్యులు ముడుపులు తీసుకునే విషయంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వెనుక మూడు దశాబ్దాల చరిత్ర ఉన్నది. 1993 జూలైలో పీవీ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు వామపక్షాలకు బీజేపీ కూడా మద్దతు నిచ్చింది. తమ మధ్య సైద్ధాంతిక విభేదాలు వారి లక్ష్యానికి అడ్డు రాలేదు. ప్రధానమంత్రి కావాలన్న ఆకాంక్షతో ఉన్న కాంగ్రెస్ నేత అర్జున్ సింగ్‌తో పాటు పలువురు పీవీ ప్రభుత్వం పడిపోయేందుకు తెరవెనుక తమ వంతు ప్రయత్నాలు చేశారు. అంతర్గత, బహిర్గత ప్రత్యర్థుల మధ్య చివరకు అవిశ్వాస తీర్మానం వీగిపోయి పీవీ ప్రభుత్వం 14 ఓట్లతో గట్టెక్కింది. జనతాదళ్ నుంచి రాంలఖన్ యాదవ్ నేతృత్వంలో విడిపోయిన ఏడుగురు సభ్యులతో పాటు నలుగురు జేఎంఎం సభ్యులు మద్దతు నిచ్చారు. ములాయం వర్గానికి చెందిన ముగ్గురు ఎంపీలు, బిఎస్‌పికి చెందిన ముగ్గురు ఎంపీలు గైరుహాజరయ్యారు. జనతాదళ్ (ఏ) నేత అజిత్‌సింగ్ ఓటింగ్‌లో పాల్గొనలేదు. అజిత్‌సింగ్‌కు ఆ తర్వాత మంత్రిపదవి దక్కింది. నిజానికి జేఎంఎం సభ్యులు ఓటు వేయకపోయినా పీవీ ప్రభుత్వం గట్టెక్కేది. ఎందుకంటే, ములాయంసింగ్ యాదవ్, లాలూప్రసాద్ యాదవ్‌లతో పాటు కాన్షీరామ్ కూడా పీవీకి మద్దతు నిచ్చారు. ఈ అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చకు పీవీ జవాబిస్తూ జార్ఖండ్ ప్రాంతానికి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పిస్తామని హామీ ఇవ్వడంతో జేఎంఎం సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించారు. పీవీ హామీతోనే వారు సరిపెట్టుకుంటే బాగుండేది కాని ప్రభుత్వాన్ని కాపాడాలనుకున్న పి.వి. శ్రేయోభిలాషుల నుంచి ముడుపులను కూడా రాబట్టినట్లు ప్రచారం జరిగింది. 'వారికి ఒక్క పైసా కూడా ఇవ్వకండి అని ప్రధానమంత్రి చెప్పినప్పటికీ మా భయం మాది' అని పీవీ శ్రేయోభిలాషి ఒకరు వెల్లడించారు. పీవీ మూడు అవిశ్వాస తీర్మానాల నుంచి గట్టెక్కారు కాని ఏ సందర్భంలోనూ ఎంపీలను ప్రలోభపెట్టినట్లు ఆరోపణలు రాలేదు.

జేఎంఎం ఎంపీలు పీవీ సర్కార్‌కు మద్దతు ప్రకటించిన తర్వాత దాదాపు మూడేళ్ల పాటు ఈ విషయాన్ని పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నికలు సమీపిస్తుండగా, రాష్ట్రీయ ముక్తి మోర్చా అనే సంస్థకు చెందిన రవీంద్రకుమార్ పిటిషన్ దాఖలు చేయడం, పీవీ 1996 మే 24న గద్దె దిగగానే జేఎంఎం కేసులో ఎఫ్ఐఆర్ దాఖలు చేయమని సీబీఐని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశించిన అయిదు నెలల్లోనే సీబీఐ ఛార్జిషీటు దాఖలు చేసి పీవీని ఏ–వన్ నిందితుడుగా చేర్చడం, బీజేపీలో చేరిన జేఎంఎం సభ్యుడు శైలేంద్ర మహతో తనకు పీవీ ముడుపులు చెల్లించారని ఆరోపించి అప్రూవర్‌గా మారడం వంటి పరిణామాలు వెనువెంటనే జరిగాయి. దర్యాప్తు పూర్తిగా శైలేంద్ర మహతో ప్రకటనపై ఆధారపడి జరిగినట్లు, ఆయన రకరకాల ప్రకటనలు చేసినట్లు ఆనాటి ఉదంతాలు అధ్యయనం చేసిన వారికి అర్థమవుతుంది. ఇదే అభిప్రాయంతో అప్పటి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ సోంధీ, పీవీని నిర్దోషిగా ప్రకటించారు. పీవీ నేరుగా ఎంపీలకు ముడుపులు ఇచ్చినట్లు ఎక్కడా రుజువులు లేవని ఆయన తన తీర్పులో ప్రకటించారు. హర్షద్ మెహతా అనే స్టాక్ బ్రోకర్ పీవీకి రూ. 1 కోటి చెల్లించినందువల్ల సీబీఐతో విచారణ జరిపించాలని జనహిత్ అనే సంస్థ సుప్రీంకోర్టుకు వెళ్లినప్పుడు కూడా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్య ఆ పిటిషన్‌ను కొట్టివేశారు. సుప్రీంకోర్టును రాజకీయాలకు వేదిక చేయకూడదని ఆయన స్పష్టం చేశారు.

పీవీపై వచ్చిన అనేక ఆరోపణలు, కేసుల నుంచి ఆయన నిర్దోషిగా బయటపడ్డప్పటికీ, వాటి వెనుక రాజకీయ కుతంత్రాలు ఎన్ని ఉన్నప్పటికీ, జేఎంఎం కేసులో 1998లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజకీయ అవినీతికి సంబంధించి న్యాయవ్యవస్థ తీరుతెన్నులనే ప్రశ్నార్థకం చేసిందని చెప్పక తప్పదు. అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసిన ఎంపీలపై వచ్చిన అవినీతి నేరారోపణలపై రాజ్యాంగంలోని అధికరణ 105(2) ప్రకారం చర్యలు తీసుకోవడానికి వీలు లేదని సుప్రీంకోర్టు భావించింది. సభ్యులు పార్లమెంట్‌లో చేసిన పనులన్నీ ఈ అధికరణ క్రింద వస్తాయని ప్రముఖ న్యాయవాది పావని పరమేశ్వరరావు చేసిన వాదనను సుప్రీం మెజారిటీ బెంచ్ ఆమోదించింది. ఎంపీలు స్వేచ్ఛగా వ్యవహరించేందుకు వీలుగా రూపొందించిన ఈ అధికరణను పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలకూ, ఓటింగ్‌కూ వర్తింపచేయవచ్చు కాని ముడుపులు స్వీకరించినా, ఘోరమైన నేరాలకు పాల్పడినా వర్తింపచేయడం సరైనదేనా అన్న ప్రశ్నలకు జవాబు లేకపోవడంతో నాడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి సవాలుగా నిలిచింది. దాదాపు 26 సంవత్సరాల తర్వాత సుప్రీంకోర్టు మళ్లీ తన తీర్పును తానే తిరగరాయడం చరిత్రాత్మకం.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఇదే ఉద్దేశంతో సుప్రీం తాజా తీర్పును స్వాగతించి ఉంటారు. కాని సరిగ్గా 20 రోజుల క్రితం ఇదే సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్ల పేరుతో రాజకీయ పార్టీలు రహస్య విరాళాలు సేకరించడం రాజ్యాంగ వ్యతిరేకమని, అవి కూడా కార్పొరేట్ సంస్థల నుంచి ముడుపులు స్వీకరించడంతో సమానమని తీర్పు నిచ్చినప్పుడు మాత్రం ప్రధానమంత్రి ఏ మాత్రం స్పందించలేదు. బహుశా ఎన్నికల బాండ్ల విషయంలో ఉన్నత న్యాయస్థానం తీర్పుతో ఆయన ఏకీభవించడం లేదని అనుకోవాల్సి వస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశించినట్లు ఎన్నికల బాండ్ల వివరాలు చెప్పేందుకు కూడా స్టేట్ బ్యాంక్ ఎన్నికలు పూర్తయ్యే వరకూ సమయం అడగడం ప్రభుత్వ పారదర్శకతపై అనేక సందేహాలకు తావునిస్తోంది.

చట్టసభల్లో ముడుపులు తీసుకోవడం తప్పు అని సుప్రీంకోర్టు ప్రకటించింది కాని చట్టసభల బయట ఏ విధంగా ముడుపులు తీసుకున్నా తప్పేమి కాదని ఈ దేశంలో నేతలు భావిస్తున్నట్లు కనపడుతోంది. సుప్రీంకోర్టు ఎన్ని తీర్పులు ఇచ్చినా ఈ దేశంలో ప్రజాప్రతినిధులు తమను తాము అమ్ముకోవడం, వారిని కొనుగోలు చేయడం మాత్రం ఆగిపోవడంలేదు. ఇటీవల హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటకల్లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో పలువురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి వేరే పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించారు. 'ఎన్ని ఫిరాయింపు వ్యతిరేక చట్టాలు చేసినా ఎమ్మెల్యేలు ఇలా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడడం ప్రజాస్వామ్య రాజకీయాల్లో చీకటి కోణాన్ని చూపిస్తోంది. రాజకీయాల్లో నైతికత అనేది ఉంటే క్రాస్ ఓటింగ్ అనేదే జరగదు' అని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఖురేషీ వ్యాఖ్యానించారు. రాజ్యసభలో ఏదో విధంగా మెజారిటీ సంపాదించేందుకు, హిమాచల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరం చేసేందుకు, లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ ఈ క్రాస్ ఓటింగ్‌కు పకడ్బందీగా వ్యూహరచన చేసి ఉండవచ్చు. కాని ఏ ప్రలోభాలు లేకుండా, ఏ ముడుపులు చెల్లించకుండా ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారా అన్న ప్రశ్న ప్రతి ఒక్కరి మనసుల్లో తలెత్తుతుంది. పీవీ నరసింహారావు సమయంలో నలుగురు జేఎంఎం ఎంపీలు ఓటు వేసినందుకు సీబీఐ విచారణకు ఆదేశించినట్లే, ఈ క్రాస్ ఓటింగ్‌పై కోర్టులు కానీ, ప్రభుత్వం కానీ సీబీఐ విచారణకు ఆదేశించగలవా? ఎమ్మెల్యేలు ముడుపులు స్వీకరించలేదని కోర్టు ద్వారా నిర్ధారించగలదా?

రాజ్యసభ ఎన్నికల విషయంలోనే కాదు, గత పది సంవత్సరాలుగా 'ఆపరేషన్ లోటస్' వ్యూహంలో భాగంగా ఎమ్మెల్యేలు ఏదో విధంగా పార్టీ మారుతూనే ఉన్నారు. 2018లో కర్ణాటకలో కాంగ్రెస్–జనతాదళ్ (ఎస్) ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే 17 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. 2019–2022 మధ్య గోవాలో 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కమల తీర్థం పుచ్చుకున్నారు. 2020లో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌లో అత్యంత విధేయుడని అనుకున్న జ్యోతిరాదిత్య సింధియా ఉన్నట్లుండి ఢిల్లీ వెళ్లి తన మద్దతుదారులైన 22 మంది ఎమ్మెల్యేలతో సహా బీజేపీలో చేరారు. దీనివల్ల కమల్‌నాథ్ ప్రభుత్వం కుప్పకూలిపోయింది. మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సీపీ పార్టీలను చీల్చడం, ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడ బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉండాలని ఢిల్లీ పెద్దలు భావించడం రాజకీయాల్లో నైతికతను ప్రశ్నార్థకం చేసింది. పార్టీలు ఫిరాయించిన వారికి రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ మంత్రిపదవులు, ముఖ్యమంత్రి పదవులు, రాజ్యసభ సభ్యత్వాలు లభించాయి. ఇక ఎంతమేరకు నిధులు అక్రమంగా ప్రవహించాయో చెప్పలేము. పై పెచ్చు ఈ అనైతిక కార్యక్రమానికి తోడుగా కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలు నిర్వహిస్తున్న పాత్ర కూడా విస్మరించలేనిది. మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలు మనుగడ సాధించడం కష్టమనే ప్రచారం కూడా జరిగేందుకు గత పదేళ్లలో జరిగిన పరిణామాలే కారణమవుతున్నాయి. వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం ఏర్పడి రాజకీయాలు ప్రక్షాళన కావాలంటే సుప్రీంకోర్టు తీర్పులు మాత్రమే సరిపోవు. నాయకులకు నిజాయితీ ఉండాలి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)





గత పదేళ్లుగా 'ఆపరేషన్ లోటస్' వ్యూహంలో భాగంగా ఎమ్మెల్యేలు ఏదో విధంగా పార్టీ మారుతూనే ఉన్నారు. పార్టీలు ఫిరాయించిన వారికి రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ మంత్రిపదవులు, ముఖ్యమంత్రి పదవులు, రాజ్యసభ సభ్యత్వాలు లభించాయి. నిధులు ఎంతమేరకు అక్రమంగా ప్రవహించాయో చెప్పలేము. ఈ అనైతిక కార్యక్రమానికి తోడుగా కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలు నిర్వహిస్తున్న పాత్ర విస్మరించలేనిది. వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం ఏర్పడి రాజకీయాల్లు ప్రక్షాళన కావాలంటే సుప్రీంకోర్టు తీర్పులు మాత్రమే సరిపోవు. నాయకులకు నిజాయితీ ఉండాలి.

---

## ఇంకా యువరాజునన్న భ్రమలోనే కేటీఆర్!

దమ్ముంటే మల్కాజిగిరి నుంచి తనపై పోటీకి దిగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ సవాల్ విసరడం హాస్యాస్పదం. వియ్యానికైనా కయ్యానికైనా సమ ఉజ్జీ ఉండాలంటారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఏ అంశంలోనూ సమ ఉజ్జీ కారు. తాను పుట్టి పెరిగిన ఊరుకు దూరంగా ఉన్న ఓ మండలం నుంచి ఏ పార్టీ దన్నూ లేకుండా స్వతంత్రునిగా బరిలో దిగి రేవంత్ రెడ్డి జడ్పీటీసీ సభ్యునిగా గెలుపొంది తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. శాసనమండలికి స్వతంత్రునిగానే ఆయన విజయం సాధించారు. కాకలు తీరిన రాజకీయ యోధుడు గుర్నాథ్‌రెడ్డిపై రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఏ రాజకీయ నేపథ్యం లేని సామాన్య రైతు కుటుంబం నుంచి ప్రారంభమైన రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రజల ఆశీస్సులు, అభిమానంతో అంచెలంచెలుగా ఎదుగుతూ ముఖ్యమంత్రి పీఠం వరకు కొనసాగింది.

అందుకు పూర్తిగా భిన్నం కేటీఆర్ ప్రస్థానం. తెలంగాణ ఉద్యమం జోరుగా సాగుతున్న సమయంలో కేకే మహేందర్ రెడ్డి ఉద్యమ ఖిల్లాగా మార్చిన సిరిసిల్లలో చీమలు పెట్టిన పుట్టలో పాము దూరినట్లు కేటీఆర్ దూరాడు. నాలుగు పార్టీల దన్నుతో (2009 మహాకూటమిలో టీడీపీ, సీపీఐ, సీపీఎం, టీఆర్ఎస్ భాగస్వాములు) తండ్రి కేసీఆర్ ఇచ్చిన టిక్కెట్‌పై (మేనేజ్‌మెంట్ కోటా) సిరిసిల్లలో 171 ఓట్లతో కేటీఆర్ గెలుపొందారు. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమం ఉధృతమైనప్పుడూ ఉద్యమ భావోద్వేగాలను అనుకూలంగా మలుచుకొని ఉప ఎన్నికల్లో గెలుపొందారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అంతులేని అధికారంతో కన్నూ మిన్నూ కానకుండా వ్యవహరించారు. మధ్య మానేరు జలాశయం నిర్మాణ సమయంలో భారీగా ఇసుక దందా కొనసాగించారు. ఇసుక లారీల కింద పడి ప్రాణాలు పోతుండడంతో నిరసన దీక్షకు దిగిన నేరెళ్ల దళితులను పోలీసు స్టేషన్‌లో పెట్టి చిత్రహింసలు పెట్టించారు. తండ్రి ముఖ్యమంత్రిగా ఉండగా షాడో ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తూ అన్నిరకాల దందాలు చేశారు. కేటీఆర్, తండ్రి కేసీఆర్, చెల్లెలు కవిత, బావ హరీశ్‌రావు, వరుస సోదరుడు సంతోష్‌రావుల అహంకారపూరిత ధోరణి, ప్రజా వ్యతిరేక విధానాలకు చెంపపెట్టు వంటి తీర్పును గత శాసనసభ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చారు.

అధికారాన్ని కోల్పోయిన తర్వాత కేటీఆర్ వ్యవహార శైలి మరింత దిగజారుడుతనంగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై నిత్యం నోరుపారేసుకుంటున్నారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన మరుసటి రోజు నుంచే తాము కేవలం ఒకటిన్నర శాతం ఓట్లతో అధికారాన్ని కోల్పోయామని, ముఖ్యమంత్రి అభ్యర్థిగా రేవంత్ రెడ్డిని ప్రకటిస్తే కాంగ్రెస్ గెలిచేది కాదని అడ్డగోలు విమర్శలు చేస్తున్నారు. పీసీసీ అధ్యక్షునిగా రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌ను అధికారం దిశగా నడిపించిన విషయం, ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్క ఓటుకూ విలువ ఉంటుందన్న విషయం యువరాజులా వ్యవహరించిన కేటీఆర్‌కు ఎప్పటికీ అర్థం కాకపోవచ్చు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కాకముందే ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే నాలుగింటి అమలు ప్రారంభమైంది. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటికే 18 కోట్ల మంది మహిళలు ప్రయాణం చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచడంతో లక్షలాది కుటుంబాలు నిబ్బరంగా ఉంటున్నాయి. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీ ఆచరణలోకి వచ్చాయి. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పటికే 25 వేల ఉద్యోగాలు భర్తీ చేసింది. గ్రూప్–1 నోటిఫికేషన్, 11 వేలకు పైగా పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. కాంగ్రెస్ శరవేగంగా హామీలు అమలుచేస్తుంటే ఒక్కసారే అన్ని హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తుండడం కేటీఆర్ అవివేకానికి నిదర్శనం.

ఇరుపక్షాల సైన్యాలు యుద్ధానికి మోహరించినప్పుడు చెరో పక్షం నుంచి ఒక్కో యోధుడు పోరాడటం రాచరిక సంస్కృతి. తనకు తాను యువరాజుగా భావించుకునే కేటీఆర్ ఇంకా ఆ మైకంలో నుంచి బయటపడినట్లు లేరు. అందుకే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి తనపై మల్కాజిగిరిలో బరిలో దిగాలని, 17 సీట్లలో ఎందుకు ఒక్క సీటులోనే ముఖాముఖి తేల్చుకుందామని సవాళ్లు విసురుతున్నారు. రాష్ట్రంలో కేటీఆర్ కుటుంబ ప్రభుత్వం ఉన్నప్పుడు, ఆ నియోజకవర్గం పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో ఉన్నప్పుడే 2019 లో కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగి గెల్చిన ఘనత రేవంత్ రెడ్డిది. గత ఎన్నికల్లో 80 నియోజకవర్గాల్లో ఒంటి చేత్తో ప్రచారం చేసి కాంగ్రెస్ గెలుపులో కీలకపాత్ర పోషించిన యోధుడు రేవంత్ రెడ్డి. కేటీఆర్ కుటుంబ పదేళ్ల పాలనకు చరమగీతం పాడిన నాయకుడు రేవంత్ రెడ్డి. అటువంటి నేతకు సవాల్ విసిరి తాను ఆయనకు సమ ఉజ్జీననే భ్రమలో కేటీఆర్ ఉన్నారు. కేటీఆర్‌కు నిజంగా దమ్ము ఉంటే రేవంత్ రెడ్డి గతంలో మల్కాజిగిరిలో బరిలో దిగినట్లు తమ పార్టీ తరఫున ఒక్క ఎమ్మెల్యే లేని మహబూబ్‌నగర్, ఖమ్మం నియోజకవర్గాల నుంచి బరిలో దిగి సత్తా చాటాలి. అప్పుడు కేటీఆర్ సవాళ్ల సత్తా ఏమిటో తేలిపోతుంది.



తనకు తాను యువరాజుగా భావించుకునే కేటీఆర్ ఇంకా ఆ మైకంలో నుంచి బయటపడినట్లు లేరు. అందుకే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి తనపై మల్కాజిగిరిలో బరిలో దిగాలని, 17 సీట్లలో ఎందుకు ఒక్క సీటులోనే ముఖాముఖి తేల్చుకుందామని సవాళ్లు విసురుతున్నారు. 2019లో కేటీఆర్ కుటుంబం అధికారంలో ఉంటూ, ఆ నియోజకవర్గం పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలూ టీఆర్ఎస్‌లో ఉన్నప్పుడే కాంగ్రెస్ తరఫున అక్కడ బరిలో నిలిచి గెలిచిన ఘనుడు రేవంత్ రెడ్డి.

• సత్తు మల్లేష్

---

## సొంత నియోజకవర్గాలపై శ్రుతి మించుతున్న ప్రేమ!

పాలమూరు జిల్లాలో వెనుకబడిన ప్రాంతంగా, అభివృద్ధికి నోచుకోని ప్రాంతంగా కొడంగల్‌ను చూడవచ్చు. కానీ అంతకంటే దుర్భర దారిద్ర్యంతో, కరువుతో అల్లాడుతున్న మరెన్నో మారుమూల ప్రాంతాలు కూడా తెలంగాణలో ఉన్నాయి. కానీ బాధ్యతలు చేపట్టిన వెంటనే తన కాన్వాయిలోని కార్ల సంఖ్యను కూడా కుదించుకొని పొదుపు పాటించాలన్న సంకేతాలిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తన నియోజకవర్గం విషయంలో మాత్రం చేతికి ఎముక లేదన్నట్లు నిధుల వరద పారించారు. ఒకపక్క రాష్ట్రంలో రైతుబంధు సాయం సకాలంలో అందరికీ అందలేదన్న విమర్శలు వస్తున్న సమయంలో ఒక్క రోజే తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో రూ.4369 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అక్కడితో ఆగక ఆ తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం మధురకు రూ.334కోట్ల విలువైన పనులకు అనుమతులు ఇచ్చింది ప్రభుత్వం. ఇలా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులు నిధుల్ని తమ సొంత నియోజకవర్గాలకు తరలించుకుపోవడం వారి స్వార్థానికి తార్కాణంగా నిలిచింది.









ఎవరికైనా సొంత ప్రాంతంపై అభిమానం ఉండటం సహజమే. కానీ రాష్ట్రంలో కనీసం జీతాలకు, సంక్షేమ పథకాలకు ఖర్చుపెట్టేందుకు డబ్బు లేని నేటి విషమ పరిస్థితుల్లో నిధులన్నీ సొంత నియోజక వర్గాలకు మళ్ళించుకుపోవడమంటే స్వార్థమే అవుతుంది. గత ప్రభుత్వం చేసిన తప్పులదారిలోనే ఈ ప్రభుత్వం కూడా వెళ్తున్నదనే భావన కలుగుతున్నది.

గతంలో రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుని హోదాలో ఉన్నప్పుడు అభివృద్ధి అంతా గజ్వేల్, సిరిసిల్ల, సిద్ధిపేటలకే పరిమితమైందని పలుమార్లు విమర్శించారు. నిజంగానే ఆనాడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ మూడు నియోజకవర్గాలకు వేలకోట్ల రూపాయలు వరదలై పారాయి. ఆ సమయంలో ఒక్క రేవంతే కాదు, అన్ని పార్టీల నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఇలాంటి పోకడలు ప్రాంతీయ అసమానతలకు దారి తీస్తాయి అని గగ్గోలు పెట్టారు. ఆనాటి అసెంబ్లీలో సభాపక్ష నాయకునిగా ఉన్న భట్టి విక్రమార్క కూడా తెలంగాణ అంటే ఆ మూడు నియోజకవర్గాలే కాదనీ, మిగతా నియోజకవర్గాలను కూడా పట్టించుకోవాలనీ పదే పదే కోరారు. మరి ఇప్పుడు ఈ ప్రభుత్వం చేస్తున్నది కూడా అదే తప్పు! గతంలో గజ్వేల్‌కు ఔటర్ రింగురోడ్డు వేసినప్పుడు తీవ్రంగా విమర్శించారు. మరి ఇప్పుడు కొడంగల్‌కు వేల కోట్లు నిధులు కేటాయించటాన్ని ఎలా సమర్థించుకుంటారు. కనీసం ఒక సంవత్సరం తరువాత ఆర్థికంగా సర్దుకున్నాక నిధులు కేటాయించి ఉన్నా బాగుండేదేమో.

ముఖ్యమంత్రి, మంత్రులు ప్రమాణ స్వీకారం సమయంలో 'భయం గాని, పక్షపాతం గాని లేకుండా రాగద్వేషాలకు అతీతంగా, బాధ్యతగా' రాజ్యాంగబద్ధ పాలన సాగిస్తామని దైవసాక్షిగా ప్రమాణం చేస్తారు. కానీ పదవులు అలంకరించాక ఆ ప్రమాణాన్ని గాలికి వదిలేసి సొంత నియోజకవర్గాల పట్ల పక్షపాత వైఖరి కనబరచడం బాధాకరం. ఎవరికైనా సొంత ప్రాంతంపై అభిమానం ఉండటం సహజమే. కానీ రాష్ట్రంలో కనీసం జీతాలకు, సంక్షేమ పథకాలకు ఖర్చుపెట్టేందుకు డబ్బు లేని నేటి విషమ పరిస్థితుల్లో నిధులన్నీ సొంత నియోజక వర్గాలకు మళ్ళించుకుపోవడమంటే స్వార్థమే అవుతుంది. గత ప్రభుత్వం చేసిన తప్పులదారిలోనే ఈ ప్రభుత్వం కూడా వెళ్తుంది అన్న భావన కలుగుతున్నది.

ఇదంతా ఒక ఎత్తైతే ఇక రేవంత్ ప్రభుత్వంలో ఉన్నదంతా రాజకీయ ఉద్దండులే. అదీకాక కాంగ్రెస్ ప్రభుత్వం అంటే 'ఏ నిమిషానికి ఏమి జరుగునో!' అన్న చందంగా ఉంటుందన్నది చరిత్ర చెబుతున్న సత్యం. తనకంటే సీనియర్లు, తనకంటే కాంగ్రెస్‌పై ఆధిపత్యం, హక్కులు ఉన్న నేతలను కాదని ముఖ్యమంత్రి పీఠం ఎక్కడం అంటేనే కత్తి మీద సాములాంటిది. అలాంటప్పుడు నిర్ణయాలు ఏకపక్షమైతే కుడి ఎడమ కాకపోదు. ఇప్పటికే లోలోపల ముఖ్యమంత్రి పదవిపై ఉన్న వాంఛను అణచిపెట్టుకొన్న నేతలు ఎవరెవరో అందరికీ విదితమే. రేపు ఆయా నాయకులు తమ తమ నియోజకవర్గాలకు కూడా ప్రతిపాదనలు ఇస్తే అప్పుడు ఉత్పన్నమయ్యే పరిస్థితిని ముఖ్యమంత్రి ఊహించగలడా.

ప్రభుత్వం అంటే ప్రైవేటు సంస్థానం కాదు. మంత్రులు, ప్రభుత్వ అధికారులు ప్రజా సంక్షేమానికి తాత్కాలిక ధర్మకర్తలు అన్న విషయాన్ని మరచిపోయి ఇష్టారాజ్యంగా సొంత నియోజక వర్గాలకు నిధులు కేటాయించుకోరాదు. అది నైతిక పాలనకు కూడా నిదర్శనం కాదు. పాలకులు కూడా కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం కానీ, కేవలం కొన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం కానీ పని చేయరాదు. సమతుల్య అభివృద్ధికి ఇది అవరోధంగా మారే ప్రమాదం ఉంది.

◆ డా. దొంతగాని వీరబాబు
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ





# శారీ వాకథాన్

- ముగిసిన జాతీయ సంస్కృతీ మహోత్సవం

ఖైరతాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నాలుగురోజులుగా జరుగుతున్న జాతీయ సంస్కృతీ మహోత్సవం వైభవంగా ముగిసింది. ఈసందర్భంగా మహిళలు సాంప్రదాయ చీరలను ధరించి నిర్వహించిన వాకథాన్ ఆకట్టుకుంది. కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, దర్శన జర్దోష్‌లతో కలిసి గవర్నర్ తమిళిసై ఈవాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ చీరలతోనే మహిళలకు గౌరవం, మర్యాద, సంతోషం, అందం అని వివరించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టంగా మారిన నేపథ్యంలో తొలిసారిగా జరగనున్న మహిళా దినోత్సవం నేపథ్యంలోనూ శారీ వాకథాన్ జరగడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ ఆనంద్ శంకర్ జైన్, మహిళా ప్రముఖులు శ్రీవిద్య, వైష్ణవి, పద్మజారెడ్డి, దీపికరెడ్డి, జ్యోత్స్న, మహిళా అధికారులు ఎం వీణ, రీటా తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ మహోత్సవంలో కళాకారిణుల నృత్యప్రదర్శన



ప్రధానికి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ ఈఓ, అర్చకులు



డోలు వాయిస్తూ ప్రధానికి స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్లు

# లష్కర్‌కు మోదీ

- ఉజ్జయినీ మహంకాళిని దర్శించుకున్న ప్రధాని

రాంగోపాల్‌పేట్/సికింద్రాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉజ్జయినీ మహంకాళి దర్శనానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సికింద్రాబాద్‌కు విచ్చేశారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డిని అర్చకులు ప్రధానికి పరిచయం చేయగా 'అచ్చా హై' అంటూ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం విజిటర్స్‌బుక్‌లో సంతకం చేశారు. ఎంజీరోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద స్థానిక కార్పొరేటర్లు సుచిత్ర శ్రీకాంత్, కొంతం దీపిక, కేతినేని సరళ, పావని నవీన్, నవీన్ సుప్రియ గౌడ్, అమృత, ఉమా మహేష్‌యాదవ్ ఒగ్గుడోలు వాయిస్తూ ప్రధానికి స్వాగతం పలికారు. బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రధాని రాక సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మోదీ తిరిగి పయనమయ్యే వరకు ఆలయ పరిసరాల్లోకి ఎవరినీ అనుమతించలేదు. అప్పటివరకూ స్థానికులు ఇళ్లకే పరిమితమయ్యారు.

## బల్దియాలో మళ్లీ

# ఫేక్ బాగోతం..!

- నకిలీ జనన/మరణ ధ్రువీకరణపత్రాల జారీ
- ఫలక్‌నుమా సర్కిల్‌లో 130 గుర్తింపు



హైదరాబాద్ సిటీ/మదీనా, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో మళ్లీ నకిలీ జనన, మరణ ధ్రువీకరణపత్రాల జారీ మొదలైంది. సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశామని ఐటీ విభాగం అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఫేక్ బాగోతం ఆగడం లేదు. తాజాగా చార్మినార్‌జోన్‌లోని ఫలక్‌నుమా సర్కిల్‌లో నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ అయినట్టు గుర్తించారు. గతంలోలానే నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్లు

మిగతా 8వ పేజీలో..

## పార్టీల ఫిర్యాదులను

# ఆషామాషీగా తీసుకోవద్దు

- అధికారులకు రోనాల్డ్‌రోస్ ఆదేశం



హైదరాబాద్ సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయపార్టీల ప్రతినిధులు ఇచ్చే ఫిర్యాదులను ఆషామాషీగా తీసుకోవద్దని, క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రశాంత నిర్వహణకు సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను ఆయన కోరారు. మంగళవారం సంస్థ ప్రధాన కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్వరలో భారత ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశముందన్నారు. ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని, ఈవీఎంలు, వీవీ ప్యాట్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెకప్ పూర్తయ్యిందని, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో 45.70 లక్షల మంది ఓటర్లున్నారని, 3,986 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు చివరి తేదీకి పది రోజుల ముందు వరకు ఓటర్ నమోదు కోసం దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఒకే కుటుంబంలోని ఓటర్లంతా ఒకే పోలింగ్‌బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.



## కాజల్.. జిగేల్..

సినీనటి కాజల్ అగర్వాల్ నగరంలో మెరిశారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్-10లో ఏర్పాటు చేసిన ఓషోరూమ్‌లో ఆమె సందడి చేశారు. తనకు చీరలంటే ఇష్టమని చెప్పారు.

- హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

## వీగిన అవిశ్వాసం

- తుర్కయంజాల్ వైస్ చైర్‌పర్సన్ సేఫ్
- ప్రకటించిన ప్రత్యేకాధికారి

8

## కొత్త ప్రాంతాల్లో

# కూతకు రెడీ



- నేటి నుంచి ఎంఎంటీఎస్ పరుగులు
- మౌలాలి-సనత్‌నగర్ మార్గంలో అందుబాటులోకి కొత్త రైల్వేస్టేషన్లు

గ్రేటర్ హైదరాబాద్‌లోని కొత్త ప్రాంతాలకు ఎంఎంటీఎస్ సేవలు విస్తరించనున్నాయి. రెండోదశలో చివరిభాగమైన మౌలాలి-సనత్‌నగర్ మార్గాన్ని ప్రధాని మంగళవారం ప్రారంభించడంతో నేటి నుంచి ఎంఎంటీఎస్ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. ఈమార్గంలో ఫిరోజ్‌గూడ, సుచిత్ర సెంటర్, భూదేవినగర్, అమ్ముగూడ, నేరేడ్‌మెట్, మౌలాలి హౌసింగ్ బోర్డు స్టేషన్లకు కొత్తభవనాలు నిర్మించారు. ఆరు కొత్తస్టేషన్ భవనాలు అందుబాటులోకి రావడంతో చర్లపల్లి, మల్లాపూర్, నేరేడ్‌మెట్, ఈసీఐఎల్, సుచిత్ర, భూదేవినగర్ తదితర నివాస ప్రాంతాలు కొత్త అందాలను సంతరించుకున్నాయి.



సుచిత్ర సెంటర్ రైల్వేస్టేషన్

హైదరాబాద్ సిటీ, మార్చి5 (ఆంధ్రజ్యోతి): కొత్త రైలుమార్గం అందుబాటులోకి రావడంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎంఎంటీఎస్ రైళ్ల నిర్వహణ పరిధి విస్తృతమైంది. ప్రస్తుతం 44స్టేషన్లను కలుపుతూ ఎంఎంటీఎస్‌లు 90 కిలోమీటర్లు ప్రయాణిస్తుండగా, నేటి నుంచి 53 స్టేషన్లను కలుపుతూ 123.52 కిలోమీటర్ల మేర రైళ్లు పరుగులు తీయనున్నాయి. ఎంఎంటీఎస్ మార్గాల్లో ఘట్‌కేసర్-లింగంపల్లి రైల్వేలైన్ 48కిలోమీటర్లతో అత్యంత పొడవైన మార్గంగా ప్రాధాన్యం సంతరించుకోనుంది.

### సికింద్రాబాద్ మీద తగ్గనున్న ఒత్తిడి

ఘట్‌కేసర్-మౌలాలి-సనత్‌నగర్-లింగంపల్లి సెక్షన్‌లో మొదటిసారిగా ప్యాసింజర్ రైళ్లను నడుపుతుండడంతో.. ఇప్పటివరకు రైళ్ల రాకపోకలు ఎక్కువగా ఉన్న సికింద్రాబాద్ స్టేషన్‌పై రైళ్ల ఒత్తిడి తగ్గనుంది. దీంతో రైళ్ల సమయపాలన, రైళ్ల సగటు వేగం మెరుగవుతుందని అధికారులు భావిస్తున్నారు. నూతన ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు, ఎత్తయిన ప్లాట్‌ఫారాలు, పాదచారుల వంతెనలు, ప్లాట్‌ఫారమ్ షెల్టర్లను సమకూర్చారు.

### ఉదయం, సాయంత్రం వేళల్లోనే..

నేటి నుంచి ఘట్‌కేసర్ నుంచి మొదటి ఎంఎంటీఎస్ ఉదయం 7.30 గంటలకు బయల్దేరి 9.15 గంటలకు లింగంపల్లికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో లింగంపల్లి నుంచి సాయంత్రం 5.45గంటలకు బయల్దేరి ఘట్‌కేసర్‌కు రాత్రి 7.30 గంటలకు చేరుతుంది. కొత్త ప్రాంతాల ప్రయాణికులకు సురక్షితమైన, వేగవంతమైన అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన రవాణా సదుపాయం అందుబాటులోకి వచ్చిందని, ముఖ్యంగా విద్యార్థులు, చిరువ్యాపారులు, మహిళలు, ఉద్యోగులు తదితర వర్గాల వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఎంఎంటీఎస్ ప్రయాణికుల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**కొత్త మార్గంలో ఎంఎంటీఎస్ వేళలు ఇవీ..**

| స్టేషన్ | బయల్దేరే సమయం | స్టేషన్ | తిరుగు /సమయం |
|---|---|---|---|
| ఘట్‌కేసర్ | 7.20 | లింగంపల్లి | 17.45 |
| చర్లపల్లి | 7.33 | చందానగర్ | 17.49 |
| నేరేడ్‌మెట్ | 7.53 | హఫీజ్‌పేట్ | 17.57 |
| అమ్ముగూడ | 8.01 | హైటెక్‌సిటీ | 18.04 |
| భూదేవినగర్ | 8.08 | బోరబండ | 18.09 |
| సుచిత్ర | 8.17 | భరత్‌నగర్ | 18.13 |
| ఫిరోజ్‌గూడ | 8.26 | ఫిరోజ్‌గూడ | 18.22 |
| భరత్‌నగర్ | 8.35 | సుచిత్ర | 18.31 |
| బోరబండ | 8.39 | భూదేవినగర్ | 18.41 |
| హైటెక్‌సిటీ | 8.44 | అమ్ముగూడ | 18.47 |
| హఫీజ్‌పేట్ | 8.50 | నేరేడ్‌మెట్ | 18.55 |
| చందానగర్ | 8.55 | చర్లపల్లి | 19.16 |
| లింగంపల్లి | 9.15 | ఘట్‌కేసర్ | 19.30 |

శిశువుకు అరుదైన సర్జరీ 8



చెరువులు చెర - 3

న్యాయస్థానాలు ఆదేశించినా.. పలు కమిటీలు నివేదికలు సమర్పించినా.. చెరువుల్లో ఆక్రమణలు తొలగడం లేదు. అధికారుల సహకారం, రాజకీయ అండదండలతో ఇప్పటికీ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. జలాశయాలను కాపాడుకోకుంటే మనుగడ ప్రశ్నార్థకమని ప్రసంగాల్లో హితవు పలుకుతూనే, కొందరు తెరవెనుక ఆక్రమణదారులకు అండగా నిలుస్తున్నారు. చెరువుల పరిరక్షణకు పర్యావరణ ప్రేమికులు చేస్తున్న పోరాటం నిష్ప్రయోజనంగా మారుతోంది.



మన్సూరాబాద్ పెద్ద చెరువు

# చెరువులో పాగా..!

- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలు
- రాజకీయ, అధికార అండదండలతోనే చెరువుల అన్యాక్రాంతం
- సర్కారీ శాఖల ఉదాసీనత
- నిష్ప్రయోజనంగా పర్యావరణవేత్తల పోరాటం

విధివిధానాలను నిక్కచ్చిగా అమలు చేయాలంటున్న పర్యావరణవేత్తలు

### బఫర్‌జోన్‌లో ఇళ్లు

మన్సూరాబాద్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. 32 మంది నిర్మాణదారులకు గతంలో నోటీసులు జారీ చేసిన అధికారులు.. అనంతరం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. భూములకు సంబంధించిన వివాదం నేపథ్యంలో ఫెన్సింగ్ ఏర్పాటూ నిలిచిపోయింది.

### పదేళ్లలో 400 అక్రమ నిర్మాణాలు



రాయదుర్గం చెరువు

రాయదుర్గం గ్రామపరిధిలోని సర్వే నంబర్ 44లోని దుర్గంచెరువు వాస్తవ విస్తీర్ణం 98.22 ఎకరాలు. 2013లోనే ఈ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో 227 అక్రమ నిర్మాణాలున్నాయని ఇరిగేషన్ విభాగం కోర్టుకు నివేదిక సమర్పించింది. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పదేళ్లలో మరో 400 వరకు నిర్మాణాలు వెలిశాయి. వీటిలో కొన్నింటికి అధికారిక అనుమతులు ఉండడం గమనార్హం.

### హద్దులను తొలగించి..

నల్లగండ్లలోని పెద్ద చెరువును సుందరీకరణ పేరిట ఓ బడా సంస్థ ఆక్రమిస్తోంది. గతంలో గుర్తించిన హద్దులను తొలగించి ఇష్టానికి వ్యవహరిస్తున్నారు. బఫర్‌జోన్‌లో ప్రహరీగోడలు నిర్మించారు. చెరువు సుందరీకరణ పేరిట పక్కనే ఉన్న తమ ప్రాజెక్టుకు డిమాండ్ పెరగడంతోపాటు.. స్థలమూ కలిసి వస్తుందన్న ప్లాన్‌ను కొన్ని నిర్మాణ రంగ సంస్థలు విజయవంతంగా అమలు చేస్తున్నాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా చెరువుల సుందరీకరణను జీహెచ్ఎంసీ ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తోంది.



నల్లగండ్లలోని పెద్ద చెరువు

### శాస్త్రీయ పరిష్కారం ఉన్నా పట్టించుకోవడం లేదు..



పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు శాస్త్రీయ పరిష్కారం ఉంది. కచ్చితమైన విధివిధానాలతో ప్రభుత్వం వాటిని అమలు చేయాలి. నగరంలోని చాలా ప్రాంతాల్లో చెరువుల పక్కన బహుళ అంతస్తుల ప్రాజెక్టులకు అనుమతులిస్తున్నారు. సామాజిక బాధ్యతంటూ ఆ సంస్థలకే చెరువుల సుందరీకరణ బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో ఇక వాటికి రక్షణెక్కడిది..? గుర్తించిన ఆక్రమణలను తొలగించాలి. అమీన్‌పూర్ చెరువును నిర్జీవంగా మార్చారు. లక్డారం చెరువుకు సమీపంలో మైనింగ్‌కు అనుమతినిచ్చారు. పర్యావరణ సమతుల్యత లేకపోవడం వల్లే నగరంలో క్రమేణా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. విధ్వంసం ఇలానే కొనసాగితే పరిస్థితులు మరింత భయానకంగా మారుతాయి.

- బీవీ సుబ్బారావు, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సాంకేతిక సభ్యులు

### న్యాయస్థానంపైనే ఆశలు



చెరువుల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పలుమార్లు సుప్రీం, హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. తాజాగా అడ్వకేట్ కమిషన్ సమర్పించిన నివేదికపై కోర్టు ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది చూడాలి. ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అథారిటీ (ఈపీఏ) ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- పురుషోత్తంరెడ్డి, పర్యావరణ నిపుణులు





లాస్య నందితకు నివాళులర్పిస్తున్న బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్, జె.రామకృష్ణ తదితరులు

## ఎలివేటెడ్ కారిడార్ల ప్రతిపాదనలకు

# కంటోన్మెంట్ బోర్డు ఆమోదం

సికింద్రాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ ప్రతిపాదనలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఆమోదం తెలిపింది. ప్యారడైజ్ నుంచి అటు మేడ్చల్ రహదారి, ఇటు కరీంనగర్ జాతీయ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ఇటీవల కేంద్ర రక్షణశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ ప్రతిపాదనలను ఆమోదించేందుకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి ప్రత్యేక సమావేశం మంగళవారం జరిగింది. తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా కమాండర్ బ్రిగేడియర్ సోమశంకర్ అధ్యక్షతన కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.మధుకర్‌నాయక్, నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ ఈ అంశంపై చర్చించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణపనులు చేపట్టాలన్న ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని తీర్మానించారు. కాగా, ఈ రెండు కారిడార్ల నిర్మాణానికిగాను కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని రక్షణశాఖకు చెందిన భూములు కేటాయిస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే రూ.300 కోట్ల మొత్తాన్ని బోర్డు ఖజానాకు జమచేయాలంటూ రక్షణశాఖను కోరాలని తీర్మానించారు. ఈ భూములు రక్షణశాఖకు చెందినవైనా, బోర్డు ఆర్థిక పరిస్థితి దృష్ట్యా తమకే ఇవ్వాలని రక్షణశాఖను అభ్యర్థించాలని సమావేశంలో నిర్ణయించారు. అలాగే, కంటోన్మెంట్ బోర్డు నిర్మించిన మహిళా హాస్టల్, డయాలసిస్ సెంటర్, ధనలక్ష్మి కాలనీ పార్కులను ఈనెల 7వ తేదీన ప్రారంభించాలని, కంటోన్మెంట్‌లో భవన నిర్మాణాలు చేపట్టేటప్పుడు ఇంకుడుగుంతల నిర్మాణం నిబంధన కచ్చితంగా అమలుచేయాలని తీర్మానించారు. బోర్‌వెల్స్‌కు మీటర్ల ఏర్పాటు ప్రతిపాదనలపై 55మంది నుంచి మాత్రమే స్పందన వచ్చిందని సీఈఓ మధుకర్‌నాయక్ వెల్లడించారు. తొలుత కంటోన్మెంట్ శాసనసభ్యురాలు లాస్య నందిత మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# ఎస్‌జీటీలో భారీ ఖాళీలు

- తెలుగు మీడియంలో 285, ఉర్దూ మీడియంలో 185 పోస్టులు
- ఇతర మాధ్యమాల్లో కూడా.. 8
- మొత్తం 878 పోస్టుల్లో ఎస్‌జీటీలే అధికం

## టీచర్‌తో స్కూల్ ఇన్‌చార్జి అసభ్య ప్రవర్తన

● కేసు నమోదు

**కొత్తపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి):** ఓ ప్రైవేటు స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయిని పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న స్కూల్ ఇన్‌చార్జిపై ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మధు కథనం ప్రకారం శివగంగ కాలనీలోని ఓ ప్రైవేట్ స్కూల్ ఇన్‌చార్జి కొన్నాళ్లుగా టీచర్‌ను తన క్యాబిన్‌కు రప్పించుకుని అసభ్యంగా ప్రవర్తిస్తూ వస్తున్నాడు. బాధితురాలిని మానసికంగా, భౌతికంగా వేధింపులకు గురిచేశాడు. అతడి వేధింపులు తట్టుకోలేక ఆమె పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. స్కూల్ ప్రిన్సిపాల్‌ను, ఇన్‌చార్జిని పిలిపించి విచారిస్తున్నట్లు సమాచారం.

## బాలికపట్ల అసభ్య ప్రవర్తనపై కళాశాల యాజమాన్యం విచారణ

**నిజాంపేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):** బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేట్ బాలికల కళాశాలలో పనిచేస్తున్న ఓ లెక్చరర్, ఇన్‌చార్జీలపై ఆ కళాశాల యాజమాన్యం మంగళవారం విచారణ చేపట్టింది. ఇంటర్ చదువుతున్న బాలిక పట్ల లెక్చరర్ అసభ్యకరంగా ప్రవర్తించాడన్న ఆరోపణలు రావడంతో విద్యార్థి సంఘాలు మంగళవారం ఉదయం ఆందోళన చేపట్టాయి. దీంతో యాజమాన్యం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. క్లాస్ జరుగుతున్న సమయంలో లెక్చరర్ చేయి విద్యార్థినికి తగలడంతోనే ఈ గొడవ జరిగిందని ప్రిన్సిపాల్ వివరించారు. ఇందుకు సంబంధించి బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

## ట్రాఫిక్‌బూత్‌లో గుర్తు తెలియని మృతదేహం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**బంజారాహిల్స్, మార్చి 5(ఆంధ్రజ్యోతి):** ట్రాఫిక్ బూత్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం సృష్టించింది. జీవీకే ఎదురుగా ఉన్న ట్రాఫిక్ కంట్రోల్ బూత్‌లో మంగళవారం మృతదేహం ఉండటం స్థానికులు గమనించి బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శరీరంపై రక్తపు మరకలు ఉండటంతో ఎవరైనా హత్య చేశారా లేదా రోడ్డు ప్రమాదమా అని అనుమానిస్తున్నారు. అనుమానాస్పదమృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరావుకు డి.లిట్ ప్రదానం



హైదరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు ప్రతిష్ఠాత్మక డి.లిట్ లభించింది. భారతీయ భాషలకు, సాహిత్యానికి విశేష సేవలందించినందుకు, అకాడమీని అభివృద్ధి పథంలో నడిపినందుకు గాను ఈ డిగ్రీ ప్రదానం చేస్తున్నట్లు మహేంద్రకర్మ విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఛత్తీస్‌గఢ్ జగదల్పూరులోని ఈ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, శ్రీనివాసరావుకు డి.లిట్ ప్రదానం చేశారు.

## అన్ని పార్టీలు బీసీలకు 9 ఎంపీ సీట్లు కేటాయించాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

బర్కత్‌పుర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 9 ఎంపీ సీట్లు కేటాయించాలని, లేదంటే ఆ పార్టీల భరతం పడతామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జనగణనలో కులాల వారీగా బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం గత బడ్జెట్‌లో 2 వేలా 150 కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించి బీసీలకు అన్యాయం చేసిందన్నారు. 75 కోట్ల బీసీ జనాభాకు ఆ నిధులు ఏ మూలకు సరిపోవని అన్నారు. దేశంలో బీసీ యువజన సంఘాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, యూపీ, బిహార్ రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేశామని మిగతా రాష్ట్రాల కమిటీలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జాతీయస్థాయిలో ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీమ్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, సుధాకర్ ముదిరాజ్, రామకృష్ణ, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మేడి పాపయ్య మాదిగ

## మాదిగలకు మూడు ఎంపీ స్థానాలను కేటాయించాలి

బర్కత్‌పుర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో మూడు ఎంపీ స్థానాలను మాదిగలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ డిమాండ్ చేశారు. వరంగల్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి స్థానాలను అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ యువసేన రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. యువసేన రాష్ట్ర కో-ఆర్డినేటర్ మంచాల యాదగిరి మాదిగ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పాపయ్య మాట్లాడుతూ ఎంపీ స్థానాల సాధనకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు పులిజాల గెల్వయ్య, యాదయ్య, మేడి రమణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## క్రాఫ్ట్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలి: యాదస్వామి

హైదరాబాద్ సిటీ, మార్చి5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ క్రాఫ్ట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిప్పారపు యాదస్వామి సీఎంను కోరారు. రాష్ట్రంలో గత 30ఏళ్లలో 9సార్లు జరిగిన డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో ఒక్కసారి కూడా క్రాఫ్ట్ టీచర్ లేదా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లోనైనా క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను ప్రకటించి, నిరుద్యోగ క్రాఫ్ట్ టీచర్లను ఆదుకోవాలని ప్రజాభవన్‌లో విజ్ఞప్తి చేశారు.

## మహా శివరాత్రి సందర్భంగా...
## ఏడుపాయలకు 113 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

చాదర్‌ఘాట్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆర్టీసీ హైదరాబాద్ సిటీ రీజియన్ సీబీఎస్ నుంచి ఏడుపాయలకు 113 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ వరప్రసాద్ తెలిపారు. ఈనెల 7 నుంచి 11వతేదీ వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆయన వివరించారు. 7వ తేదీన 8 బస్సులు, 8న 20 బస్సులు, 9న 40 బస్సులు, 10న 40 బస్సులు, 11న 5 బస్సులను నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. ఏడుపాయలకు వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షా ఫలితాలు విడుదల

- 7వ తేదీలోగా రీ వాల్యుయేషన్‌కు అవకాశం

కుషాయిగూడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యామండలి బోర్డు (ఎస్‌బీటీఈటీ) ఆధ్వర్యంలో గత జనవరిలో నిర్వహించిన టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షల ఫలితాలు సోమవారం రాత్రి విడుదలయ్యాయి. అభ్యర్థులు ఎస్‌బీటీఈటీ.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదేవిధంగా రీ వాల్యుయేషన్, ఆన్సర్ షీట్ కాపీలు కావాల్సిన వారు ఈ నెల 7లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌బీటీఈటీ సెక్రటరీ పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాధానపత్రాల నకలు కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.100, రీ వాల్యుయేషన్ కోసం సబ్జెక్టుకు రూ.750 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. కాగా, జూన్‌లో నిర్వహించే టైప్ రైటింగ్/షార్ట్‌హ్యాండ్ పరీక్షల కోసం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు.

## అర్ధరాత్రి తర్వాత తీవ్ర శబ్దకాలుష్యంపై పిటిషన్

హైదరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ తాడ్‌బండ్ ప్రాంతంలో బంటియా గార్డెన్స్, ఇంపీరియల్ గార్డెన్స్ ఫంక్షన్ హాళ్ల ద్వారా అర్ధరాత్రి 12 తర్వాత కూడా తీవ్రమైన శబ్దకాలుష్యం జరుగుతోందని మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్‌కు చెందిన అడిషనల్ చీఫ్ ఇంజినీర్ జే సతీశ్ భరద్వాజ హైకోర్టుకు లేఖరాశారు. ఈ లేఖను సుమోటోగా స్వీకరించిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం.. ఈ వ్యవహారంపై వివరాలు తెలియజేయాలని అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్‌కు మంగళవారం ఆదేశాలు జారీచేసింది. అలాగే ఈ పిటిషన్‌లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును ఇంప్లీడ్ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. కేవలం రూ.10 వేలు జరిమానా వేసి వదిలేస్తే పరిస్థితులు ఏమీ మారవని ధర్మాసనం వ్యాఖ్యానించింది. శబ్దకాలుష్య నియంత్రణకు 2010లో జారీచేసిన జీవో నం.170 నిబంధనలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని.. పదోతరగతి పరీక్షలు ఉన్న నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ ఈ నెల 7కు వాయిదా వేసింది.

## వాటర్‌ప్లాంట్ల జలచౌర్యంపై పిటిషన్..

ప్రభుత్వ అండర్‌గ్రౌండ్ వాటర్ పైప్‌లైన్ నుంచి వాటర్‌ప్లాంట్ యజమానులు నీటిని చోరీ చేస్తున్నారని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కాచిగూడ శ్మశానవాటిక వద్ద శిల్పా వాటర్‌ప్లాంట్ యజమానులు ప్రభుత్వ పైప్‌లైన్ నుంచి నీటిని చోరీచేస్తున్నారని ఉస్మాన్‌గంజ్‌కు చెందిన మొహమ్మద్ సల్మాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి రిజిస్ట్రీ నంబర్ ఇవ్వకపోవడంతో రెగ్యులర్ నంబర్ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. వాటర్‌ప్లాంట్ యజమానులు సహా మున్సిపల్, జీహెచ్‌ఎంసీ, నీటిపారుదల, పోలీసుశాఖలు, జిల్లా కలెక్టర్‌కు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ నాలుగువారాలకు వాయిదాపడింది.




మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్ బిజినెస్ పార్కులో 'మైండ్‌స్పేస్ పవర్‌టాక్స్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్

# లేబర్‌కోర్టు తీర్పును పున:సమీక్షించాలి

### నాంపల్లి చంద్రవిహార్ లేబర్ కోర్టు ఎదుట ప్లకార్డులతో కేటీపీఎస్ విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

అఫ్జల్‌గంజ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): లేబర్‌కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని, నూతన జడ్జితో విచారణ జరిపించాలని విద్యుత్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. భద్రాది కొత్తగూడం జిల్లా పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్)లో ఉద్వాసనకు గురైన కార్మికులు తమకు న్యాయం చేయాలంటూ మంగళవారం నాంపల్లిలోని చంద్రవిహార్ లేబర్ కోర్టు ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కార్మిక నాయకులు ఎంఎ వజీర్, వై. చంద్రశేఖర్, జగదీశ్, కే రత్నరావు, పీవీ రాంమ్మోహన్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ 2006 నుంచి తొలగించిన ఉద్యోగులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని పోరాటం చేయగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర విద్యుత్ సంస్థ 222 మంది కార్మికులను గుర్తించి ఉద్యోగాలు ఇవ్వగా, వారిలో 122 మందికి ఉద్యోగాలు పొందారు. మిగతా వంద మందికి ఉద్యోగాలు రాలేదు. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. వారిలో కొంత మంది చనిపోగా 55 మంది కార్మికులు ఉద్యోగాల కోసం ఎదురుచుస్తున్నారు. 8 ఏళ్లుగా కేసు పెండింగ్‌లో ఉండడంతో 55 మంది కార్మికుల కుటుంబాలు వీధిన పడ్డాయని, తమకు అన్ని అర్హతలున్నా ఏళ్ల తరబడి ఉద్యోగ అవకాశం ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర హైకోర్టు స్పందించి లేబర్ కోర్టుకు నూతన జడ్జిని నియమించి, కేసును పునఃపరిశీలించి న్యాయం చేయాలని వారు కోరారు. నిరసనలో నాయకులు పి.కృష్ణ, నాగరాజు, ప్రసాద్, ఎండీ సాధిఖ్ హైదర్, కిషోర్ పాల్గొన్నారు.

## దళిత సమ్మేళన భవన నిర్మాణ బాధ్యత నాదే..



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

రాజేంద్రనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో దళిత సమ్మేళన భవన స్థలం ఇప్పించి నిర్మాణ బాధ్యత తనదేనని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ హామీ ఇచ్చారు. రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి కమిటీ అధ్యక్షుడు పలుగుచెరువు మహేశ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిశారు. ప్రతి సంవత్సరం బాబు జగ్జీవన్‌రాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహిస్తు వస్తున్నామని, రాజేంద్రనగర్‌లో దళిత సమ్మేళన భవనం పేరుతో భవనాన్ని నిర్మించుకోవడానికి స్థలం ఇప్పించి నిర్మాణం చేయించాలని వారు కోరారు. అందుకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో దళిత సంఘాల నాయకలు వనం నర్సింహ మాదిగ, పి.జీవన్‌దాస్, అనుముల జాన్‌పాల్, రగడంపల్లి శ్రావణ్, పి.శ్రీనివాసులు, గోల్కొండ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## అరుంధతి కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్

చాంద్రాయణగుట్ట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగూడ అరుంధతి కాలనీలో రూ.15లక్షలతో నూతనంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించారు. ఇందుకు జీహెచ్ఎంసీ రూ.7.5లక్షలు మంజూరు చేయగా, మరో రూ.7.5 లక్షలు స్వచ్ఛంద సంస్థలు అందించాయి. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టరు అనుదీప్ దురుశెట్టి, ఆర్డీవో సూర్యప్రకాశ్, జోనల్ కమిషనర్ వెంకన్న, సీడీపీవో జ్యోత్స్న, ఉప్పుగూడ కార్పొరేటర్ ఫహద్ బిన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో లేకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

## కూల్చివేతలు ఎలా చేస్తావ్..
### గండిపేట తహసీల్దార్‌తో బీఆర్ఎస్ నేత వాగ్వాదం



నార్సింగి, మార్చి5 (ఆంధ్రజ్యోతి): నెక్నాంపూర్‌లోని ఇబ్రహీంచెరువు బఫర్‌జోన్‌లో అక్రమంగా నిర్మాణం చేస్తున్న విల్లాలను గండిపేట తహసీల్దార్ అడ్డుకున్నారు. దీనికి కోపోద్రిక్తులైన బీఆర్ఎస్ నేత పల్లపు గోవర్ధన్ గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయానికి చేరుకొని వాగ్వాదానికి దిగారు. కూల్చివేతలు ఎలా చేస్తావంటూ దబాయించారు. తనవి కూల్చడం కాదని, నేనూ ఫిర్యాదు ఇస్తా వాటినీ కూల్చాలని, ఇతరులవి కూల్చకపోతే చూస్తానంటూ బెదిరింపులకు దిగారు.

## ప్రజావాణిలో ఫిర్యాదు
### రెండు రోజుల్లోనే సమస్యకు పరిష్కారం



అక్రమంగా నిర్మించిన నిర్మాణాన్ని కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

రాజేంద్రనగర్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గగన్‌పహాడ్‌కు చెందిన సమీనా సుల్తానా తన ఇంటి స్థలంలో ఇతరులు అక్రమంగా నిర్మాణం చేపట్టారని ఫిర్యాదు చేసినది. స్పందించిన అధికారులు ఫిర్యాదును రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులకు పంపించగా, మంగళవారం సర్కిల్ అధికారులు విచారణ చేసి అక్రమంగా నిర్మించిన నిర్మాణాన్ని కూల్చివేశారు. రెండు రోజుల్లోనే సమస్య పరిష్కారం కావడంతో సమీనా సుల్తానా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## జర్నలిస్టుల క్రికెట్ పోటీల్లో యెల్లో వారియర్స్ విజయం

రాజేంద్రనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లో జర్నలిస్టులకు మంగళవారం శివరాంపల్లిలోని విజాయానంద్ గార్డెన్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన జర్నలిస్టులు నాలుగు జట్లు (యెల్లో వారియర్స్, బ్లూ వారియర్స్, రెడ్ వారియర్స్, ఆరెంజ్) పాల్గొన్నాయి. ఫైనల్‌లో సుజీవరెడ్డి టీం యెల్లో వారియర్స్ విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. పి.సూర్యకిరణ్ టీం బ్లూ వారియర్స్ ద్వితీయ స్థానంలో నిలించింది. ఈ సందర్భంగా జర్నలిస్టుల కుటంబ సభ్యులకు మ్యూజికల్ ఛైర్స్, లెమన్ అండ్ స్పూన్, చిన్నారులకు సింగింగ్, డ్యాన్స్ పోటీలను నిర్వహించారు. విజేతలకు సీనియర్ జర్నలిస్టులు బి.అంజయ్యగుప్తా, భీమయ్య, మేకల దామోదర్‌రెడ్డి, ఎం.బాలసుబ్రమణ్యం బహుమతులను అందజేశారు.

జర్నలిస్టు మేకల దామోదర్‌రెడ్డి క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు.క్రికెట్ పోటీల నిర్వహణను కన్వీనర్ యు.శ్రీకాంత్, అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి పి.సూర్యకిరణ్, ఎం.ప్రేంరాజ్, ప్రశాంత్‌రెడ్డి, దస్తగిరి, ఎ.సుజీవన్‌రెడ్డి, బి.బాబురావు, ఎం.ప్రేంరాజ్, వర్కాల చందు పర్యవేక్షించారు.

## వన్ భారత్ శారీ వాకథాన్‌లో మేకల వనితారెడ్డి



వన్ భారత్ శారీ వాకథాన్‌లో మేకల వనితారెడ్డి

రాజేంద్రనగర్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నెక్లెస్ రోడ్డులో వన్ భారత్ శారీ వాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితారెడ్డి మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి నాగినేని, గిరిజన మోర్చా రాష్ట్ర కన్వీనర్ గాయత్రీలతో కలసి పాల్గొన్నారు. వనితారెడ్డిని కిషన్‌రెడ్డి అభినందించారు.

## 'మేనేజ్'లో వ్యవసాయ అభివృద్ధి కేంద్రం ప్రారంభం



వ్యవసాయ అభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేనేజ్ డాక్టర్ పి.చంద్రశేఖర తదితరులు

రాజేంద్రనగర్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): ఆఫ్రికా, ఆసియా ప్రాంతాల్లో వ్యవసాయ అభివృద్ధి కోసం అమెరికాకు చెందిన మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ మేనేజ్‌మెంట్ కలసి పనిచేయడానికి రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్)లో ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

మంగళవారం మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి.చంద్రశేఖర, మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ క్వెంటిన్ టైలర్ వ్యవసాయ అభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు.

## గోషామహల్‌లో సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి పొన్నంకు వినతి

అఫ్జల్‌గంజ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుడు ఎం ఆనంద్‌కుమార్ గౌడ్ కోరారు. మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. కోఠిలోని కామత్ హోటల్ పక్కన జీహెచ్‌ఎంసీకి చెందిన 13 షాపులు ఉన్నాయన్న ఆయన, జీహెచ్‌ఎంసీ ఎస్టేట్ అధికారి షాపుల నిర్వాహకులతో కుమ్మక్కై వారికే టెండర్లతో తక్కువ అమౌంట్ కోడ్ చేసినా వారికే కట్టబెట్టారని మంత్రికి వివరించారు. ఈ అంశంపై గత నెల 11న ప్రజావాణిలో ఫిర్యాదు చేశానన్నారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.



వర్క్ షాపులో మాట్లాడుతున్న వక్తలు

## పోటీ ప్రపంచంలో రాణించాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరి

అఫ్జల్‌గంజ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నేటి పోటీ ప్రపంచంలో అన్నిరంగాల్లో ప్రతిభావంతంగా రాణించాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరి అని వక్తలు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయా రంగాల్లో ఉన్నత స్థాయిని చేరుకోవాలంటే కమ్యూనికేషన్‌తోనే సాధ్యమన్నారు. కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయంలో ఒకరోజు జాతీయ కార్యశాల జరిగింది. మంగళవారం విశ్వవిద్యాలయం కామర్స్ విభాగం పక్షాన 'స్కిల్లింగ్ ఇండియాస్ యూత్ ఫర్ ఆన్ ఎంపోవెరెడ్ ఇండియా కీ లెర్నింగ్ ఫ్రం పీఎంకేవీఓ స్కీం' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షురాలు ఆచార్య విజ్జు లత, ఆచార్యులు కె.కృష్ణ చైతన్య జి.సతీస్, డాక్టర్ నజీయా సుల్తానా, డి.రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు

## కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

చాంద్రాయణగుట్ట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలకు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ యాకుత్‌పూర నియోజకవర్గ ఇన్‌చార్జి రవిరాజ్ పేర్కొన్నారు. ఏ బ్లాక్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘం నాయకులు ధనలక్ష్మితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి అల్లం భాస్కర్, మామిడి కృష్ణకుమార్, కె.శ్రీనివాస్, నగర ఉపాధ్యక్షుడు రాజు యాదవ్, శశియాదవ్, లడ్డు, శివ, నళిని గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఆర్థిక పురోభివృద్ధిలో ఎంఎస్‌ఎంఈ పాత్ర అనిర్వచనీయం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డి.చంద్రశేఖర్

బాలానగర్/కార్వాన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక పురోభివృద్ధికి, ఉపాధి కల్పనలో మైక్రోస్మాల్ అంత్రప్రెన్యూర్స్ డెవలప్‌మెంట్ (ఎంఎస్‌ఎంఈ) సంస్థ పారిశ్రామిక రంగానికి ఎంతో దోహదపడుతోందని కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్ అడిషనల్ డైరెక్టర్ రాజ్‌కుమార్, ఎంఎస్‌ఎంఈ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్‌ఎంఈ అందిస్తున్న స్కీంలపై ఎంఎస్‌ఎంఈ, మరికొన్ని సంస్థలతో కలిసి నగరంలోని తారామతి బారాదరిలో ఏర్పాటు చేసిన ఒక్కరోజు అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై స్వాగతోపన్యాసం చేసి ఎంఎస్‌ఎంఈ స్కీంల గురించి వివరించారు.

రాబోయే నాలుగేండ్ల ర్యాంప్ పథకం కింద ఎంఎస్‌ఎంఈ రంగానికి మద్దతు ఇవ్వడానికి తెలంగాణ ప్రభుత్వానికి రూ.46.95 కోట్లు ఇప్పటికే విడుదల అయ్యాయన్నారు. విశ్వకర్మ పథకం వలన రాష్ట్రంలోని చేతివృత్తుల వారికి ఎంతో మేలు జరుగుతుందని ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ ప్రభుత్వానికి రూ.117.95 కోట్ల గ్రాంటును కేటాయించిందని వివరించారు. అనంతరం సిడ్బీ బ్యాంకు జీఎం హిమాన్షు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్, ఎస్‌ఎల్‌బీసీ మేనేజర్ శ్రీహరి, తెలంగాణ ఇండస్ట్రీయల్ ఫెడరేషన్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. కొత్త ఐటీ చట్టం, ఎలా తగ్గింపు పొందాలి, అవసరమైన పత్రాల వెరిఫికేషన్, జీఎస్టీ సహాయ్, ఆన్‌లైన్ ఆధారిత ప్రోగ్రాలు, బ్యాంకులు అందిస్తున్న సేవలను, సహాయ సహకారాలను వివరించారు. ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ శివరామ్‌ప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పారిశ్రామికవేతలు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/UedWAY6 లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

## మహేశ్వరం ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీకాంత్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏసీపీ

పహాడిషరీఫ్ మార్చ్ 5 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం జోన్ ఏసీపీగా లక్ష్మీకాంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు బదిలీ కావడంతో మంగళవారం కార్యాలయానికి వచ్చిన ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం, కందుకూర్, బాలాపూర్ పహాడిషరీఫ్ స్టేషన్ల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలను కాపాడుతాని అన్నారు.

## బహదూర్‌పురా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా రఘునాథ్



బాధ్యతలు స్వీకరిస్తున్న రఘునాథ్

మదీన, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బహదూర్‌పురా పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్.రఘునాథ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేస్తున్న హబీబుల్లాఖాన్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో రఘునాథ్ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా ప్రజలు తనను కలిసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

## కారు ఢీకొని మహిళ మృతి



పహాడిషరీఫ్ మార్చ్ 5(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పార్వతమ్మ(54) నడుచుకుంటూ బావర్చి హోటల్ నుంచి పహాడి షరీఫ్ కల్లు కాంపౌండ్ వైపునకు వెళ్తుంది. అటు నుంచి వేగంగా వచ్చిన కారు(టీఎస్11 యూడీ 2288) ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పహాడి షరీఫ్ పోలీసులు తెలిపారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మదీన, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహం మంగళవారం చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ వెనుకాల ఉన్న మున్సిపల్ ప్లేగ్రౌండ్‌లో ఓ వ్యక్తి పడివున్నాడని స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని వయసు 35 సంవత్సరాలుంటుందని, స్థానికంగా భిక్షాటన చేస్తుండేవాడని తెలిసింది. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 8712569186 ఫోన్ నంబర్‌లో సమాచారమివ్వాలని కోరారు.

## షాహీన్‌నగర్‌లో పెయింటర్ దారుణ హత్య



ఫహీమ్ (ఫైల్)

రాజేంద్రనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసి పారిపోయారు. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్‌మెట్ ఎంఎం పహాడీ దర్గా వద్ద మంగళవారం రాత్రి 7.30 గంటలకు జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. హత్యగావించ బడిన వ్యక్తి బైక్ నెంబర్ ఆధారంగా మృతిచెందిన వ్యక్తి షాహీన్ నగర్‌లో ఉంటున్న పెయింటర్ ఫహీమ్(20)గా గుర్తించారు. ఫహీమ్‌ను ఎవరు హత్య చేశారు. ఎందుకు హత్య చేశారు అనే వివరాలు తెలియరాలేదు. అప్పటికే ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు అక్కడికి వచ్చారు. దాంతో పెయింటర్‌గా పని చేసే పహీమ్‌గా నిర్ధారించారు. ఫహీమ్‌కు కొంతమందితో పాత కక్షలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఐదుగురు వ్యక్తులు అతన్ని హత్య చేసి పారిపోయారని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఫహీమ్ సోదరుడు, కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారంతో కేసును దర్యాప్తు చేస్తున్నామన్నాని డీసీపీ తెలిపారు.

## వేర్వేరు ఘటనల్లో నలుగురి అరెస్ట్, రిమాండ్

బోరబండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరుగా జరిగిన కత్తిపోట్ల ఘటనలో పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. సీఐ ఎస్‌వీ వీరశేఖర్ వివరాల ప్రకారం.. ఎర్రగడ్డ రైతు బజార్ వద్ద పండ్ల వ్యాపారి నబిపై అఫ్రోచ్, గౌస్ కత్తితో దాడి చేశారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాబా సైలని నగరకు చెందిన రాజు ఠాగూర్ జయప్రకాష్ శర్మ, బంధువులైన చందన్ సంతోషలపై పేపర్ బ్లేడ్‌తో దాడి చేశారు. వీరిని కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## నాసిరకం ఔషధ విక్రయాలపై చర్యలు తీసుకోవాలి: ఏఐవైఎఫ్

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నాసిరకం మందులను విక్రయిస్తున్న మెడికల్ దుకాణాలు, క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. అనధికారికంగా నాసిరకం ఔషధాలను విక్రయిస్తున్న దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో డ్రగ్ కంట్రోల్ డీజీ వి.బి. కమల హాసన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలీ ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు నడుస్తున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా నాసిరకం మందుల విక్రయాలు పెరిగాయని తెలిపారు. బీపీ, చక్కెర వ్యాధి పరీక్షల పేరుతో రోగులను పీల్చుకుతింటున్నారని ఆరోపించారు. నాసిరకం ఔషధాలు విక్రయిస్తున్న దుకాణాలు, అనుమతులు లేకుండా వైద్యపరీక్షలు చేపడుతున్న క్లినిక్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అవార్డు అందుకున్న డాక్టర్ సూర్యపవన్‌రెడ్డి

## డాక్టర్ సూర్యపవన్ రెడ్డికి పీసీ ఇండియన్ అచీవర్స్ అవార్డు

బంజారాహిల్స్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య, ఎంటర్‌ప్రెన్యూర్ రంగాల్లో విశేష సేవలందించిన వారిని ప్రోత్సహించేందుకు పవర్ కారిడార్ నేషనల్ మేగజైన్ వారు అందించే ప్రతిష్ఠాత్మకమైన పవర్ కారిడార్ ఇండియన్ అచీవర్స్ అవార్డ్ నగరానికి చెందిన ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ కోమటిరెడ్డి సూర్యపవన్‌రెడ్డి అందుకున్నారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల్లో వచ్చే డయాబెటిస్‌పై తాను 20 ఏళ్లుగా చేస్తున్న రీసెర్చ్‌ను గుర్తించి ఈ అవార్డు అందజేశారని తెలిపారు. సూర్యపవన్ రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోదరుడి కుమారుడు కావడం గమనార్హం.

# పైరవీ చేసి.. పైకం ముట్టచెప్పి..!

- జీహెచ్‌ఎంసీకి క్యూ కడుతున్న ఏఎంఓహెచ్‌లు
- ఇప్పటికే నలుగురి చేరిక
- అదే దారిలో మరో ఆరుగురు

హైదరాబాద్ సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీకి సహాయ వైద్యాధికారులు (ఏఎంఓహెచ్)లు మళ్లీ క్యూ కట్టారు. పైరవీలు చేసి.. రూ.లక్షలు కప్పం చెల్లించి తిరిగి బల్దియాకు వచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరు సంస్థలో చేరగా, మరికొందరు అదే దారిలో ఉన్నారు. ఐదేళ్లు పూర్తయిన, అవినీతి ఆరోపణలున్న కొందరు ఏఎంఓహెచ్‌లు గత కమిషనర్ లోకేష్‌కుమార్ ఆదేశాలతో స్వచ్ఛందంగా వెళ్లిపోయారు. ప్రస్తుతం వారంతా ఒక్కొక్కరుగా తిరిగి వస్తున్నారు. ఇప్పటికే నలుగురు విధుల్లో చేరగా.. మరో ఆరుగురు చేరేందుకు ఆసక్తి చూపుతూ లేఖలు ఇచ్చారు.

### అక్రమార్జన కోసమే..

పారిశుధ్య నిర్వహణతో వైద్యాధికారులకు సంబంధం లేదు. కానీ, జీహెచ్‌ఎంసీలో చెత్త పనులు చేసేందుకు ఏఎంఓహెచ్‌లు ఆసక్తి చూపుతారు. బల్దియాలో ఈ పోస్టు చాలా ఖరీదు కూడా. ఉన్నతాధికారులు, రాజకీయ నేతల ద్వారా పైరవీలు చేయించుకొని, అవసరమైతే రూ.లక్షలు ముట్టజెప్పి ఇక్కడికి వస్తుంటారు. చెత్త ఊడ్చడం, రవాణా, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో అక్రమార్జన, హోటళ్ల నుంచి వసూళ్లకు అవకాశం ఉండడమే ప్రధాన కారణం. ఇక వయసు పైబడిన, అనారోగ్యంతో ఉన్న పారిశుధ్య కార్మికుల స్థానంలో కుటుంబసభ్యులు, బంధువులను చేర్చుకునే క్రమంలోనూ కొందరు భారీగా వసూళ్లు చేస్తుంటారు. కార్మికుల హాజరులో అక్రమాల ద్వారా నెల వారీగా రూ.లక్షలు తీసుకుంటున్నారు. కొందరు ఏఎంఓహెచ్‌ల అక్రమార్జన నెలకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉండడం గమనార్హం. గతంలో కేంద్ర కార్యాలయంలో సమావేశాలకు స్టార్ హోటళ్ల నుంచి భోజనాలు తీసుకువచ్చిన ఓ ఏఎంఓహెచ్ సంస్థ చెల్లించే మొత్తంలో 30 శాతం వరకు కమీషన్ తీసుకున్నారనే ఆరోపణలున్నాయి.

● గతంలో అంబర్‌పేట, ముషీరాబాద్ సర్కిళ్లలో పనిచేసిన ఓ ఏఎంఓహెచ్ జీహెచ్‌ఎంసీకి వచ్చేందుకు ఆసక్తి చూపుతూ కమిషనర్‌కు పది రోజుల క్రితం విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించిన ఫైల్ వేగంగా కదులుతోంది. కార్మికుల బోగస్ హాజరు, హోటళ్ల నుంచి వసూళ్లలో ఆ అధికారి ఘనాపాటి. అలాంటి అధికారిని తిరిగి తీసుకునేందుకు బల్దియాలోని కొందరు అధికారులూ మొగ్గు చూపుతుండడం గమనార్హం. ఇందు కోసం ఆ ఏఎంఓహెచ్ ఉన్నతస్థాయిలో భారీగా ముట్టచెప్పినట్టు ప్రచారం జరుగుతోంది.

● మూసాపేట, కూకట్‌పల్లి జోన్లలో గతంలో పనిచేసిన ఓ ఏఎంఓహెచ్ కొన్నాళ్ల క్రితం జీహెచ్‌ఎంసీలో చేరారు. ఆయన విధులు నిర్వర్తించిన సర్కిల్‌లో నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ భారీగా జరిగింది. ఈ క్రమంలోనే ఆయనపై వేటు వేసేందుకు సిద్ధమవగా.. స్వచ్ఛందంగా వెళ్లిపోయారు. కమిషనర్ మారడంతో ఉన్నతస్థాయిలో పైరవీ చేసుకొని తిరిగి వచ్చినట్టు తెలిసింది.

● సికింద్రాబాద్ జోన్ పరిధిలో పనిచేసిన ఓ ఏఎంఓహెచ్ కూడా జీహెచ్‌ఎంసీకి తిరిగి వచ్చారు. ఎస్‌ఎఫ్‌ఏలు, కార్మికుల నియామకం విషయంలో ఆరోపణలున్న ఆ అధికారిని మళ్లీ సంస్థలోకి రానిచ్చేందుకు పెద్ద తతంగం నడిచిందని చెబుతున్నారు.

# న్యాయ విచారణ జరిపించాలి

- భువనగిరి హాస్టల్‌లో బాలికల ఆత్మహత్యలపై బాధితులు
- ఇందిరాపార్కువద్ద ధర్నాకు యత్నం
- అనుమతులు లేవంటూ అడ్డుకొన్న పోలీసులు
- రోడ్డుపై బైఠాయించిన బాధితులు



బాధితులకు నచ్చచెబుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి, (ఇన్‌సెట్‌లో) రోడ్డుపై పడుకొని నిరసన వ్యక్తం చేస్తున్న లలిత

కవాడిగూడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భువనగిరి హాస్టల్‌లో ఇటీవల ఇద్దరు బాలికల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు పూనుకొన్న భవ్య, వైష్ణవి న్యాయపోరాట కమిటీ సభ్యులను పోలీసులు అడ్డుకున్నారు. ధర్నాకు అనుమతిలేదంటూ దోమలగూడ పోలీసులు వారిని అక్కడినుంచి పంపించేశారు.

భవ్య, వైష్ణవి న్యాయపోరాట కమిటీ సభ్యులు, బాధిత కుటుంబీకులు లలిత, వివిధ ప్రజాసంఘాల నాయకురాళ్లు మంగళవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌కు చేరుకున్నారు. 11గంటల ప్రాంతంలో అక్కడకుచేరుకున్న పోలీసులు ఈ ధర్నాకు ఎలాంటి అనుమతులు లేవని తేల్చిచెప్పారు. కచ్చితంగా ధర్నాచేసి తీరుతామని, తమ పిల్లలది ఆత్మహత్యకాదని ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని కమిటీ నేతలు, బాధితుల కుటుంబసభ్యులు ఆరోపించారు. తమకు న్యాయం జరిగేంతవరకు ఇక్కడినుంచి కదిలేదిలేదంటూ రోడ్డుపై పడుకొని నిరసన తెలిపారు. మహిళా పోలీసులు వారికి సర్దిచెప్పి 'మీకు అన్యాయం జరిగితే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలి' అని సలహా ఇవ్వడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ధర్నాకు మద్దతు తెలియజేయడానికి వచ్చిన పీఓడబ్ల్యూనేతలు సంధ్య, ఝాన్సీ, చైతన్య మహిళా సంఘం నాయకులు పి.జ్యోతి, తదితరులు మాట్లాడుతూ వైష్ణవి, భవ్యల ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ చేసి వారి కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబీకులకు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు.

## ప్రజాపాలనలో ధర్నాకు అనుమతి లేదా?

- ప్రజాసంఘాల ఆగ్రహం



మాట్లాడుతున్న వాసు కె.యాదవ్

పంజాగుట్ట, మార్చి5 (ఆంధ్ర జ్యోతి): ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నాకు అనుమతి లేదా అని భవ్య, వైష్ణవి న్యాయ పోరాట కమిటీ ప్రతినిధి, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు వాసు కె.యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో భవ్య తండ్రి కృష్ణ, కుల నిర్మూలన పోరాట సమితి ప్రధాన కార్యదర్శి బి.అభినవ్, ఆడబిడ్డల సంఘం అధ్యక్షురాలు ధనలక్ష్మి, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు పిడికిలి రాజు, పలు సంఘాల నాయకులు లలిత, రోజా కె.నేత, కేవీ గౌడ్, జాన్ కుమార్ తదితరులు మాట్లాడారు. ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించాలని ముందస్తుగా అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నా పోలీసులు తిరస్కరించారని, ధర్నాచౌక్ వద్దకు వస్తే అడ్డుకుని దోమలగూడ పీఎస్‌కు తరలించారని వాసు కె.యాదవ్ ఆరోపించారు. కన్న బిడ్డలను పోగొట్టుకొని పుట్టెడు దుఃఖంలో ఉన్న తమను, కమిటీ సభ్యులను ఇన్‌స్పెక్టర్ అసభ్య పదజాలంతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. భవ్య, వైష్ణవిల మరణాలకు కారకులను అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించేంత వరకు తమ న్యాయపోరాటం ఆగదన్నారు. కమిటీ నుంచి తప్పుకోవాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని తనను ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారని యాదవ్ వాపోయారు. పోలీసుల నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

## 'గృహజ్యోతి' జీరో బిల్లుల జారీలో ఆలస్యం

- సౌత్, రాజేంద్రనగర్ సర్కిళ్లలో 26 శాతం బిల్లులు
- అత్యధికంగా మేడ్చల్ సర్కిల్‌లో 70 శాతం పూర్తి
- ఒకే తేదీన బిల్లులు ఇవ్వాలని వినియోగదారుల డిమాండ్

హైదరాబాద్ సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పలు సర్కిళ్లలో 'గృహజ్యోతి' జీరో బిల్లుల జారీ ఆలస్యంగా సాగుతున్నది. మార్చి 1 నుంచి అందుబాటులోకి తెచ్చిన జీరో బిల్లుల జారీ ఎస్‌ఈల నిర్లక్ష్యంతో నెమ్మదిగా జరుగుతున్నది. రోజువారీగా క్షేత్రస్థాయిలో జారీ చేస్తున్న బిల్లుల ప్రక్రియను ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో పలు సర్కిళ్లలో మంగళవారానికి 30 శాతం పూర్తికాని పరిస్థితి నెలకొన్నది. మొదట్లో 6 రోజుల్లో బిల్లుల జారీని పూర్తిచేయాలని విద్యుత్‌శాఖ భావించినా తర్వాత 10వ తేదీ నాటికి వందశాతం బిల్లుల జారీ పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్రేటర్‌లో పలు ప్రాంతాల్లో ప్రతి నెలా 6నుంచి 8 రోజుల పాటు ఆలస్యంగా బిల్లులు జారీచేస్తున్నారు. ఒక్కోనెలా ఒక తేదీన బిల్లులు జారీచేయడంతో విద్యుత్ యూనిట్ల రేట్లు పెరిగి చెల్లించాల్సిన బిల్లు మొత్తం కూడా పెరుగుతున్నదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రతి నెలా మొదటి వారంలోనే బిల్లుల జారీని పూర్తిచేయాలంటూ విద్యుత్ వినియోగదారులు డిస్కంను కోరుతున్నాయి.

### అత్యల్పంగా హైదరాబాద్ సౌత్..

గ్రేటర్‌జోన్ 9 సర్కిళ్లలో 48.5 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా వాటిలో మార్చి 5 వరకు 50 శాతం బిల్లులు జారీచేయలేదు. హైదరాబాద్ సౌత్, రాజేంద్రనగర్ సర్కిళ్లలో 26శాతం చొప్పున మంగళవారం నాటికి విద్యుత్ బిల్లులను జారీచేశారు. మేడ్చల్ సర్కిల్‌లో అత్యధికంగా 70 శాతం విద్యుత్‌బిల్లులను జారీచేయగా, సైబర్‌సిటీలో 43, హబ్సిగూడలో 46, హైదరాబాద్ సెంట్రల్‌లో 40, సరూర్‌నగర్‌లో 39, సికింద్రాబాద్‌లో 50, బంజారాహిల్స్ సర్కిల్‌లో 55 శాతం విద్యుత్‌బిల్లులు జారీచేశారు.

## వీగిన అవిశ్వాసం

- తుర్కయంజాల్ వైస్ చైర్‌పర్సన్ సేఫ్
- ప్రకటించిన ప్రత్యేకాధికారి



ప్రత్యేక సమావేశంలో ఆర్డీవో అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయరెడ్డి

హయత్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ హరితా ధన్‌రాజ్‌గౌడ్‌పై 18 మంది కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. మంగళవారం రాగన్నగూడ వార్డు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి అవిశ్వాసం ప్రకటించిన 18 మంది కౌన్సిలర్లు, సంతకాలు పెట్టని ఆరుగురు కౌన్సిలర్లు (మొత్తం 24మంది కౌన్సిలర్లు) గైర్హాజరు కావడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో అనంతరెడ్డి ప్రకటించారు.

### ఫిబ్రవరి 1న కలెక్టర్‌కు వినతి

గత నెల 1వ తేదీన 18 మంది కౌన్సిలర్లు వైస్ చైర్‌పర్సన్ హరితా ధన్‌రాజ్‌గౌడ్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీంతో అధికారులు మార్చి 5వ తేదీన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామని కౌన్సిలర్లందరికీ నోటీసులు జారీ చేశారు. అందులో భాగంగా మంగళవారం రాగన్నగూడ వార్డు కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ హరితా ధన్‌రాజ్‌గౌడ్, కౌన్సిలర్లు టి. సంగీత, వేముల స్వాతి, నక్క శివలింగంగౌడ్, కె. జోసెఫ్‌కుమార్ (సునీల్) అవిశ్వాసానికి దూరంగా ఉన్నారు. అవిశ్వాసంపై సంతకాలు పెట్టిన 18మంది కౌన్సిలర్లు సైతం సమావేశానికి హాజరు కాలేదు.

### సమయం పెంచినా రాని కౌన్సిలర్లు..

ప్రత్యేక అధికారి ఇబ్రహీంపట్నం ఆర్‌డీవో అనంతరెడ్డి ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశాన్ని ప్రారంభించగా 11.30 గంటల వరకు ఒక్క కౌన్సిలర్ కూడా హాజరుకాలేదు. మున్సిపాలిటీ చట్టం ప్రకారం అరగంట పాటు వేచి చూడాల్సి ఉన్నందున 11.30 నుంచి 12 గంటల వరకు వేచి చూశారు. 12.30 గంటల వరకు సమావేశం సమయం పెంచినా కౌన్సిలర్లు రాకపోవడంతో వైస్ చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో అనంతరెడ్డి ప్రకటించారు.


## 16 నెలల శిశువుకు అరుదైన సర్జరీ

- బయటకు చొచ్చుకొని వచ్చిన గుండె ● మెడికవర్‌లో సరిచేసిన వైద్యులు



శిశువు, తల్లిదండ్రులతో వైద్య బృందం

హైదరాబాద్ సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మెడికవర్ ఆస్పత్రిలో 16 నెలల శిశువుకు అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. పుట్టుకతోనే శరీరం వెలుపలకు చొచ్చుకు వచ్చిన గుండె, ఉదరభాగంతో జన్మించిన శిశువుకు మెడికవర్ ఉమన్ చైల్డ్ ఆస్పత్రిలో వైద్యులు సర్జరీ నిర్వహించి సరిచేశారు. టాంజానియాకు చెందిన శిశువుకు పీడియాట్రిక్ కార్డియాక్ సైన్సెస్ టీమ్, పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీ టీమ్ సర్జరీ చేసి పాప ప్రాణాలను కాపాడినట్లు ఆస్పత్రి వర్గాలు ఓ ప్రకటనలో తెలిపారు. పుట్టుకతోనే శిశువుకు గుండె ఛాతీ కుహరం బయట కొట్టుకోవడం, శిశువు పేగులు, ఇతర ఉదర అవయవాలు బయటకు పొడుచుకు వచ్చి పలుచని పొరతో కప్పినట్లు ఉందని వైద్యులు ఆశిష్ సప్రే, మధుమోహన్ రెడ్డి తెలిపారు. దీనిని వైద్య పరిభాషలో పెంటాలజీ ఆఫ్ కాంట్రెల్ (పీఓసీ) అని వ్యవహరిస్తామన్నారు. ఈ శిశువుకు జఠరిక ఒక్కటే ఉండటం వల్ల రక్తాన్ని ఇతర భాగాలకు పంపించడం జరుగుతుందని, నీలం రంగులో ఉండే రక్తాన్ని లంగ్స్‌కు పంపించడానికి ప్రత్యేక సిరల ద్వారా లంగ్స్‌కు అమర్చినట్లు తెలిపారు. ఈ వైద్య ప్రక్రియలో వైద్యులు ఆశిష్ సప్రే, శ్రీనివాస్ కిని, మధు మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పరిగే, పవన్ ప్రసాద్, మధు వినయ్, సంధ్య నిర్మల్‌రెడ్డితో పాటు ప్రత్యేక నర్సింగ్ బృందం నేతృత్వంలో 14 గంటల పాటు విజయవంతంగా ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. రోగి కోలుకున్నారని, వారంలో డిశ్చార్జీ చేయనున్నట్లు వైద్యులు వివరించారు. ప్రపంచంలో 55 లక్షల మందిలో ఒక్కరే ఇలా పుడతారని, ప్రపంచంలో ఇప్పటివరకు 90 మంది మాత్రమే ఇలాంటి వారున్నారని తెలిపారు.




వాబిస్మో ఇంజక్షన్

## దృష్టి లోపం చికిత్స కోసం వాబిస్మో ఇంజక్షన్

- విపణిలోకి తీసుకువచ్చిన రోష్ ఫార్మా ఇండియా

బంజారాహిల్స్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): దృష్టి లోపానికి కారణమైన వెట్ ఏజ్ సంబంధిత మచ్చల క్షీణత(ఎన్ఏఎండీ), డయాబెటిక్ మాక్యులర్ ఎడెమా(డీఎంఈ) నుంచి రక్షణ పొందేందుకు రోష్ ఫార్మా ఇండియా వాబిస్మో పేరిట కొత్త ఇంజక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. రెటినాకు ముప్పు కలిగించకుండా అనేక దృష్టి లోపాలను ఈ ఇంజక్షన్ సరిచేస్తుందని కంపెనీ నిర్వాహకులు చెబుతున్నారు. బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వాబిస్మోను విపణిలోకి తీసుకువస్తున్నట్లు రోష్ ఫార్మా ఇండియావి సింప్సన్ ఇమాన్యుయేల్ తెలిపారు. దృష్టి సమస్యలతో బాధపడుతున్న వారి అవసరాలను తీర్చేందుకు ఈ మందు ఎంతో పనిచేస్తుందన్నారు.

## పొలం పనులు లేక నగరానికొచ్చి

- గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి
- మృతురాలు నారాయణపేట జిల్లా వాసి
- తెల్లవారుజామున ప్రమాదం



సాయమ్మ మృతదేహం

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం పట్నం వచ్చిన మహిళను గుర్తుతెలియని వాహనం బలిగొంది. పని వెతుక్కునేందుకు ఎన్టీఆర్‌నగర్‌లోని కూరగాయల మార్కెట్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సరూర్‌నగర్ ఎస్ఐ మాధవరావు తెలిపిన వివరాల ప్రకారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం పెద్దజాటారం గ్రామానికి చెందిన బీరప్ప భార్య కె.సాయమ్మ (50) నగరంలో పనిచేసేందుకు మూడు రోజుల క్రితం మలక్‌పేటలోని బంధువుల ఇంటికి వచ్చింది. రెండు రోజులుగా మలక్‌పేటలోని గంజ్‌లో, ఇతర దుకాణాల వద్ద పనికోసం వెతికింది. కూరగాయల మార్కెట్‌లో పని లభిస్తుందని తెలిసిన వారు చెప్పడంతో, మంగళవారం ఉదయం 5గంటల ప్రాంతంలో ఇంటి నుంచి ఎన్టీఆర్‌నగర్‌కు వచ్చింది. కూరగాయల మార్కెట్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా వీఎం హోమ్ సమీపంలో సాయమ్మను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలై అపస్మారక స్థితిలోకి చేరుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సాయమ్మ వద్ద ఉన్న ఆధారాలతో కుమారుడు మల్లేష్‌కు సమాచారం ఇచ్చారు. సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్‌జీటీలో భారీగా ఖాళీలు

హైదరాబాద్ సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించడంతో బీఈడీ, డీఈడీ, లాంగ్వేజ్ పండిట్ కోర్సులను పూర్తి చేసిన అభ్యర్థులు ఉత్సాహంగా ఉన్నారు. ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను అప్‌లోడ్ చేసేందుకు సెంటర్లకు వెళ్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించిన పోస్టుల్లో జిల్లాలోనే ఖాళీలు ఎక్కువగా ఉండడంతో ఇక్కడ పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశముందని విద్యాశాఖాధికారులు భావిస్తున్నారు. నాన్‌లోకల్ కేటగిరీ కింద 5 శాతం మాత్రమే రిజర్వేషన్ ఉన్నప్పటికీ, పోస్టులు ఎక్కువగా ఉండడంతో ఇతర జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఓపెన్ కోటాలో ఉద్యోగం సాధించేందుకు హైదరాబాద్‌లోనే దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

### పోటీ తీవ్రం

ఎస్‌జీటీ కేటగిరీలో జిల్లాలో పెద్దఎత్తున ఖాళీలున్నాయి. తెలుగు మీడియంలో అత్యధికంగా 285 పోస్టులున్నాయి. ఉర్దూ మీడియంలో 185, ఎస్‌జీటీ కన్నడ మీడియంలో 1, మరాఠీలో 7, తమిళంలో 5 పోస్టులున్నాయి. లాంగ్వేజ్ పండిట్ తెలుగు మీడియంలో 45, హిందీ మీడియంలో 35, ఉర్దూ మీడియంలో 32 ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్‌లోని వివిధ సబ్జెక్టుల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పదుల సంఖ్యలోనే పోస్టులుండడంతో ఈసారి పోటీ తీవ్రంగా ఉండనుంది. అయితే స్కూల్ అసిస్టెంట్‌కు టెట్ అర్హత తప్పనిసరి కావడంతో లోకల్ రిజర్వేషన్ కింద ఎంతమంది, నాన్‌లోకల్ కింద ఎందరు దరఖాస్తు చేసుకుంటారో తెలియని పరిస్థితి నెలకొంది.

### పీఈటీ, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఖాళీలు ఇవే..

స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలోని వివిధ కేటగిరీల్లో ఖాళీలు స్వల్పంగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ తెలుగు మీడియంలో 4, ఉర్దూలో 2 ఉన్నాయి. ఎస్‌జీటీ ఇంగ్లిష్ మీడియంలో 4, తెలుగు మీడియంలో 20, ఉర్దూ మీడియంలో 9 ఖాళీలున్నాయి. పీఈటీ ఇంగ్లిష్ మీడియంలో 4, తెలుగులో 7, ఉర్దూలో 20 ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇంగ్లిష్ మీడియంలో 1, తెలుగులో 4, ఉర్దూలో 1 ఉన్నాయి.

**ఎస్‌జీటీ విభాగంలోని ఖాళీలు..**

| మీడియం | ఖాళీలు |
|---|---|
| తెలుగు | 285 |
| ఉర్దూ | 185 |
| ఇంగ్లిష్ | 42 |
| హిందీ | 12 |
| కన్నడ | 01 |
| మరాఠీ | 07 |
| తమిళం | 05 |

**స్కూల్ అసిస్టెంట్ విభాగంలోని ఖాళీలు..**

| మీడియం | సబ్జెక్టు | మీడియం | సబ్జెక్టు | మీడియం | సబ్జెక్టు | |
|---|---|---|---|---|---|---|
| ఇంగ్లిష్ | బయోసైన్స్ 04 | ఇంగ్లిష్ 13 | గణితం 03 | ఫిజికల్ సైన్స్ 01 | సోషల్ స్టడీస్ 03 | ---------- |
| హిందీ | బయోసైన్స్ 01 | హిందీ 07 | ---------- | ఫిజికల్ సైన్స్ 01 | సోషల్ స్టడీస్ 01 | ---------- |
| తెలుగు | బయోసైన్స్ 16 | ---------- | గణితం 11 | ఫిజికల్ సైన్స్ 02 | సోషల్ స్టడీస్ 18 | తెలుగు 10 |
| ఉర్దూ | బయోసైన్స్ 19 | ---------- | గణితం 08 | ఫిజికల్ సైన్స్ 05 | సోషల్ స్టడీస్ 19 | ఉర్దూ 10 |

## బల్దియాలో మళ్లీ ఫేక్ బాగోతం..!

(5వ పేజీ తరువాయి)

లేకుండా జనన, మరణ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఈ విషయంపై ఫిర్యాదులు రావడంతో కేంద్ర కార్యాలయ అధికారులు స్పందించారు. ఫూల్‌బాగ్‌లోని సర్కిల్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. గత నవంబర్ నుంచి ఇప్పటి వరకు 130 నకిలీ సర్టిఫికెట్లు జారీ అయినట్టు ప్రాథమికంగా తేల్చారు. ఆ సర్టిఫికెట్లకు సంబంధించి నాన్ అవైలబిలిటీ రికార్డులు లేవని గుర్తించారు. ఇతర సర్కిళ్లలోనూ ఈ తరహా సర్టిఫికెట్లు జారీ అయ్యాయా? గుర్తించేందుకు పూర్తిస్థాయి విచారణ జరపాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. కిందటి సంవత్సరంలో 24 వేలకుపైగా నకిలీ జనన/మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యాయి. కొందరు ఏఎంఓహెచ్‌లు, ఏఎంసీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆపరేటర్లు కలిసి అక్రమాలకు పాల్పడ్డారు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేసి.. ఎలాంటి పత్రాలు లేకుండానే సర్టిఫికెట్లు ఇచ్చారు. వీటన్నింటిని రద్దు చేస్తున్నట్టు జీహెచ్‌ఎంసీ ప్రకటించింది. ఈ క్రమంలో ఆర్‌డీఓ ప్రొసీడింగ్స్ లేకుండా సర్టిఫికెట్ జారీ కాకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. అయినా నకిలీ సర్టిఫికెట్ల జారీ ఆగడం లేదు.



పెళ్లి... అత్తింటి వేధింపులు... భర్తతో తెగతెంపులు... ఇరవయ్యేళ్లకే ఒక జీవితానికి సరిపడే అనుభవాలను ఎదుర్కొన్న **మంజరీ జరుహార్** తన బతుకును తానే దిద్దుకోవాలనుకున్నారు. సివిల్స్ రాశారు. దేశంలోనే అయిదో, బిహార్‌లో తొలి మహిళా ఐపిఎస్‌గా కొత్త అధ్యాయం ఆరంభించారు. సమర్థతకు, నిజాయితీకి మారుపేరుగా నిలిచారు. 'మేడమ్ సర్' పేరుతో తన కథను అక్షర బద్ధం చేసిన మంజరి స్ఫూర్తిమంతమైన ప్రయాణం ఇది.

# మేడమ్ సర్..!

“పురుషులు పనిచేసే చోట తమను తాను నిరూపించుకుంటే చాలు. అదే మహిళైతే... ఇంటా, బయటా నిరూపించుకోవాల్సిందే. మాది బిహార్ రాష్ట్రంలోని పట్నా. మా కుటుంబంలో అందరూ ఉన్నత విద్యావంతులే. ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు చాలామంది ఉన్నారు. కానీ మహిళల విషయానికొచ్చేసరికి... మంచి గృహిణిగా ఉంటే చాలనేది వాళ్ల అభిప్రాయం. అందుకే నా చదువుకు వాళ్లు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వలేదు. పంతొమ్మిదేళ్ల వయసొచ్చేసరికి నాకు వివాహం చేశారు. నా భర్త ఐఎఫ్‌ఎస్ అధికారి. నాతో గడపడానికి, నన్ను పట్టించుకోడానికి అతనికి సమయం ఉండేది కాదు. మరోవైపు అత్తవారింట్లో తీవ్రమైన వేధింపులు. వాటిని తట్టుకోలేక కొద్దికాలానికే అతనితో విడిపోయాను. నాకు మళ్లీ పెళ్లి చెయ్యడానికి మా ఇంట్లోవాళ్లు చాలా ప్రయత్నం చేశారు. “ఇప్పటివరకూ మీరు చెప్పినట్టు చేశాను. ఇకమీదట నా బతుకును నేనే నిర్ణయించుకుంటాను” అని గట్టిగా వాదించి, వారిని ఒప్పించాను. నేను తీసుకున్న అత్యుత్తమమైన నిర్ణయాల్లో అదొకటి.

> **“నీకిక్కడ పోస్టింగ్ ఇచ్చారు సరే! కానీ నీకు ఏ పని చెప్పాలో నాకు తెలీడం లేదు. ఒక పని చేస్తాను. కిరణ్ బేడీ (దేశంలో తొలి మహిళా ఐపిఎస్) కొత్తగా చేరినప్పుడు ఏం చేశారో తెలుసుకొని... ఆ తరువాత ఆలోచిస్తాను” అన్నారు ఐజీ. చివరకు ఆఫీసులో కూర్చొని చేసే పని ఇచ్చారు. ఫీల్డ్‌లో పని చెయ్యాలనేది నా కోరిక అనీ, అందుకు అనుమతించాలనీ ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసుకున్నాను.**

### 'ఏ పని చెప్పాలో తెలీడం లేద'న్నారు...

భర్త నుంచి విడిపోయిన తరువాత... పాట్నా ఉమెన్స్ కాలేజీలో ఇంగ్లీష్‌లో (ఆనర్స్), ఢిల్లీ యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. అనంతరం సివిల్స్ ప్రిపేరవడం ప్రారంభించాను. ఐపిఎస్ అవ్వాలనే నా లక్ష్యానికి కారణం... నా కుటుంబంలోని ఉన్నతాధికారులుగా పనిచేసినవారు వారు పొందిన గౌరవం. వారి నుంచే నేను స్ఫూర్తి పొందాను. నా గురించి విన్నవారందరూ విడ్డూరంగా చూశారు. ఎందుకంటే... అప్పట్లో మహిళలు సివిల్స్‌కు ప్రిపేర్ కావడం చాలా అరుదు. అయితే... శ్రమిస్తే ఫలితం ఉంటుందనేది నా నమ్మకం. కష్టపడి చదివాను. 1976లో యుపిఎస్‌సి పరీక్ష పాసయ్యాను. బిహార్‌లో తొలి మహిళా ఐపిఎస్‌ని నేనే. అంతేకాదు... దేశంలోనే అయిదోదాన్ని. సివిల్ సర్వెంట్‌గా నా ప్రయాణం అలా ప్రారంభమైంది. సిఐడి ఎఎస్‌పిగా నా తొలి పోస్టింగ్. ఉద్యోగంలో చేరిన మొదటి రోజు నాకింకా గుర్తుంది. ఐజి ఆఫీసులో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వడానికి వెళ్లినప్పుడు... ప్రతి ఒక్కరూ విచిత్రంగా చూశారు. “నీకిక్కడ పోస్టింగ్ ఇచ్చారు సరే! కానీ నీకు ఏ పని చెప్పాలో నాకు తెలీడం లేదు. ఒక పని చేస్తాను. కిరణ్ బేడీ (దేశంలో తొలి మహిళా ఐపిఎస్) కొత్తగా చేరినప్పుడు ఏం చేశారో తెలుసుకొని... ఆ తరువాత ఆలోచిస్తాను” అన్నారు ఐజీ. చివరకు ఆఫీసులో కూర్చొని చేసే పని ఇచ్చారు. ఫీల్డ్‌లో పని చెయ్యాలనేది నా కోరిక అనీ, అందుకు అనుమతించాలనీ ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసుకున్నాను. చివరకు మా నాన్న స్నేహితుడి సిఫార్సుతో... ఆ అవకాశం వచ్చింది. దాంతో నా జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని చెప్పాలి.



కొన్నాళ్లు బిహార్‌లో, తరువాత జార్ఖండ్ నేషనల్ పోలీస్ అకాడమీలో, సిఐఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్‌లో విధులు నిర్వర్తించాను. నా కెరీర్లో సంచలనాత్మకమైన, సున్నితమైన అనేక కేసుల్లో పని చేశాను. బిహార్‌లో మొదట బస్సు దోపిడీ కేసు, భాగల్పూర్ బ్లైండింగ్స్ కేసు, 1984లో సిక్కులపై దాడుల కేసు... ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. ప్రధానంగా... మహిళల సమస్యలు నా దృష్టికి వచ్చినప్పుడు... వాటిని పరిష్కరించడం ధ్యేయంగా పనిచేశాను. నేను చేసిన సేవలకు గుర్తింపుగా 'ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్'తో సహా పలు గౌరవాలు అందుకున్నాను. 2010లో సిఐఎస్ఎఫ్ స్పెషల్ డైరెక్టర్ జనరల్‌గా రిటైర్ అయ్యాను. ఆ తరువాత కూడా భారతీయ సంగీత పరిశ్రమ యాంటీ పైరసీ వింగ్‌కు అధిపతిగా ఉన్నాను. ప్రస్తుతం టిసిఎస్‌కు సెక్యూరిటీ కన్సల్టెంట్‌గా, ఫిక్కీ ప్రైవేట్ సెక్యూరిటీ ఇండస్ట్రీ కమిటీ సలహాదారుగా వ్యవహరిస్తున్నాను.




### అందుకే రాశాను...

వ్యక్తిగత విషయాలకొస్తే.. నా బ్యాచ్ ఐపిఎస్ అధికారి రాకేశ్ జరుహార్‌ను వివాహం చేసుకున్నాను. వృత్తిపరంగా నా ఎదుగుదలలో ఆయన పాత్ర ఎంతో ఉంది. కొత్త కొత్త వంటలు చేయడానికి ప్రయత్నించడం, పర్యటనలు నా అభిరుచులు. ఇప్పుడు నా మనుమలతో ఆడుకోవడం నాకు మంచి కాలక్షేపం. మూడేళ్ల క్రితం నా ఆత్మకథను రాయాలనే ఆలోచన కలిగింది. అందుకు కారణం... నా వృత్తి జీవితం గురించి వివరించడం మాత్రమే కాదు... మహిళలు సమాజం నుంచి ఎదుర్కొనే వివక్ష గురించి చెప్పడానికి కూడా. నా జీవితమంతా మహిళల దుస్థితిని చూస్తూనే ఉన్నాను. పురుషులు, మహిళలు సమానం కాదనే భావనను మన సమాజం చిన్నవయసునుంచే బాల బాలికల్లో నాటుతూ ఉంటుంది. సమాజంలో మహిళలపట్ల జరుగుతున్న ఎన్నో నేరాలకు కారణం ఇదే. విద్యాపరంగా మహిళలు ఎంత విజయం సాధించినా... ఇంటి పనుల్లో నైపుణ్యాలు కూడా తప్పనిసరి అనేది చాలామంది భావన. ఆడపిల్లలు హైస్కూల్ స్థాయి వరకూ చదువుకొని, కుట్లు, అల్లికలు నేర్చుకుంటే చాలనే మనస్తత్వం కలిగిన కుటుంబంలో పుట్టాను. చిన్న వయసులోనే వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టి, అత్తవారింట్లో వేధింపులు ఎదుర్కొని, భర్తనుంచి వేరుపడ్డాను. అప్పటికి మహిళల సంఖ్య వేళ్లమీద లెక్కబెట్టేంత తక్కువగా ఉన్న రంగంలో ప్రవేశించాను. అడుగడుగునా సవాల్ విసిరే వృత్తిలో నన్ను నేను నిరూపించుకోవడానికి తీవ్రంగా శ్రమించాను. ఇవన్నీ అక్షరబద్ధం చేస్తే... కొందరికైనా ప్రేరణ కలుగుతుందని, బాలికలకు, మహిళా ఉద్యోగులకు తమ జీవితాలను తాము మలచుకొనే ధైర్యాన్ని అందిస్తుందనీ అనుకున్నాను. నేను చెప్పగలిగే కథలు నా జీవితంలో, కెరీర్లో ఎన్నో ఉన్నాయి. కానీ నాలో భావోద్వేగాలకు కారణమైన వాటినే ప్రధానంగా నా పుస్తకంలో ప్రస్తావించాను.

### వాళ్ల విజయాలు సంతృప్తి కలిగిస్తున్నాయి...

ఫీల్డ్‌లో నన్ను 'మేడమ్ సర్' అని పిలుస్తూ ఉండేవారు. నా కథకు ఆ పేరు సరిగ్గా సరిపోతుందనిపించింది. అలా నా ఆత్మకథ రెండేళ్ల కిందట విడుదలైంది. ఈ ఏడాది కొత్తగా ఐపీఎస్ పూర్తి చేసిన యువతీ యువకులను ఉద్దేశించి మాట్లాడే అవకాశం కలిగినప్పుడు మళ్లీ నా కథ చెప్పాను. వాళ్ల నుంచి అనూహ్యమైన ప్రతిస్పందన వచ్చింది. నేను ఐపీఎస్ అయినప్పటి కాలంతో పోలిస్తే పరిస్థితులు చాలా మారాయి. ఇప్పుడు అమ్మాయిలు పెద్ద సంఖ్యలో పోలీస్ వృత్తిలోకి వస్తున్నారు. వాళ్లు సాధించే విజయాలను వింటున్నప్పుడు ఎంతో సంతృప్తి కలుగుతూ ఉంటుంది. భవిష్యత్తులో మరింతమందికి స్ఫూర్తిగా నిలిచేది వాళ్ల గెలుపు గాథలే. 'మీ ప్రవర్తనతో, సమర్థతతో మీ వృత్తి గౌరవాన్ని పెంచాలి. సమాజంలో సానుకూలమైన మార్పు కోసం మీకు వీలైనంతగా దోహదం చెయ్యాలి. ధైర్యం, పట్టుదల, కోరుకొనేది సాధించాలనే దృఢసంకల్పం... ఇవి ఉంటే మీ విజయాన్ని ఆపేదేమీ ఉండదు” ... నేను మహిళలకు చెప్పగలిగే విషయాలు ఇవే. ఎందుకంటే ఇవన్నీ నేను నేర్చుకున్న పాఠాలు. నా జీవితానుభవాలు.”






ప్రపంచ కుబేరులు... రిహానా పాప్ గీతాలు... సల్మాన్... షారుక్ నృత్యాలు... మహామహుల రాకతో జామ్ అయిపోయింది జామ్‌నగర్. వీరందరినీ ఒకే వేదికపైకి తెచ్చింది... అనంత్ అంబానీ... రాధికా మర్చంట్ ప్రీవెడ్డింగ్ ఈవెంట్. ముఖేష్ అంబానీ చిన్న కొడుకుగా అనంత్ అందరికీ తెలిసినవాడే. మరి అతడిని పెళ్లాడనున్న ఈ **రాధిక మర్చంట్** ఎవరు? వీళ్ల మనసులు కలిసింది ఎప్పుడు?

# అతడు ఆకాశమంత

రాధికా మర్చంట్... ముఖేష్ అంబానీకి కాబోయే కోడలుగానే కాకుండా ఆమెకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రసిద్ధ ఫార్మాసుటికల్ కంపెనీ 'ఎన్‌కోర్ హెల్త్‌కేర్' సీఈఓ వీరెన్ మర్చంట్, శైలా మర్చంట్ చిన్న కుమార్తె అయిన రాధిక... విద్యావంతురాలు. పారిశ్రామికవేత్త. భరతనాట్య కళాకారిణి. సామాజిక కార్యకర్త. ముంబయిలోని 'కేథడ్రాల్ అండ్ జాన్ కానన్ స్కూల్', 'ఎకోల్ మాండియల్ వరల్డ్ స్కూల్'లలో ప్రాథమిక విద్య అభ్యసించిన 29 ఏళ్ల రాధిక... 'బీడీ సోమని ఇంటర్నేషనల్ స్కూల్'లో బాకలారియెట్ డిప్లమో పూర్తి చేశారు. అనంతరం అమెరికా వెళ్లిన ఆమె 'న్యూయార్క్ యూనివర్సిటీ'లో పొలిటికల్ సైన్స్ అండ్ ఎకనావిక్స్ చదివారు. 2017లో పట్టభద్రులయ్యారు. అక్కడ చదివే సమయంలోనే పలు సంస్థల్లో బిజినెస్ స్ట్రేటజీ కన్సల్టెంట్‌గా ఇంటర్న్‌షిప్ చేశారు. ముంబయికి తిరిగి వచ్చాక లగ్జరీ రియల్‌ఎస్టేట్ కంపెనీ 'ఇస్ప్రావా'లో జూనియర్ సేల్స్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం తమ 'ఎన్‌కోర్ హెల్త్‌కేర్'కు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న రాధిక... కాబోయే అత్తగారు నీతా అంబానీలా భరతనాట్య కళాకారిణి. ముంబయిలోని 'శ్రీ నిభా ఆర్ట్స్ అకాడమీ'లో భావనా ఠాకర్ వద్ద భరతనాట్యం నేర్చుకున్నారు. రెండేళ్ల కిందట అరంగేట్రం చేసిన రాధిక... ప్రముఖ వేదికలపై పలు ప్రదర్శనలు కూడా ఇచ్చారు.



### సమాజం కోసం...

వ్యాపార కార్యకలాపాల్లో క్షణం తీరిక లేకపోయినా సామాజిక సేవకు కూడా కొంత సమయాన్ని కేటాయిస్తున్నారు రాధిక. ఆమె జంతు ప్రేమికురాలు. జంతు సంరక్షణతో పాటు అట్టడుగు వర్గాలవారికి విద్య అందించేందుకు కృషి చేస్తున్నారు. మానవహక్కుల పరిరక్షణ కోసం తన గళం వినిపిస్తున్నారు. మహిళల ఆర్థిక సాధికారత, స్వావలంబన కోసం కృషి చేస్తున్నారు. రాధిక కుటుంబంలో అందరూ వ్యాపార రంగంలో రాణిస్తున్నవారే. రాధిక తండ్రి వీరెన్ బిలియనీర్. 'ఎన్‌కోర్ హెల్త్‌కేర్'తో పాటు 'ఏపీఎల్ అపోలో ట్యూబ్స్' స్టీల్ కంపెనీ బోర్డ్ మెంబర్‌గా కూడా ఉన్నారు. తల్లి శైల 'ఎన్‌కోర్ హెల్త్‌కేర్' డైరెక్టర్లలో ఒకరు. రాధిక అక్క అంజలి మర్చంట్ భర్త ఆకాష్ మెహతా వ్యాపారవేత్త. వీరెన్ కుటుంబ నికర ఆస్తుల విలువ ఏడొందల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా.

### చిన్ననాటి స్నేహం...

'రిలయన్స్' అధినేత ముఖేష్ అంబానీ చిన్న కుమారుడైన అనంత్ అంబానీ, రాధికలది చిన్ననాటి స్నేహం. అంబానీ కుటుంబంలో ఏ వేడుక జరిగినా ఆమె హాజరవుతూ వస్తున్నారు. ముఖేష్ అంబానీ కుమార్తె ఇషా, పెద్ద కుమారుడు ఆకాష్ వివాహ మహోత్సవాల్లో కూడా రాధిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న అనంత్, రాధికల బంధాన్ని మూడుముళ్ల బంధంగా మార్చాలని ఇరువైపుల పెద్దలు నిశ్చయించారు. దీంతో గత ఏడాది జనవరిలో వీరి నిశ్చితార్థం జరిగింది. ఇటీవలే మూడు రోజులపాటు వారి ప్రీవెడ్డింగ్ వేడుక అంగరంగ వైభవంగా జరిపారు ముఖేష్ అంబానీ. దీంతో రాధిక ఎవరనే ఉత్సుకత జనంలో మరింత పెరిగింది. ప్రపంచంలోని సంపన్నులు, రాజకీయ, సినీ, క్రీడారంగ ప్రముఖులు గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో జరిగిన వేడుకకు క్యూ కట్టారు. స్వర్గం భూతలం మీదకు దిగివచ్చిందా అన్నంత ఆర్భాటంగా జరిగిన ఈ మెగా వేడుకలో అనంత్, రాధిక అతిథులందరినీ ఆప్యాయంగా పలుకరించారు. భోజనాలు వడ్డించారు.

### 'మా హృదయం ఇక్కడే ఉంది'...

ప్రపంచ ప్రముఖులు హాజరైన వేడుకలో రాధిక తన మనసు విప్పి మాట్లాడారు. కాబోయే అత్తగారు నీతా అంబానీ తనకు స్ఫూర్తి అని, మామగారు ముఖేష్ అంబానీ తనకు తండ్రి సమానులని చెప్పుకొచ్చారు. అలాగే అనంత్‌తో తన అనుబంధం ఎక్కడ ఎలా మొదలైందో అందరితో పంచుకున్నారు. 'మా ఇద్దరి హృదయం... జామ్‌నగర్. ఇక్కడే మేం పెరిగాం. ఇక్కడే స్నేహితులం అయ్యాం. ఇక్కడే ప్రేమలో పడ్డాం. ఇక్కడే మా అనుబంధాన్ని నిర్మించుకున్నాం. భవిష్యత్తులో కలిసి జీవించాలని నిర్ణయించుకున్న మా తొలి అడుగు కూడా ఇక్కడి నుంచే పడింది. ఈ ప్రదేశం మా మధుర జ్ఞాపకాలకు, మా లోతైన రహస్యాలకు, మా మధ్య విరబూసిన నవ్వులకు, మా సంతోషాలు నిండిన సంబరాలకు నిలయం. మేం కలిసి నడిచిన ప్రతి ఘట్టంలో భాగం. మేము ఎదుర్కొన్న ఎత్తుపల్లాలకు సాక్ష్యంగా నిలిచింది ఈ నగరం' అంటూ ఎంతో భావోద్వేగంతో చెప్పుకొచ్చారు రాధిక.

### అలా 'లాక్' అయ్యారు...

అనంత్, రాధిక ప్రేమకు బలమైన పునాది పడింది కరోనా లాక్‌డౌన్‌లోనట. '2020 మార్చి... కరోనా విజృంభిస్తున్న సమయం. అప్పుడు లాక్‌డౌన్‌తో నేను, అనంత్ జామ్‌నగర్‌లో లాక్ అయిపోయాం. ఎంత ప్రయత్నించినా కొన్ని నెలల పాటు మా ప్రాంతాలకు తిరిగి వెళ్లలేకపోయాం. ఒక్కసారిగా కుటుంబానికి దూరంగా ఉండటం ఎంత కష్టమో తెలుసు. కానీ మేమిద్దరం చిన్న చిన్న ఆనందాలను పంచుకొంటూ ఆస్వాదించాం. అవే ఇప్పుడు మాకు జీవితకాల జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. మానవత్వం ఉన్న మనిషిగా అనంత్‌ను అప్పుడే చూశాను. తన కలల ప్రాజెక్ట్ అయిన 'వంతారా'ను ఒక స్థాయికి తీసుకురావడానికి అతడు పడిన శ్రమను చూశాను. అతనితో ఈ ప్రయాణం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. అతడి నుంచి ఎన్నో నేర్చుకున్నాను. అనంత్‌ను చూసినప్పుడు నేను ఎంత గర్వంగా భావిస్తానో మాటల్లో చెప్పలేను. మంచిని, చెడును, ఆందాన్ని, ఆనందాన్ని, బాధను, లౌక్యాన్ని... అన్నిటినీ పంచుకొని, ప్రేమించే వ్యక్తి జీవిత భాగస్వామిగా కావాలనే ఎవరైనా కోరుకొనేది. ఆ అర్హతలన్నీ అతడిలో ఉన్నాయి' అంటూ కాబోయే భర్తను ఆకాశమంత ఎత్తులో నిలిపారు రాధిక. జూలై 12న వీరి వివాహానికి పెద్దలు ముహూర్తం ఖరారు చేశారు.

# నొప్పులు తగ్గించే తర్బూజ

- తర్బూజ పండులో పోషకాలు అనేకం. ఇందులో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల కడుపు త్వరగా నిండినట్లు అనిపిస్తుంది. ఇది తిన్నాక ఆకలి వేయదు. నీటిశాతం ఎక్కువే. ముఖ్యంగా ఈ పండులోని పొటాషియం కొవ్వును తగ్గిస్తుంది. జీర్ణక్రియను సాఫీగా ఉంచుతుంది.
- తర్బూజ పండు తినటం వల్ల మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. తద్వారా టెన్షన్ తగ్గి నిద్ర పడుతుంది.
- ఈ జ్యూస్ తాగటం వల్ల చక్కెరశాతం పెరగదు. పైగా కిడ్నీలోని రాళ్లు కరిగిపోతాయి.
- విటమిన్ సి,ఎ ఉండటం వల్ల ఇదో అద్భుతమైన ఇమ్యూనిటి బూస్టర్‌లా పని చేస్తుంది. జలుబు, దగ్గులాంటివి దరి చేరవు.
- కంటికి ఎంతో మేలు చేసే పండు తర్బూజ.
- బరువు ఎక్కువగా ఉండే వాళ్లు తర్బూను డైట్‌లో ఉంచుకుంటే బరువు తగ్గుతారు. అంతెందుకూ వీటి విత్తనాలు కూడా ఫైబర్‌ను కలిగి ఉండటం వల్ల డీహైడ్రేషన్ సమస్యనుంచి కాపాడుతుంది.
- సాయంత్రం స్నాక్స్‌గా ఎండాకాలం తినొచ్చు. ఈ పండును తింటే రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. రక్తపోటు లాంటివి కనపడవు. దీనివల్ల గుండె ఆరోగ్యానికి మంచి జరుగుతుంది.
- తర్బూజ పండు తినటం వల్ల కొల్లాజిన్ ఉత్పత్తి జరుగుతుంది. జుట్టు పెరుగుతుంది. ముఖ్యంగా ఈ పండ్లతో ఫేస్‌ప్యాక్ వేసుకుంటే చర్మం మృదువుగా ఉంటుంది.
- యాంటీ ఇన్ఫ్లమేషన్ గుణాలు ఇందులో ఉండటం వల్ల కీళ్లు, మోకాళ్లు, చేతి మెడిమలు దగ్గర నొప్పులు వచ్చే అవకాశం తక్కువ.
- పండు తినని వాళ్లు రసం, సలాడ్స్‌తో తినొచ్చు. ఈ పండు తినటం వల్ల దంతాల నొప్పులు తగ్గిపోతాయి. 2016 అధ్యయనం ప్రకారం పంటి నొప్పిని తగ్గించే శక్తి ఈ పండుకు ఉందని పరిశోధకులు తేల్చారు.
- ఫోలిక్ యాసిడ్ ఉండటం వల్ల గర్భిణిలు కూడా తినొచ్చు. దీనివల్ల బిడ్డ ఎదగటానికి ఉపయోగపడుతుంది.





**వేసవి వేగంగా వచ్చేస్తోంది. రోజు రోజుకు వేడి పెరిగిపోతోంది. ఇలాంటి సమయంలో ఎలాంటి బట్టలు వేసుకోవాలనేది చాలా మందికి ఎదురయ్యే ప్రశ్న. సరైన బట్టలు వేసుకోపోతే- రోజంతా ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. అందుకే వేసవిలో ఎలాంటి బట్టలు ధరించాలో తెలుసుకుందాం.**

# వేసవిలో ఇవి బెస్ట్



### పొడవు చేతులు వద్దు..

పొడవు చేతులు ఉన్న డ్రస్సులు.. మోకాళ్ల దాకా ఉండే చూడిదార్లు వేసవిలో ధరించకుండా ఉంటే మంచిది. పొడవు చేతులు ఉన్న డ్రస్సుల వల్ల వంటి నుంచి వచ్చే వేడి బయటకు వెళ్లదు. దీని వల్ల చెమట ఎక్కువ పడుతుంది. ఒక వేళ పొడవు చేతులు వేసుకోవటం తప్పనిసరి అయితే- కాటన్ డ్రస్సులనే ధరించండి.

### బిగుతు బట్టలు వద్దు...

చాలా మంది ఫ్యాషన్ కోసం బిగుతు బట్టలు వేసుకుంటారు. బిగుతుగా ఉన్న బట్టలు వేసుకుంటే- చెమట ఆరదు. దీని వల్ల అసౌకర్యంగా అనిపిస్తుంది. వీలైనంత వరకు కొద్దిగా లూజుగా ఉండే బట్టలు వేసుకుంటే మంచిది. కాటన్ బట్టలు వేసుకోవటం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి.

### సాక్స్ వద్దు

చాలా మంది బట్టలకు మ్యాచింగ్ అయ్యే సాక్సులు వేసుకుంటారు. సాక్సులు వేసుకోవటం వల్ల శరీరం వేడి ఎక్కుతుంది. ఇబ్బంది మరింత పెరుగుతుంది. అందువల్ల సాక్స్ వేసుకోకపోవటం మంచిది. వేసవిలో శాండిల్స్ ధరించటమే ఉత్తమం.

### జీన్స్ వద్దు

వేసవి కాలంలో జీన్స్ వేసుకోకపోవటం మంచిది. ఒక వేళ తప్పని సరిగా వేసుకోవాలంటే- తేలికపాటి జీన్స్ వేసుకుంటే మంచిది.



**లేత రంగులే ముద్దు..**

లేత రంగులు వేసుకోవటం వల్ల సూర్యకిరణాలు చొచ్చుకుపోవు. చెదిరిపోతాయి. దీని వల్ల శరీరం వేడి ఎక్కదు. ముదురు రంగులు వేసుకోవటం వల్ల సూర్యకిరణాలు చొచ్చుకుపోతాయి. శరీరం వేడెక్కిపోతుంది.

### తరచు కదలండి...

ఎక్కువ సేపు ఒకే చోట కూర్చుంటే- వేడి పెరిగిపోతుంది. చెమట పట్టి ఇబ్బందిగా ఉంటుంది. అందువల్ల వేసవిలో తరచూ అటూ ఇటూ కదులుతూ ఉండాలి. అప్పుడు గాలి బట్టలలో ఉన్న ఖాళీల ద్వారా చర్మంపైకి వెళ్తుంది.

**కాటన్స్ వంటివి..**

కాటన్ బట్టలు.. తక్కువ బరువు ఉండే బట్టలు వేసుకుంటే మంచిది. బరువు ఎక్కువగా ఉన్న బట్టలు వేసుకోవటం వల్ల వేసవిలో ఇబ్బందిగా అనిపిస్తుంది.

### షూలు కూడా

చాలా మంది వేసవిలో బరువైన లెదర్ షూలు లేదా.. స్పోర్ట్స్ షూలు ధరిస్తూ ఉంటారు. బయట వాతావరణంలో వేడి ఎక్కువగా ఉండటం వల్ల కాళ్లకు చెమట పడుతుంది. అంతే కాకుండా బరువైన షూస్‌ను ధరించటం వల్ల బయట నుంచి గాలి కూడా ఎక్కువ ప్రసరించదు. దీని వల్ల పాదాలకు ఇబ్బంది ఏర్పడుతుంది.



ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 6 మార్చి 2024
cinema@andhrajyothy.com

ఒక రోజు పర్యటన నిమిత్తం సోమవారం సాయంత్రం చెన్నై వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీతో సీనియర్ నటి, నృత్య కళాకారిణి వైజయంతి మాల భేటీ అయ్యారు. ఈ విషయాన్ని తన ఎక్స్ ఖాతాలో పొందుపరుస్తూ వైజయంతి మాల భారతీయ చలనచిత్రసీమకు అందించిన సేవలు అజరామరం అని, ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఆమె సేవలను గుర్తించి అత్యున్నతమైన పద్మవిభూషణ్ అవార్డును ప్రకటించిందని ప్రధాని మోది పేర్కొన్నారు.



# సలార్ 2 షూటింగ్ ఎప్పుడంటే..?



'సలార్' మూవీతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కారు ప్రభాస్. ఈ మూవీకి సీక్వెల్‌గా తెరకెక్కబోతోన్న 'శౌర్యాంగ పర్వం'పై భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా, పార్ట్-1లో భారవి పాత్రలో నటించిన నేషనల్ అవార్డ్ విన్నర్, నటుడు బాబీ సింహా ఈ చిత్రంపై అప్‌డేట్ ఇచ్చారు. షూటింగ్ ఏప్రిల్‌లో ప్రారంభం కానుందని మీడియాకు తెలిపారు. మరోవైపు కొద్దిరోజుల క్రితమే ఈ సీక్వెల్ గురించి నిర్మాత విజయ కిరగందూర్ మాట్లాడారు. పార్టు-2 స్క్రిప్టు వర్క్ పూర్తయిందని తెలిపారు. మొదటి భాగానికి దక్కిన ఆదరణ పట్ల ఎంతో సంతృప్తిగా ఉన్నామని అన్నారు. 'శౌర్యాంగ పర్వం' హాలీవుడ్ సిరీస్ 'గేమ్ ఆఫ్ థ్రోన్స్'ను పోలి ఉంటుందంటూ వెల్లడించి పార్ట్-2పై అందరిలోనూ ఆసక్తిని రెట్టింపు చేశారు. కాగా, ప్రశాంత్ నీల్ దర్శకత్వంతో తెరకెక్కిన 'సలార్ పార్ట్-1' గతేడాది డిసెంబర్ 22న విడుదలై వసూళ్ల ప్రభంజనం సృష్టించింది. ఇప్పటివరకూ ఎవరూ చూపించని విధంగా ప్రభాస్‌ను సరికొత్త యాక్షన్ అవతార్‌లో చూపించారని ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అయ్యారు. 'సలార్' రిలీజ్ సమయానికే పార్ట్-2 షూటింగ్ 40 శాతం పూర్తైంది. మిగిలిన వర్క్ పూర్తి చేసి, 2025లో విడుదల చేయడానికి మేకర్స్ ప్రయత్నిస్తున్నారు.

# వార్-2లో ఎన్టీఆర్ పాత్రపై క్లారిటీ..!



'ఆర్ఆర్ఆర్'తో పాన్‌ఇండియా స్టార్‌గా ఎదిగారు జూనియర్ ఎన్టీఆర్. ప్రస్తుతం ఆయన వరుస పాన్‌ఇండియా ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. దేవర చిత్రం సెట్స్‌పై ఉండగానే బాలీవుడ్ చిత్రం వార్-2కు సైన్ చేశారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో ఆయన నటిస్తున్నారనే అధికారిక ప్రకటన కొన్నాళ్ల క్రితమే వెలువడింది. తాజాగా, ఈ చిత్రంలో ఎన్టీఆర్ పోషించే పాత్రపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఇందులో భారతీయ రా ఏజెంట్‌గా ఎన్టీఆర్ నటిస్తున్నారని నిర్మాత ఆదిత్య చోప్రా వెల్లడించారు. అంతేకాక ఎన్టీఆర్ అభిమానులు పండుగ చేసుకునేలా మరో తీపి కబురును కూడా నిర్మాత ఆదిత్య చోప్రా అందించారు. ఎన్టీఆర్ పాత్ర కేవలం ఈ సినిమాకు మాత్రమే పరిమితం కాలేదని..ఆ పాత్రను కొనసాగిస్తూ ఈ స్పై యూనివర్స్‌లోనే మరో ప్రత్యేక చిత్రాన్ని తీర్చిదిద్దే ఆలోచన ఉందని అన్నారు. ఈ స్పై యూనివర్స్ ఫ్రాంచైజీలో తెరకెక్కే మరిన్ని చిత్రాల్లో ఎన్టీఆర్ అతిథిగా మెరవనున్నారు అని నిర్మాత ప్రకటించారు. కాగా, ఈ సినిమాలో హృతిక్ రోషన్‌తో కలిసి ఎన్టీఆర్ నటించనున్నారు. 'బ్రహ్మాస్త్ర' ఫేం అయాన్ ముఖర్జీ ఈ సినిమాకు దర్శకుడు. వచ్చే ఏడాది ఆగస్టులో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయ్యటానికి చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.

# పోలీస్ కథల్లో విభిన్నం భీమ



'భీమ' కమర్షియల్ ప్యాక్డ్ మూవీ. నా పాత్రలో ప్రేమ, ఎమోషన్స్, రొమాన్స్. ఇలా అన్ని అంశాలూ ఉంటాయి. సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత నా పాత్ర ప్రేక్షకుడి మనసులో నిలిచిపోతుందనే నమ్మకం ఉంది. ఈ కథలోని సెమీ ఫాంటసీ ఎలిమెంట్‌ను దర్శకుడు హర్ష చాలా అద్భుతంగా చూపించారు. ప్రతి యాక్షన్ సీన్‌లో ఎమోషన్ ఉంది. అది ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు హీరో గోపీచంద్. ఆయన హీరోగా నటించిన 'భీమ' చిత్రం ఈనెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలు పంచుకున్నారు.

- 'భీమ' జర్నీ ఎలా మొదలైందో చెబుతూ 'ఈ చిత్ర సహనిర్మాత శ్రీధర్ కొవిడ్ సమయంలో దర్శకుడు హర్షను పరిచయం చేశారు. ఆయన ఒక కథ చెప్పారు కానీ అలాంటి సమయంలో వద్దనిపించింది. అందుకే పోలీసుకి సంబంధించి ఏదైనా విభిన్నమైన కథ ఉంటే చెప్పమన్నా. ఎనిమిది నెలలు గ్యాప్ తీసుకుని ఈ కథ చెప్పారు. హీరో పాత్ర పేరు భీమ. ఈ కథకు అదే పేరు యాప్ట్ కనుక టైటిల్‌గా నిర్ణయించాం. భీమ క్యారెక్టరైజేషన్ నచ్చి అంగీకరించా' అన్నారు.'
- తమ సినిమాకీ, 'అఖండ' చిత్రానికీ పోలికలు లేవని అని స్పష్టం చేశారు. 'అఘోరాలు, కలర్ ప్యాట్రన్, మ్యూజిక్ వల్ల అలా అనిపించి ఉండవచ్చు. కానీ 'భీమ' పూర్తిగా డిఫరెంట్ స్టోరీ. అయినా 'అఖండ'తో పోలిస్తే మంచిదేగా' అని నవ్వేశారు గోపీచంద్.
- తన కొత్త సినిమాల గురించి చెబుతూ 'శ్రీను వైట్ల దర్శకత్వంలో చేస్తున్న సినిమా 30 శాతం పూర్తయింది. ప్రసాద్‌గారితో ఒక సినిమా ఉంటుంది. అలాగే యూవీ క్రియేషన్స్‌లో చేయబోయే చిత్రానికి కథ తయారవుతోంది' అన్నారు గోపీచంద్.

# కంటెంట్ ఉన్న చిత్రాలకు ఆదరణ ఉంటుంది

చదలవాడ శ్రీనివాసరావు



'కంటెంట్ ఉంటే ఏ సినిమా అయినా ప్రేక్షకులు ఆదరిస్తారు. నేను అందించిన 'బిచ్చగాడు' చిత్రంతో అది మరోసారి రుజువైంది. అందుకే ప్రజలకు మనసుకి హత్తుకొనే విధంగా, వాస్తవానికి దగ్గరగా 'రికార్డ్ బ్రేక్' చిత్రాన్ని తీశాను. కథ మీద నమ్మకంతో చాలా డబ్బు ఖర్చు పెట్టి తీసిన ఈ సినిమా ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుంది' అన్నారు సీనియర్ నిర్మాత శ్రీనివాసరావు. 'హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామయ్య' చిత్రం తర్వాత ఆయన మళ్లీ దర్శకత్వం వహించిన 'రికార్డ్ బ్రేక్' చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 'ట్రైలర్ రిలీజ్ అయినప్పుడు ఎటువంటి రెస్పాన్స్ వచ్చిందో ఈ సినిమాను అందరికీ చూపించినప్పుడు అదే స్పందన వచ్చింది. ప్రీవ్యూ సమయంలో సినీ ప్రముఖులు ఇచ్చిన సూచనల మేరకు సినిమాను కొంత ట్రిమ్ చేశాం. దీని వల్ల సినిమాకు మరింత అందం వచ్చింది. ఈ సినిమాకు 'రికార్డ్ బ్రేక్' టైటిల్ యాప్ట్ అని అందరూ చెబుతున్నారు' అని ఆయన అన్నారు. 'ప్రస్తుతం ఉన్న హీరోలలో ఇటువంటి భారీ కాయం ఉన్న వారెవరూ లేరు. అందుకే కొత్త వారిని ఎన్నుకొని ఈ సినిమా తీశాం. సినిమాకు ఎంత అవసరమో అంత ఖర్చు పెట్టాం. అలాగే విజువల్ ఎఫెక్ట్స్ విషయంలోనూ రాజీ పడలేదు' అని చెప్పారు శ్రీనివాసరావు.

'హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామయ్య' చిత్రం కొన్ని కేంద్రాల్లో బాగా ఆడినా, అప్పుడు వచ్చిన పెద్ద సినిమాలతో పోటీ పడలేకపోయింది. 'రికార్డ్ బ్రేక్' చిత్రం మాత్రం కచ్చితంగా అందరినీ అలరిస్తుంది. మంచి సినిమాగా నిలుస్తుంది. 'బిచ్చగాడు' చిత్రంలో హీరో తల్లి కోసం కష్టపడతాడు. 'రికార్డ్ బ్రేక్'లో బిడ్డల కోసం తల్లి ఏం చేసింది అని చెబుతున్నాం. పతాక సన్నివేశాలు అందరినీ ఆకట్టుకుంటాయి' అని చెప్పారాయన. 'నాకు ఎక్కువ థియేటర్లు అందుబాటులో ఉన్నా 'బిచ్చగాడు' సినిమాలా మొదట కొన్ని థియేటర్లలోనే విడుదల చేస్తున్నాం. ప్రేక్షకుల స్పందనను బట్టి థియేటర్ల సంఖ్య పెంచుతాం' అని చెప్పారు శ్రీనివాసరావు. 'రికార్డ్‌బ్రేక్' చిత్రాన్ని చూసి ప్రేక్షకులు తనకు పాస్ మార్కులు వేస్తే హాలీవుడ్ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ చిత్రాన్ని అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో తీస్తానని చదలవాడ శ్రీనివాసరావు ప్రకటించారు.

# గామి.. కొత్త ప్రయత్నం

దర్శకుడు విద్యాధర్



విశ్వక్‌సేన్, చాందినీ చౌదరి జంటగా నటించిన 'గామి' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు విద్యాధర్ కాగిత మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 'హిమాలయ పర్వతాలు, మంచు శిఖరాలు, అక్కడికి ప్రయాణించడం అంటే నాకు ఇష్టం. అలాగే విఠలాచార్యగారి జానపద చిత్రాలు అంటే అభిమానం. ఇవన్నీ కలసి ఓ ఆలోచనగా మారి, కథారూపం ఏర్పడ్డాయి. క్రౌడ్ ఫండ్ కోసం ఒక పిచ్ వీడియో తయారు చేశాం. దాని ద్వారా వచ్చిన డబ్బుతో చిత్ర నిర్మాణం ప్రారంభించాం. మా సినిమా గ్లింప్స్ చూసి యూవీ క్రియేషన్స్ వారు సపోర్ట్ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. హీరో విశ్వక్‌సేన్‌కు అప్పుడు సినిమాలు లేవు. ఆడిషన్స్ చేసి ఎంపిక చేశాం. చాలా ఓపెన్ మైండ్‌తో తను ఈ ప్రాజెక్ట్‌లో బాగా ఇన్‌వాల్వ్ అయ్యారు.' అని చెప్పారు. చిత్ర నిర్మాణానికి ఐదేళ్లు పట్టడానికి కారణాల్ని వివరిస్తూ 'ప్రేక్షకులకు కొత్తగా చెప్పాలనుకున్నాం కనుక ఎక్కువ పట్టిందనే భావన లేదు. విజువల్స్, మ్యూజిక్, టెక్నికల్ పరంగా కొత్తగా ప్రయత్నించాం.. ట్రైలర్ లో చూపించినట్లు సినిమాలో పాత్రలన్నీ ఆసక్తికరంగా సాగుతాయి. సినిమా అంతా ఎంగేజింగ్‌గా ఉంటుంది. ముందు ఏం జరగబోతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో కలిగిస్తుంది. యూవీ క్రియేషన్స్ వారు ప్రాజెక్ట్‌లో ఇన్‌వాల్వ్ అయిన తర్వాత ఫైనాన్షియల్ ఫ్రీడమ్ వచ్చింది. బిగ్గర్ స్కేల్‌లో పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చేసుకోవడానికి వారు అవకాశం ఇచ్చారు' అని తెలిపారు.



# పుష్ప రాజే నా రోల్ మోడల్

గ్లామర్ రోల్స్‌లో మెప్పిస్తూనే మరోవైపు నటనకు ఆస్కారమున్న పాత్రలనూ ఎంచుకుంటుంటారు అగ్ర కథానాయిక సమంత. ఇటీవలే మయోసైటిస్ అనే వ్యాధి నుంచి కోలుకుని సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిందీ భామ. తాజాగా, ఓ కాలేజీ ఫంక్షన్‌లో పాల్గొన్న సమంత అక్కడి విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చింది. అందులో ఒక విద్యార్థి 'నటనలో మీకు రోల్ మోడల్ ఎవరు' అని ప్రశ్నిస్తే, ఆమె తడుముకోకుండా అల్లు అర్జున్ అని తెలిపింది. ఒక సినిమా నుంచి మరో సినిమాకు అల్లు అర్జున్ ఎంతో పరిణితి చెందుతూ యాక్టింగ్ బీస్ట్‌గా మారారని ప్రశంసించింది. ఆయనతో కలసి తెరను పంచుకోవడం ఎంతో సవాలుతో కూడుకున్న విషయమని, అందుకోసమే మళ్లీ తనతో నటించే చాన్సు కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నానంది. ఈ మాటలు విన్న స్టైలిష్ స్టార్ అభిమానులు ఆనందంలో మునిగితేలుతున్నారు. వీళ్లిద్దరూ కలసి 'సన్ ఆఫ్ సత్యమూర్తి' చిత్రంలో నటించారు. ఆ తర్వాత అల్లు అర్జున్ నటించిన 'పుష్ప' చిత్రంలోని ఓ ఐటమ్ సాంగ్‌లో మెరిసిందీ బ్యూటీ. ప్రస్తుతం సిటాడెల్, చెన్నై స్టోరీస్‌తో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతోంది సమంత.

# రెండు కుటుంబాల మధ్య జరిగే కథ



రవితేజ నున్నా, నేహా జురెల్ జంటగా నటించిన 'రాజుగారి అమ్మాయి.. నాయుడుగారి అబ్బాయి' చిత్రం ఈనెల 9న విడుదల కానుంది. ఈ సినిమాతో సత్యరాజ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విడుదల సందర్భంగా రవితేజ, సత్యరాజ్ మంగళవారం పాత్రికేయులతో మాట్లాడారు. ఇది కులాల నేపథ్యంలో తీసిన సినిమా కాదని, రెండు కుటుంబాల మధ్య జరిగే ఇంటెన్స్ స్టోరీ అని దర్శకుడు సత్యరాజ్ చెప్పారు. సినిమా కథ కొత్తగా ఉంటుందని తెలిపారు. గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా అయినా ఇదొక క్రైమ్ థ్రిల్లర్ అని ఆయన చెప్పారు. 'నేను ఒకసారి కేరళ నుంచి హైదరాబాద్‌కు వస్తున్నప్పుడు కొందరు అక్కడ జరిగిన ఓ సంఘటన గురించి చర్చించుకుంటున్నారు. కులాల కారణంగా ఓ ఊరే తగలబడిపోయిందని వారు చెప్పారు. ఆ సంఘటన ఆధారంగా నేను అమలాపురం నేటివిటీకి తగ్గట్లుగా కథ తయారు చేశాను' అని చెప్పారు సత్యరాజ్. 'ఒక చిన్న సినిమాగా ప్రారంభించాం. పది రోజుల వర్క్ పూర్తయిన తర్వాత ఎవరిదైనా సపోర్ట్ లభిస్తే బాగుంటుందనిపించింది. అలా ముత్యాల రామదాసుగారిని సంప్రదించాం. ఆయన వచ్చాక సినిమా స్వరూపమే మారిపోయింది' అని ఆయన చెప్పారు. నటనలో ప్రత్యేకంగా శిక్షణ ఏమీ తీసుకోలేదని, దర్శకుడి సలహాలు పాటిస్తూ నటించానని హీరో రవితేజ నున్నా చెప్పారు. తన నుంచి దర్శకుడు కావాల్సిన నటన రాబట్టుకున్నారని ఆయన తెలిపారు.

# శరవేగంగా.. లగ్గం!



'భీమదేవరపల్లి బ్రాంచి' ఫేం రమేశ్ చెప్పాల దర్శకత్వంలో చిత్రీకరణ జరుపుకొంటోన్న చిత్రం 'లగ్గం'. సాయి రోనక్, ప్రగ్యా నగ్రా హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్, రోహిణి, ఎల్ బి శ్రీరామ్, సప్తగిరి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. వేణుగోపాల్ రెడ్డి నిర్మిస్తున్నారు. మంగళవారం, ఈ చిత్ర బృందం మీడియాతో ముచ్చటించింది. పెళ్లి కాన్సెప్ట్‌తో వచ్చిన సినిమాలన్నింటి కంటే ప్రత్యేకంగా ఈ చిత్రం ఉండబోతోందని నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. తెలంగాణ పెళ్లిని కన్నుల విందుగా తెరకెక్కించామని, ప్రతీ ఒక్కరూ ఈ చిత్రం చూసి ఇందులోని సన్నివేశాల గురించి గొప్పగా మాట్లాడుకుంటారని ఈ చిత్ర దర్శకుడు రమేశ్ తెలిపారు. ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుందని.. కొన్ని తరాలు గుర్తుంచుకునేలా ఉంటుందని నిర్మాత విశ్వాసం వ్యక్తం చేశారు. దర్శకుడు అన్ని హంగులు జోడించి లగ్గం యూనివర్స్‌ను క్రియేట్ చేశారని నటి రోహిణి పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు-చరణ్ అర్జున్, ఎడిటర్-బొంతల నాగేశ్వర రెడ్డి, కెమెరామెన్-

## సాత్విక్ జోడీ శుభారంభం


**పారిస్:** తెలుగు షట్లర్లు సాత్విక్ సాయిరాజ్, గాయత్రి గోపీచంద్ జోడీలు ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశాయి. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో వరల్డ్ నెంబర్ వన్ ద్వయం సాత్విక్-చిరాగ్ షెట్టి 21-13, 24-22తో ఓంగ్ యూ -టియో (మలేసియా) జోడీపై నెగ్గి, రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ 16-21, 21-19, 21-17తో సహచర షట్లర్లు అశ్విని పొన్నప్ప-తనీషా క్యాస్ట్రో ద్వయంపై గెలిచింది. లక్ష్యసేన్ 15-21, 21-15, 21-3తో సునేయమ (జపాన్)పై నెగ్గి ముందంజ వేయగా, ప్రియాన్షు రజావత్ 8-21, 15-21తో డెన్మార్క్ దిగ్గజం విక్టర్ ఆక్సెల్‌సెన్ చేతిలో ఓడిలో టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఇక, బుధవారం జరగనున్న సింగిల్స్ తొలి రౌండ్‌లో పీవీ సింధు బరిలోకి దిగనుంది.

## అర్జున్‌కు డ్రా

**న్యూఢిల్లీ:** షెంగ్జెన్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ ఐదో రౌండ్‌ను తెలుగు జీఎం ఇరిగేసి అర్జున్ డ్రాగా ముగించాడు. చైనాలో జరుగుతున్న ఈ టోర్నీలో అర్జున్‌కు ఇది తొలి డ్రా. మంగళవారం చైనా జీఎం యు యాంగితో ముగిసిన ఐదో రౌండ్‌లో నల్ల పావులతో బరిలోకి దిగిన అర్జున్ గత గేమ్‌లతో పోలిస్తే ఒకింత రక్షణాత్మకంగా ఆడాడు. ఆట 25వ ఎత్తు వద్ద ఇరువురు జీఎంలు డ్రాకు అంగీకరించడంతో చెరో అర పాయింట్ లభించింది. ఇక, చెక్ రిపబ్లిక్‌లో జరుగుతున్న ప్రాగ్ ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్‌లో ప్రజ్ఞానంద మూడో విజయం సాధించాడు. ఆరో రౌండ్‌లో ఉజ్బెకిస్థాన్‌తో జీఎం అబ్దుసత్తోరోవ్ నోదిర్బెక్‌పై ప్రజ్ఞానంద గెలిచాడు.

# ఢిల్లీ అలవోకగా..

- జెమీమా, లానింగ్ హాఫ్ సెంచరీలు
- 29 పరుగులతో ముంబై చిత్తు


జెమీమా (69 నాటౌట్)

**సంక్షిప్త స్కోర్లు**

**ఢిల్లీ:** 20 ఓవర్లలో 192/4 (జెమీమా 69 నాటౌట్, లానింగ్ 53; షబ్నిం 1/46, పూజ 1/20).
**ముంబై:** 20 ఓవర్లలో 163/8 (అమన్‌జోత్ 42; జొనాసెన్ 3/21, కాప్ 2/37).

డబ్ల్యూపీఎల్‌లో అత్యంత వేగవంతమైన బంతిని విసిరిన బౌలర్‌గా షబ్నిం రికార్డులకెక్కింది. ఢిల్లీ బ్యాటింగ్‌లో మూడో ఓవర్ రెండో బంతిని ఆమె గంటకు 132.1 కిమీ వేగంతో విసిరింది. ఈ బంతిని లానింగ్ ఆడలేక పోయింది.

**నేటి మ్యాచ్**
గుజరాత్ x బెంగళూరు
రాత్రి 7.30 గం. నుంచి

**న్యూఢిల్లీ:** డబ్ల్యూపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ జెమీమా రోడ్రిగ్స్ (33 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 69 నాటౌట్), లానింగ్ (38 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53) అర్ధ శతకాలతో.. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 29 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసింది. ఆరంభ మ్యాచ్‌లో ఎదురైన పరాజయానికి ఢిల్లీ అంచెలో క్యాపిటల్స్ బదులు తీర్చుకొంది. తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 4 వికెట్లకు 192 పరుగులు చేసింది. షబ్నిం పూజ, హేలీ, ఇషాక్ తలో వికెట్ పడగొట్టారు. లక్ష్య ఛేదనలో ఓవర్లన్నీ ఆడిన ముంబై 163/8 స్కోరుకే పరిమితమైంది. పేసర్ మరిజానె కాప్ (2/37) దెబ్బకు ముంబై ఘోరంగా తడబడింది. ఓపెనర్ యాస్తిక (6)తోపాటు హర్మన్‌ప్రీత్ (6)ను కాప్ అవుట్ చేయగా.. బ్రంట్ (5)ను శిఖ వెనక్కిపంపింది. ఈ దశలో మాథ్యూస్, అమెలియా కెర్ (17) నాలుగో వికెట్‌కు 25 పరుగులతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, హేలీని జొనాసెన్ (3/21) క్యాచవుట్ చేయడంతో హర్మన్‌సేన మ్యాచ్‌పై ఆశలు వదిలేసుకొంది. అమన్‌జోత్ (42), సజన (24 నాటౌట్) కొంతసేపు పోరాడినా.. ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగారు.

**బాదేసిన జెమీమా**

డెత్ ఓవర్లలో జెమీమా ఎడాపెడా షాట్లతో విరుచుకుపడడంతో.. ఢిల్లీ భారీ స్కోరు చేసింది. జొనాసెన్ (4 నాటౌట్)తో కలసి ఐదో వికెట్‌కు 16 బంతుల్లో అభేద్యంగా 41 పరుగులు జోడించిన రోడ్రిగ్స్.. టీమ్ స్కోరును 190 మార్క్ దాటించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన క్యాపిటల్స్‌ను లానింగ్ ముందుండి నడిపించింది. షఫాలీ (28)తో కలసి తొలి వికెట్‌కు 48 పరుగులు జోడించిన లానింగ్.. క్యాప్సీ (19), జెమీమాలతో రెండో, మూడు వికెట్లకు 31, 35 పరుగుల భాగస్వామ్యాలు నెలకొల్పింది. బౌండ్రీతో ఫిఫ్టీ పూర్తి చేసిన లానింగ్‌ను పూజ క్యాచవుట్ చేసింది. అయితే, చివరి 5 ఓవర్లలో జెమీమా సూపర్ షోతో.. ముంబై 69 పరుగులు సమర్పించుకొంది.

## అంతర్జాతీయ క్రికెట్‌కు షాబాజ్ నదీమ్ గుడ్‌బై



**న్యూఢిల్లీ:** టీమిండియా ఆటగాడు, జార్ఖండ్ లెఫ్టార్మ్ స్పిన్నర్ షాబాజ్ నదీమ్ అంతర్జాతీయ స్థాయితో పాటు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కూ గుడ్‌బై చెప్పేశాడు. జాతీయ జట్టుకు ఆడేందుకు తనకు అన్ని దారులు మూసుకుపోయాయని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు 34 ఏళ్ల నదీమ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ప్రపంచవ్యాప్తంగా జరిగే టీ20 లీగ్‌లలో ఆడేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్టు తెలిపాడు. 2019-2021 మధ్య టీమిండియా తరఫున రెండు టెస్టులు ఆడిన నదీమ్.. 8 వికెట్లు పడగొట్టాడు. రెండు దశాబ్దాల తన కెరీర్‌లో 140 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడి 542 వికెట్లు తీశాడు.

## ఢిల్లీ తుఫాన్స్ గెలుపు

**చెన్నై:** ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో ఢిల్లీ తుఫాన్స్ జట్టు అద్భుత విజయం సాధించింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 3-2తో కొచ్చి బ్లూ స్పైకర్స్‌పై నెగ్గింది. ఈ విజయంతో ఢిల్లీ పాయింట్ల పట్టికలో తిరిగి రెండో స్థానానికి చేరుకోగా, అహ్మదాబాద్ డిఫెండర్స్‌లో టాప్‌లోనే కొనసాగుతోంది.

# సెలెక్షన్ డైలమా



## కుల్దీప్ వర్సెస్ ఆకాశ్
### ఇంగ్లండ్‌తో ఆఖరి టెస్టు

**ధర్మశాల:** ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను దక్కించుకున్న జోష్‌లో ఉన్న టీమిండియా ఆఖరి మ్యాచ్ కోసం సన్నద్ధమవుతోంది. అలాగే ఈ టెస్టుకు స్టార్ పేసర్ బుమ్రా జట్టులోకి రానున్నాడు. కానీ మిడిలార్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఫిట్‌నెస్ నిరూపించుకోకపోవడంతో ధర్మశాల టెస్టుకూ దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి జరిగే ఈ ముగింపు టెస్టు కోసం భారత తుది జట్టు ఎలా ఉండబోతుందన్న ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది. బ్యాటింగ్ విభాగంలో రజత్ పటీదార్‌కు మరో అవకాశం దక్కవచ్చని భావిస్తున్నారు. సర్ఫరాజ్, జురెల్ తమ అరంగేట్రాలను చిరస్మరణీయం చేసుకున్నా.. పటీదార్ మాత్రం ఆడిన మూడు మ్యాచ్‌ల్లో 63 పరుగులే చేసి నిరాశపరిచాడు. సిరీస్‌లో మిగిలింది ఒకే మ్యాచ్ కావడంతో ఈ దశలో దేవ్‌దత్ పడిక్కళ్‌కు చాన్స్ ఇవ్వడం కన్నా.. రజత్‌నే కొనసాగిస్తే బావుంటుందని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఒక రకంగా అతడికిది ఆఖరి అవకాశంగా భావించవచ్చు.

**ఆకాశ్ కష్టమే!**

బౌలింగ్ విభాగంలో మాత్రం కోచ్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ మల్లగుల్లాలు పడుతున్నారు. సిరీస్‌లో ఇప్పటిదాకా పేసర్లు, స్పిన్నర్లు విశేషంగా రాణించారు. దీంతో బుమ్రా రాకతో ఎవరిని ఉంచాలో? ఎవరిని తప్పించాలో? అర్థంకాని పరిస్థితి నెలకొంది. అశ్విన్ కెరీర్‌లో వందో టెస్టు ఆడబోతుండడంతో తనకు తుది జట్టులో చోటు ఖాయమే. జడేజా సంగతి సరేసరి. ఇక ఇప్పటివరకు జరిగిన నాలుగు టెస్టుల్లో జట్టు ఇద్దరు పేసర్లతోనే ఆడింది. కాబట్టి బుమ్రాకు జతగా సిరాజ్‌నే కొనసాగించనున్నారు. దీంతో కుల్దీప్ యాదవ్ లేక ఆకాశ్ దీప్‌లలో ఒకరిపై వేటు పడనుంది. ధర్మశాలలో టర్నింగ్ వికెట్‌ను ఏర్పాటు చేయనున్నారని కథనాలు వినిపిస్తున్నాయి. అలాంటప్పుడు జట్టులో కుల్దీప్‌నే కొనసాగిస్తారని ఎవరైనా అంచనా వేయగలరు. అంతేకాకుండా నాలుగో టెస్టులో అతడి బ్యాటింగ్ నైపుణ్యం కూడా జట్టును ఆదుకుంది. అయితే అరంగేట్రంలోనే ఆకాశ్ దీప్ మూడు వికెట్లతో అందరి దృష్టిని ఆకర్షించాడు.

**ధర్మశాలకు రింకూ సింగ్**

టీ20 బ్యాటర్ రింకూ సింగ్‌ను ఫొటో షూట్ కోసంభారత జట్టు యాజమాన్యం ధర్మశాలకు పిలిపించడం ఆసక్తిగా మారింది. బహుశా అతడికి టీ20 వరల్డ్‌కప్‌లో చోటు దక్కవచ్చన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మెగా టోర్నీకి ముందు ఇంగ్లండ్‌తో టెస్టు సిరీసే భారత్‌కు చివరిది. అనంతరం ఈనెల్లోనే ఆటగాళ్లంతా ఐపీఎల్ ఆడనున్నారు. కాబట్టి ఐపీఎల్ మధ్యలోనే వరల్డ్‌కప్ జట్టును ప్రకటించాల్సి ఉంటుంది. అందుకే ముందస్తుగా రింకూను పిలిపించారని సమాచారం. ఇక ధర్మశాలలో రింకూ ఇంగ్లండ్ కోచ్ మెకల్లమ్‌ను కలిసిన ఫొటోను ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు.

## మాకూ గుర్తింపునివ్వండి!
### అంధుల క్రికెట్ జట్టు

**న్యూఢిల్లీ:** పురుషుల, మహిళల క్రికెట్‌లాగే తమను కూడా గుర్తించాలని అంధ క్రికెటర్లు బీసీసీఐకి విజ్ఞప్తి చేస్తున్నారు. వారిలాగే తమకూ సెంట్రల్ కాంట్రాక్ట్ ఇస్తే బాగుంటుందని అన్నారు. 'అంధుల క్రికెట్‌కు మరింత ఆదరణ దక్కాలంటే బీసీసీఐ గుర్తింపు తప్పనిసరి. అలా అయితేనే మేం ఉన్నత స్థాయికి ఎదగగలం. పాక్ అంధ క్రికెటర్లకు సెంట్రల్ కాంట్రాక్ట్ ఉంది కాబట్టే వారు అద్భుతంగా రాణిస్తున్నారు' అని భారత అంధుల క్రికెట్ జట్టు కోచ్ మహ్మద్ ఇబ్రహీం తెలిపాడు.

## హెలికాప్టర్‌లో రోహిత్ ఎంట్రీ



భారత కెప్టెన్ రోహిత్ శర్మ హెలికాప్టర్‌లో ధర్మశాల చేరుకున్నాడు. కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ బిలాస్‌పూర్‌లోని లుహ్నూ మైదానంలో నిర్వహించిన సన్సద్ ఖేల్ మహాకుంభ్ 3.0 కార్యక్రమంలో పాల్గొనేందుకు రోహిత్ ధర్మశాల నుంచి హెలికాప్టర్‌లో వెళ్లాడు. ల్యాండ్ అయిన వెంటనే హెచ్‌పీసీఏ అధికారులు, ఈవెంట్ నిర్వాహకులు అతడికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రోహిత్‌తో పాటు కోచ్ ద్రవిడ్ కూడా పాల్గొనగా వేదికపై అభిమానులతో వీరు సరదాగా క్రికెట్ ఆడారు.

# రసపట్టులో..
### విదర్భ x ఎంపీ రంజీ సెమీస్

**నాగ్‌పూర్:** రంజీ ట్రోఫీ రెండో సెమీఫైనల్ రసకందాయంగా మారింది. విదర్భ గెలుపునకు నాలుగు వికెట్లు అవసరంకాగా, విజయానికి మధ్యప్రదేశ్ (ఎంపీ) 93 పరుగుల దూరంలో ఉంది. ఓవర్‌నైట్ స్కోరు 343/6తో ఆటకు నాలుగో రోజైన మంగళవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 402 పరుగులకు ఆలౌటైంది. యశ్ రాథోడ్ శతకం (141), కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ హాఫ్ సెంచరీ (77)తో రాణించారు. మధ్యప్రదేశ్ బౌలర్ అనుభవ్ అగర్వాల్ ఐదు (5/92) వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మధ్యప్రదేశ్ ఆట ముగిసేసరికి 6 వికెట్లకు 228 పరుగులు చేసింది. ప్రధాన బ్యాటర్లందరూ పెవిలియన్‌కు చేరడంతో ప్రస్తుతం క్రీజులో టెయిలెండర్లు సారాంశ్ జైన్ (16), కార్తికేయ (0) ఉన్నారు. విదర్భ బౌలింగ్ దళాన్ని ఎదుర్కొని మధ్యప్రదేశ్ టెయిలెండర్లు విజయాన్ని సాధించడం కష్టమేనని విశ్లేషకుల అంచనా వేస్తున్నారు. ఇక, తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 170కి, మధ్యప్రదేశ్ 252 పరుగులకు ఆలౌటవడం తెలిసిందే.

## చోరీ చేసి పారిపోయిన పాక్ బాక్సర్



**కరాచీ:** ఒలింపిక్ క్వాలిఫికేషన్‌లో పాల్గొనడానికి ఇటలీ వచ్చిన పాకిస్థాన్ బాక్సర్ జొహైబ్ రషీద్ కనిపించకుండా పోయాడు. సహచరి బ్యాగునుంచి డబ్బు దొంగిలించిన అతడి ఆచూకీ తెలియడంలేదని పాకిస్థాన్ బాక్సింగ్ సమాఖ్య తెలిపింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొంది. ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో రషీద్ కాంస్యం సాధించాడు. మహిళా బాక్సర్ లారా ఇక్రమ్ ప్రాక్టీస్‌కు వెళ్లినప్పుడు.. ఆమె గదిలోకి చొరబడి పర్సులోని విదేశీ కరెన్సీని దొంగిలించి పారిపోయాడట. విదేశాల్లో మెరుగైన జీవితం కోసం పాక్ అథ్లెట్లు ఇలా కనిపించకుండా పోవడం తరచూ జరుగుతోంది. ఇటీవల ఆదేశ ఎయిర్ హోస్టెస్‌లు కూడా ఇలా ఆచూకీ లేకుండా మాయమయ్యారనే వార్తలు కూడా వచ్చాయి.

## శాట్స్ ఎండీగా లక్ష్మి

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) పూర్తి స్థాయి ఎండీగా ఐఏఎస్ అధికారిణి కొర్రా లక్ష్మికి పదోన్నతి లభించింది. లక్ష్మిని ఎండీగా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ వీసీ-ఎండీగా ఉన్న యువజన సర్వీసులు, క్రీడాశాఖ ప్రభుత్వ కార్యదర్శి శైలజా రామయ్యర్‌ను శాట్స్ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. 2012 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన లక్ష్మికి, గత ఏడాది సీఎం కప్ సందర్భంగా శాట్స్ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇవ్వడం తెలిసిందే.

# బిజినెస్

## బ్యాంక్ ఖాతాలకు మరోసారి కేవైసీ!?
### పారదర్శకత పెంచడంతోపాటు ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసేందుకే..




**న్యూఢిల్లీ:** బ్యాంక్ ఖాతాదారులూ.. మీ అకౌంట్ కేవైసీని (కస్టమరు వ్యక్తిగత వివరాల ధ్రువీకరణ ప్రక్రియ) మరోసారి అప్‌డేట్ చేయాల్సి రావచ్చు. ఎందుకంటే, బ్యాంకింగ్ వ్యవస్థలో పారదర్శకత పెంచడంతోపాటు మోసపూరిత కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు అదనపు తనిఖీల ద్వారా కేవైసీ ప్రక్రియను మరింత బలోపేతం చేయాలని బ్యాంక్‌లు ఆలోచిస్తున్నాయి. ఈ విషయమై ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వంతోనూ చర్చిస్తున్నాయి. ఈ ప్రణాళికలో భాగంగా ప్రస్తుత బ్యాంక్ ఖాతాలన్నింటికీ, ముఖ్యంగా ఒకే ఫోన్ నంబరుతో అనుసంధానితమైన పలు ఖాతాలు లేదా జాయింట్ అకౌంట్లకు బ్యాంక్‌లు అదనపు కేవైసీని కోరనున్నాయి. భిన్న పత్రాలతో వేర్వేరు ఖాతాలు తెరిచిన వ్యక్తుల నుంచి కూడా బ్యాంక్‌లు అదనపు సమాచారాన్ని కోరనున్నాయి. దేశీయ ఆర్థిక సేవల రంగంలో కేవైసీ నిబంధలను ప్రామాణీకరించడంతోపాటు ఆయా విభాగాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక కార్యదర్శి టీవీ సోమనాథన్ అధ్యక్షతన ఓ కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసింది. జాయింట్ అకౌంట్లకు బహుళ స్థాయి కేవైసీలో భాగంగా మరో (సెకండరీ) గుర్తింపుగా పాన్, ఆధార్, సరికొత్త మొబైల్ నంబరును కోరాలని భావిస్తున్నట్లు సీనియర్ బ్యాంక్ అధికారి ఒకరు తెలిపారు. ఈ సెకండరీ గుర్తింపు వివరాలు ఒకే వ్యక్తి భిన్న పత్రాల ద్వారా తెరిచిన వేర్వేరు ఖాతాలను (అనుసంధానితం కాని) గుర్తించేందుకు దోహదపడుతుందన్నారు. తద్వారా అకౌంట్ అగ్రిగేటర్ల (ఏఏ) నెట్‌వర్క్‌కు జాయింట్ అకౌంట్ల సమాచారం సైతం అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం ఏఏ నెట్‌వర్క్ సింగిల్ ఆపరేటెడ్ వ్యక్తిగత ఖాతాల సమాచారాన్ని మాత్రమే కలిగి ఉంది. అకౌంట్ అగ్రిగేటర్లు కస్టమర్ల ఆర్థిక ఆస్తులు, అప్పుల వివరాలను ఆ సమాచారాన్ని కలిగి ఉన్న బ్యాంక్‌లు లేదా ఆర్థిక సేవల సంస్థల నుంచి సేకరించి క్రెడిట్ రేటింగ్ బ్యూరోలు తదితర కంపెనీలకు అందిస్తాయి. అయితే, కొన్ని ఫిన్‌టెక్ కంపెనీలు కేవైసీ నిబంధనలను సరిగా పాటించడం లేదని, ఇవి ఖాతాదారుల సమాచారాన్ని క్రెడిట్ రేటింగ్ బ్యూరోలకు రిపోర్టు కూడా చేయడం లేదని గత ఏడాది ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ (ఐబీఏ) ఆర్‌బీఐ వద్ద ఆందోళన వ్యక్తపరిచింది. దాంతో రుణాల మంజూరు సమయంలో క్రెడిట్ బ్యూరోల డేటాపై పూర్తిగా ఆధారపడలేని పరిస్థితి నెలకొందని ఓ బ్యాంకర్ అన్నారు. ఈ నేపథ్యంలోనే కేవైసీ ప్రక్రియను మరింత పటిష్ఠం చేయాలని బ్యాంక్‌లు భావిసున్నాయి. ప్రస్తుతం పాస్‌పోర్ట్, ఆధార్, ఓటరు కార్డు, ఉపాధి హామీ పథకం కార్డు, పాన్ కార్డు లేదా డ్రైవింగ్ లైసెన్సు పత్రాన్ని సమర్పించి బ్యాంక్ ఖాతా తెరిచేందుకు వీలుంది. గతనెలలో ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి మండలి (ఎఫ్ఎస్‌డీసీ) ఉమ్మడి కేవైసీ నియమావళి, కేవైసీ రికార్డుల వినియోగంలో ఆర్థిక సేవల రంగంలోని ఆయా విభాగల మధ్య సమన్వయం, కేవైసీ ప్రక్రియ సరళీకరణ, డిజిటలీకరణపై చర్చించింది.

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 64,850 ▲ | 59,450 ▲ | 78,200 ▲ |
| ముంబై | 64,600 ▲ | 59,170 ▲ | 72,240 ▲ |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**

| | | | |
|---|---|---|---|
| 5వ తేదీ | | విజయవాడ | 463 |
| హైదరాబాద్ | 469 | విశాఖపట్నం | 500 |
| 6వ తేదీ | | వరంగల్ | 471 |
| చిత్తూరు | 523 | దజను గుడ్లు రూ.72 | |
| గోదావరి | 463 | | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 116 | గోదావరి | 124 |
| వరంగల్ | 116 | విజయవాడ | 124 |
| కరీంనగర్ | 116 | గుంటూరు | 124 |
| మహబూబ్‌నగర్ | 116 | ఒంగోలు | 124 |
| కర్నూలు | 116 | చిత్తూరు | 120 |
| విశాఖపట్నం | 121 | | |

# బంగారం 65000



### ఒక్క రోజులోనే రూ.800 అప్
### వెండిదీ అదే దారి

**న్యూఢిల్లీ:** పసిడి ధర చుక్కలంటుతోంది. ఢిల్లీ మార్కెట్‌లో మంగళవారం 10 గ్రాముల మేలిమి బంగారం (24 కేరట్స్) రికార్డు స్థాయిలో రూ.65,000 పలికింది. సోమవారంతో పోలిస్తే ఇది రూ.800 ఎక్కువ. కిలో వెండి ధర కూడా మంగళవారం రూ.900 పెరిగి రూ.74,900కు చేరింది. ఎంసీఎక్స్‌లో కూడా 10 గ్రాముల పసిడి ధర గత మూడు రోజుల్లోనే రూ.2,400 పెరిగింది. ఏప్రిల్‌లో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి పసిడి ధర, మంగళవారం ఎంసీఎక్స్‌లో రూ.80 పెరిగి రూ.65,542ల రికార్డు స్థాయికి చేరింది.

**హైదరాబాద్ మార్కెట్:** హైదరాబాద్ మార్కెట్‌లోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. సోమవారంతో పోలిస్తే 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.770 పెరిగి రూ.64,850కి చేరింది. కిలో వెండి ధర అయితే మంగళవారం ఒక్క రోజే రూ.1,100 పెరిగి రూ.78,200 పలుకుతోంది. ఢిల్లీ, ముంబై కంటే హైదరాబాద్‌లోనే వెండి ధర ఎక్కువగా ఉంది.

**కారణాలివే**

- అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా ప్రస్తుతం బంగారం, వెండి ధరలు చుక్కలంటాయి. ఔన్స్ (36.19 గ్రాములు) పసిడి ధర 2,152.3 డాలర్లకు చేరింది. ఈ ప్రభావం భారత మార్కెట్‌పైనా కనిపిస్తోంది.
- జూన్ నుంచి అమెరికా కేంద్ర బ్యాంకు 'ఫెడ్ రిజర్వు' వడ్డీరేట్లు తగ్గిస్తుందనే వార్తలు బులియన్ మార్కెట్‌కు కలిసి వస్తున్నాయి. అదే జరిగితే ఆర్‌బీఐ కూడా వడ్డీరేట్లు తగ్గించే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో మదుపరులు రుణ పత్రాలకు బదులు, పసిడి కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు.
- అమెరికా, జపాన్, భారత్‌లో స్టాక్ మార్కెట్లు ఇప్పటికే చుక్కలంటాయి. కొన్ని కంపెనీల షేర్ల ధరలు ఫండమెంటల్స్‌తో పోలిస్తే అత్యధిక ధరల వద్ద కోట్ అవుతున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్‌మార్కెట్లు తీవ్ర దిద్దుబాటుకు లోనయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఈ ప్రమాదాన్ని ముందే పసిగట్టిన కొందరు ఇన్వెస్టర్లు పెట్టుబడులకు పెద్దగా ఢోకా లేని పసిడి మార్కెట్ వైపు మొగ్గుచూపుతున్నారు.
- అంతర్జాతీయ ఉద్రిక్తతలు: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇంకా ఒక కొలిక్కి రాలేదు. మరోవైపు ఎర్ర సముద్రంలో ప్రయాణించే నౌకలపై హైతీల దాడులు, ఇజ్రాయిల్-హమాస్ పోరాటం ఈక్విటీ మార్కెట్లను భయపెడుతున్నాయి. దీంతో సురక్షిత పెట్టుబడిగా భావించే పసిడికి డిమాండ్ పెరిగింది.

## ఐసీఐజీ చేతికి వసంత్ కెమికల్స్

**హైదరాబాద్:** హైదరాబాద్‌కు చెందిన స్పెషాలిటీ కెమికల్స్, ఫార్మా ఇంటర్మీడియేటరీల తయారీ కంపెనీ వసంత్ కెమికల్స్‌లో మెజారిటీ వాటాను జర్మనీకి చెందిన ఇంటర్నేషనల్ కెమికల్ ఇన్వెస్టర్స్ గ్రూప్ (ఐసీఐజీ) కొనుగోలు చేసింది. వసంత్ కెమికల్స్ ప్రమోటర్ జీకేబీ చౌదరి నుంచి మెజారిటీ వాటాలు కొనుగోలు చేసినట్టు ఐసీఐజీ గ్రూప్ ప్రకటించింది. ఈ లావాదేవీ అనంతరం చౌదరి మైనారిటీ వాటాదారుగా ఉండిపోతారు. అయితే డీల్ విలువ ఎంత అన్నది వెల్లడించలేదు. ఈ కొనుగోలు లావాదేవీ పూర్తయిన అనంతరం వసంత్ కెమికల్స్‌ను ఐసిఐజీ అనుబంధ ఫైన్ రసాయనాల విభాగం వెల్‌కెమ్ గ్రూప్‌లో విలీనం చేయనున్నట్టు ఐసీఐజీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రపంచ స్పెషాలిటీ రసాయనాల మార్కెట్లన్నింటికీ విస్తరించాలన్న తమ వ్యూహానికి ఈ కొనుగోలు మరింత సహాయకారి అవుతుందని పేర్కొంది. అలాగే వసంత్ కెమికల్స్ కూడా ప్రపంచ మార్కెట్లకు విస్తరించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా కస్టమర్ బేస్‌ను పెంచుకోగలుగుతుందంటున్నారు. 40 సంవత్సరాల చరిత్ర గల వసంత్ కెమికల్స్‌కు హైదరాబాద్‌లోని జీడిమెట్ల, విశాఖపట్టణంలోని అచ్యుతాపురంలలో తయారీ యూనిట్లున్నాయి.

## పుణెలో కిమ్స్ ఆస్పత్రి

**హైదరాబాద్:** పుణె నగరంలో ఆస్పత్రి ఏర్పాటు కోసం 99 సంవత్సరాల కాలానికి స్థలం లీజు, భవనం కొనుగోలు ఒప్పందంపై సంతకాలు చేయనున్నట్టు కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ప్రకటించింది. 2.59 ఎకరాల విస్తీర్ణంలో, 2.72 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం గల నిర్మిత ప్రాంతంలో అత్యాధునిక సదుపాయాలతో ఈ ఆస్పత్రి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. ఈ ఆస్పత్రి 300 పడకల సామర్థ్యం కలిగి ఉంటుందని, ఈ ప్రాజెక్టుపై రూ.500 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నామని ప్రకటించింది. ముంబై-థాణే ప్రాంతంలో ఇదే తొలి ఆస్పత్రి అని, మహారాష్ట్రలో మూడో ఆస్పత్రి అని కిమ్స్ ఆ ప్రకటనలో తెలియచేసింది. నాసిక్‌లో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి నూతన ఆస్పత్రి వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ప్రారంభం కానున్నట్టు కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ బీ భాస్కరరావు తెలిపారు.

## సెన్సెక్స్ ర్యాలీకి బ్రేక్

**ముంబై:** స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం లాభాల స్వీకారంతో నష్టాల బారిన పడ్డాయి. సెన్సెక్స్ 195.16 పాయింట్ల నష్టంతో 73,677.13 వద్ద ముగియగా నిఫ్టీ 49.30 పాయింట్ల నష్టంతో 22,356.30 వద్ద క్లోజయింది. దీంతో వరుసగా నాలుగు సెషన్ల ర్యాలీకి బ్రేక్ పడింది.

**ఐపీఓ బాటలో బిగ్ బాస్కెట్**

టాటా గ్రూప్ నుంచి మరో కంపెనీ ఐపీఓకు రానుంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే బహుశా వచ్చే ఏడాది ఈ ఐపీఓ ఉంటుందని బిగ్ బాస్కెట్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ హరి మీనన్ చెప్పారు. అయితే దీనిపై తుది నిర్ణయం టాటాలదేనని తెలిపారు. వచ్చే ఆరు లేదా ఎనిమిది నెలల్లో బిగ్ బాస్కెట్ లాభాల బాట పడుతుందన్నారు. ఇటీవల ప్రారంభించిన 'బీబీ వెర్టికల్' లాభాల్లోనే ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం టర్నోవర్ రూ.12,000 కోట్లకు చేరే అవకాశం ఉందని చెప్పారు.

## ఆల్‌టైం గరిష్ఠానికి బిట్‌కాయిన్

బిట్‌కాయిన్ సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి చేరుకుంది. కాయిన్ మార్కెట్ క్యాప్ ప్రకారం.. మంగళవారం ప్రారంభ ట్రేడింగ్‌లో ఈ వర్చువల్ కరెన్సీ విలువ తొలిసారిగా 69,000 డాలర్ల మైలురాయికి ఎగువకు చేరుకుంది. అంతేకాదు, రెండేళ్లకు పైగా కాలంలో (2021 నవంబరు) ఈ కరెన్సీ కొత్త ఆల్‌టైం రికార్డును నమోదు చేయడం కూడా ఇదే మొదటిసారి.

## భారత మీడియా, వినోద రంగం 2026లో రూ.3 లక్షల కోట్లకు..
### ఫిక్కీ-ఈవై సంయుక్త నివేదిక



**న్యూఢిల్లీ:** గత ఏడాది భారత మీడియా, వినోద రంగం 8.1 శాతం వృద్ధితో రూ.2.32 లక్షల కోట్ల స్థాయికి చేరుకుందని మంగళవారం విడుదలైన ఫిక్కీ-ఈవై సంయుక్త నివేదిక వెల్లడించింది. ఈ ఏడాదిలో ఇండస్ట్రీ 10.2 శాతం వృద్ధితో రూ.2.55 లక్షల కోట్లకు.. 2026లో రూ.3.08 లక్షల కోట్లకు చేరుకోవచ్చని అంచనా వేసింది. అంతేకాదు, ఈ ఏడాదిలో డిజిటల్ మీడియా విభాగం టెలివిజన్ సెగ్మెంట్‌ను అధిగమించి రూ.75,100 కోట్ల స్థాయికి పెరగవచ్చని కూడా నివేదిక పేర్కొంది. మరిన్ని విషయాలు..

- గత ఏడాదిలో రూ.69,600 కోట్ల మార్కెట్ సైజుతో టీవీ అతిపెద్ద విభాగంగా కొనసాగింది. 2024లో టీవీ మార్కెట్ రూ.71,800 కోట్లకు పెరగవచ్చని అంచనా.
- 2023లో రూ.65,400 కోట్ల స్థాయికి చేరుకున్న డిజిటల్ మీడియా విభాగం.. ఈ ఏడాదిలో రూ.75,100 కోట్ల స్థాయికి చేరుకోవచ్చు. అంటే, ఇప్పటివరకు దేశీయ మీడియా, వినోద రంగంలో అతిపెద్ద విభాగంగా కొనసాగుతున్న టెలివిజన్ మార్కెట్ సైజును వించిపోనుంది.
- 2026 నాటికి డిజిటల్ మీడియా విభాగం రూ.95,500 కోట్లకు చేరుకోవచ్చని, 2023-26 మధ్యకాలంలో ఈ విభాగం 13.5 శాతం సీఏజీఆర్‌తో దూసుకెళ్లనుందని అంచనా. కాగా, టీవీ మీడియా 2026లో రూ.76,600 కోట్ల స్థాయికి చేరుకోవచ్చునంటున్నారు. డిజిటల్ మీడియా కంటే ఇది 20 శాతం తక్కువ.
- వచ్చే రెండేళ్లలో డిజిటల్ ప్రకటనల విభాగం 13.5 శాతం సీఏజీఆర్‌తో రూ.84,200 కోట్ల స్థాయికి చేరనుంది. ఇంటర్నెట్ సేవల వ్యాప్తి శరవేగంగా సాగుతున్న నేపథ్యంలో స్మార్ట్ టీవీల విభాగం 50 శాతం వృద్ధి చెందింది.
- బ్రాడ్‌బాండ్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతోంది. ఈ సేవల వినియోగదారులు 90.4 కోట్లకు చేరుకున్నారు. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు అనూహ్యంగా పెరిగిన ఫలితంగా ఇంటర్నెట్ సేవల వినియోగ సగటు కూడా పెరుగుతోంది.
- భారత మీడియా, వినోద రంగం మొత్తం ఆదాయంలో టెలివిజన్, ప్రింట్, సినిమాలు, లైవ్ ఈవెంట్లు, అవుట్ ఆఫ్ హోమ్ (ఓఓహెచ్), మ్యూజిక్, రేడియో వంటి సంప్రదాయ మీడియా వాటా తగ్గుతూ వస్తోంది. 2019లో ఇది 76 శాతంగా ఉండగా.. 2023లో 57 శాతానికి తగ్గింది.
- గేమింగ్, డీ2సీ బ్రాండ్లు ప్రచార ఖర్చులు తగ్గించుకోవడంతో గత ఏడాది టీవీ యాడ్ రెవెన్యూ 6.5 శాతం తగ్గింది.
- భారత ప్రింట్ మీడియా మాత్రం అంతర్జాతీయ ట్రెండ్‌కు భిన్నంగా మెరుగైన పనితీరును కనబరిచింది. గత ఏడాది ప్రింట్ మీడియా యాడ్ రెవెన్యూ 4 శాతం పెరిగింది. సబ్‌స్క్రిప్షన్ ఆదాయంలో 3 శాతం వృద్ధి నమోదైంది.



డిజిటల్ క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, తదితరులు

## బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు వారిష్టం

### మోదీని రేవంత్ పెద్దన్న అంటే కలిసిపోయినట్టేనా?: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు వారి ఇష్టం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీని రేవంత్‌రెడ్డి పెద్దన్న అని పిలిస్తే.. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటైపోయినట్టేనా? అలా ఎందుకు పిలిచారో ఆయన్నే అడగాలని మీడియాకు సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రెండు డిజిటల్ క్యాంపెయిన్లను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణతోపాటు దేశంలోని అన్ని ప్రాంతాల సమానాభివృద్ధికి మోదీ చేస్తున్న కృషిని వివరించడమే లక్ష్యంగా 'మన మోదీ' క్యాంపెయిన్ చేపట్టనున్నామని తెలిపారు. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు, మౌలికవసతుల కల్పన, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను 6 గ్యారెంటీల అమలుపై నిలదీస్తూ 'ప్రశ్నించే తెలంగాణ' పేరిట క్యాంపెయిన్‌ను చేపట్టనున్నామని కిషన్‌రెడ్డి చెప్పారు.

## 51% ఫిట్‌మెంట్ సిఫారసు చేయాలి

» పీఆర్సీ కమిటీని కోరిన హెచ్1 యూనియన్

పెరిగిన నిత్యావసర ధరలకనుగుణంగా ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్ అవసరమని... వేతన సవరణ సంఘం ఈమేరకు ప్రభుత్వానికి సిఫారసు చేయాలని తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్1 వ్యవస్థాపక అధ్యక్షులు కర్నాటి సాయిరెడ్డి కోరారు. ఈమేరకు పీఆర్సీ ఛైర్మన్ యన్.శివశంకర్, కమిటీ సభ్యులు రామయ్యను కలిశారు. 2018 నుంచి రావాల్సిన మొదటి వేతన సవరణ 30 నెలలు ఆలస్యమవ్వడంతో ఉద్యోగులంతా నష్టపోయామని కమిటీకి తెలిపారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటంటారా?: మల్‌రెడ్డి

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి స్వాగతం పలికి సీఎం రేవంత్‌రెడ్డి మంచి సంప్రదాయాన్ని పాటిస్తే.. మోదీ మాత్రం తన స్థాయి దిగజార్చుకునేలా మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబానికి కాళేశ్వరం ఏటీఎంలా మారిందన్న ప్రధాని.. ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అలాగే, మద్యం కేసులో కవితను ఎందుకు కాపాడుతున్నారని నిలదీశారు. కేసీఆర్‌ను జైలుకు పంపినప్పుడే తెలంగాణ ప్రజలు బీజేపీని నమ్ముతారని స్పష్టం చేశారు.

## నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్న కవిత: బల్మూరి

జీవో 3, జీవో 35 పేరిట ఎమ్మెల్సీ కవిత నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారని, వారిలో విభజన తీసుకువచ్చేందుకు యత్నిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. రోస్టర్ విధానం, హారిజాంటల్, వర్టికల్ విధానంలో గత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులనే కాంగ్రెస్ సర్కారు అవలంబిస్తోందని స్పష్టం చేశారు. మెమో 4981 ఆధారంగానే జీవోలు వచ్చాయన్న వెంకట్.. స్పష్టత లేని మెమో ఇచ్చి గందరగోళానికి తెరలేపింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు.

## అభివృద్ధికి సహరించాలనే కోరారు: మల్లు రవి

న్యూఢిల్లీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి సహకరించాలని ప్రధాని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి కోరలేదని రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు అందించాలని మాత్రమే కోరారని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి అన్నారు. ఫెడరల్ స్ఫూర్తితోనే మోదీని పెద్దన్నలా పనిచేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలు అర్థం కాకపోతే తామేం చేయాలని ప్రశ్నించారు. కోట్లాది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న విషయాన్ని కిషన్‌రెడ్డి గమనించాలన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం కాబోతోందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో 14 సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంటుందని ఆయన అన్నారు.

## గవర్నర్.. దయ చూపండి

## సత్ప్రవర్తన గల ఖైదీలకు క్షమాభిక్ష పెట్టండి

పంజాగుట్ట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జీవిత ఖైదు అనుభవిస్తున్న సత్ప్రవర్తనగల ఖైదీలకు క్షమాభిక్ష పెట్టి వారిని విడుదల చేయాలని వారి కుటుంబసభ్యులు గవర్నర్ తమిళిసైకి విజ్ఞప్తి చేశారు. తమ జీవితాల్లో వెలుగులు నింపాలని వేడుకున్నారు. ఖైదీల కుటుంబసభ్యులు రఘునాథ్, అజర్, రాజేష్, నాగమణి, లత, ముజాహిద్ తదితరులు మంగళవారం మీడియాతో మాట్లాడారు. తాము తెలంగాణలోని జైళ్లలో జీవిత ఖైదు అనుభవిస్తున్న వారి కుటుంబసభ్యులమని, తెలిసో తెలియకో క్షణికావేశంలో చేసిన తప్పునకు తమ కుటుంబసభ్యులు, కుటుంబ పెద్దలు జీవిత ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్నారన్నారు. సత్ప్రవర్తనతో జైలు జీవితం గడుపుతున్న వారిలో 231 మందిని విడుదల చేయడానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఈమేరకు జీవో ఎంఎస్ నెంబరు 2ను జారీ చేసి, సంబంధిత ఫైల్‌ను ఆమోదం కోసం గవర్నర్‌కు పంపిందన్నారు. రోజులు గడుస్తున్నా ఆ ఫైలుకు మోక్షం కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ స్పందించి వారికి క్షమాభిక్ష పెట్టి, తమ జీవితాల్లో వెలుగులు నింపాలని వేడుకున్నారు.

## ఆర్మీ జవాన్‌ను ఢీకొట్టినవాహన డ్రైవర్ అరెస్టు

హైదరాబాద్ సిటీ/నార్సింగ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్‌పై ఆర్మీ జవాన్‌ను ఢీకొట్టి పరారైన లారీ డ్రైవర్, క్లీనర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. డ్రైవర్ బదులు క్లీనర్ రెడీమిక్స్ వాహనాన్ని నడపడం.. 80 కి.మీ గరిష్ఠ వేగంతో వెళ్లాల్సిన నాలుగో లేన్‌లో ఓవర్ స్పీడ్‌లో వెళ్లడం వల్లే ప్రమాదం జరిగిందని నిర్ధారించారు. సోమవారం నార్సింగి సమీపంలోని ఓఆర్ఆర్ వద్ద లారీ ఢీకొని ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ఆర్మీ జవాన్ కులాన్ మృతి చెందారు. హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా పోలీసులు వాహన డ్రైవర్ ఆలమ్ అలియాస్ మోహద్ ఆలమ్ అన్సారీ(30), క్లీనర్ రుక్సత్ అన్సారీ(25)ని అదుపులోకి తీసుకున్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన క్లీనర్‌తో పాటు అతడికి వాహనమిచ్చిన డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

## మోదీ రాకతో రాష్ట్రానికి వచ్చిందేమీ లేదు:తమ్మినేని


ప్రధాని మోదీ తన తెలంగాణ పర్యటనలో అభివృద్ధి అంశాల కంటే ఎన్నికల ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో పర్యటించిన మోదీ.. ఇది ఎన్నికల సభ కాదంటూనే అందరి మద్దతు బీజేపీకే, 400 సీట్లు బీజేపీకే అంటూ ప్రసంగించారని దుయ్యబట్టారు. మాజీ ప్రొఫెసర్ సాయిబాబాతోపాటు మరో అయిదుగురిని ముంబై హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని తమ్మినేని వీరభద్రం తెలిపారు.

## నాపై ఉన్న కేసుల వివరాలివ్వండి

» ఈ ఐదేళ్లలో నాపై పలు అక్రమ కేసులు

» మీ కార్యాలయం ద్వారా పూర్తి సమాచారం ఇప్పించండి

» ఏపీ డీజీపీకి చంద్రబాబు లేఖ



అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): 'కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి తమపై నమోదైన కేసుల వివరాలు నామినేషన్ సమయంలో అధికారులకు తెలియజేయాల్సి ఉంది. కావున గత ఐదేళ్లలో నాపై ఉన్న కేసుల వివరాలను మీ కార్యాలయం ద్వారా అందించండి' అని టీడీపీ అధినేత చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన ఏపీ డీజీపీతోపాటు అన్ని జిల్లాల ఎస్పీలకు, ఏసీబీ, సీఐడీ విభాగాలకూ లేఖ రాశారు. 'ఐదేళ్ల కాలంలో నాపై పలు అక్రమ కేసులు బనాయించారు. ఎమ్మెల్యేగా, ప్రతిపక్షనేతగా పనిచేస్తున్న నాపై 2019 నుంచి నమోదైన కేసుల వివరాలు తెలియజేయండి. ఏ క్షణంలో అయినా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున ముందుగా వివరాలు తెలియజేయగలరు. వ్యక్తిగతంగా నేను ప్రతి పోలీసు స్టేషన్ నుంచి సమాచారం పొందడం అన్నది ఆచరణ సాధ్యం కాదు. కాబట్టి డీజీపీ కార్యాలయం ద్వారా సమాచారం ఇవ్వగలరు' అని చంద్రబాబు కోరారు.

# రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే!

» కాంగ్రెస్‌ను బొంద పెడతారు

» ఎన్నికల తర్వాత బీజేపీలోకి వెళ్తారు

» బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సిరిసిల్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో రేవంత్‌రెడ్డి మరో ఏక్‌నాథ్‌షిండేలా, హిమంతబిశ్వశర్మలా మారటం ఖాయమని, ఎన్నికల తర్వాత బీజేపీలో చేరి కాంగ్రెస్‌ను బొంద పెడతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి మహారాష్ట్ర, అస్సాంలో జరిగినట్లే జరుగుతుందన్నారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌తోపాటు ముస్తాబాద్‌లో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడుతూ.. 2014 నుంచి 2021 వరకు ప్రధాని మోదీని తాము ఎంతో గౌరవించామని, రాష్ట్రానికి వచ్చినప్పుడల్లా ఘనంగా స్వాగతించామని.. అయినప్పటికీ ఆయన మొండి చేయి తప్ప ఏమీ ఇవ్వడని తెలుసుకున్నామన్నారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి మోదీని బుట్టలో వేసుకోవడానికి, మస్కా కొట్టడానికి బడాభాయ్, చోటాభాయ్ అని మాట్లాడటం చూస్తే ఆయనేం చేయడు, ఈయనేం చేయడని అర్థమైందని ఎద్దేవా చేశారు. ఆత్మగౌరవం ఉన్న తెలంగాణ బిడ్డ ఎవరైనా తెలంగాణ మాడల్ గురించి చెబుతారు కానీ గుజరాత్ మాడల్‌గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చెబుతారా అని ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తి సీఎం కావడం మన కర్మ అని ప్రజలు భావిస్తున్నారని విమర్శించారు. రెండు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు ఉండగా బడాభాయ్ ఆశీర్వాదం భవిష్యత్‌లో ఉండాలని రేవంత్‌రెడ్డి కోరుకోవడం చూస్తే.. 'రాహుల్‌గాంధీ గెలిచేది లేదు. పీకేది లేదు. ఎన్నికల తర్వాత కూడా నువ్వే ప్రధాని' అని మోదీకి చెప్పినట్లు కాదా? అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉండి, మెడకాయ మీద తలకాయ ఉన్నోడు ఎవరూ ఇలా మాట్లాడరని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ లక్షల కోట్లు తిన్నారని ముఖ్యమంత్రి నుంచి కింద ఉన్న కాంగ్రెస్ సన్నాసుల వరకు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని.. మేడిగడ్డ 85 పిల్లర్లలో ఒక్కటి కుంగిందని, కేసీఆర్ ఉంటే కాపర్ డ్యాం కట్టి మిగతా నీళ్లు అటు పోకుండా చూసేవారని, ఒక పంప్‌తోనైనా నీళ్లు నింపేవారని అన్నారు. ఈ ప్రభుత్వానికి ఆ తెలివి లేదన్నారు. ప్రతిరోజూ 5 వేల క్యూసెక్కుల నీళ్లు కిందకు పోతున్నా చూస్తున్నారన్నారు. కాళేశ్వరం వల్ల మంచి జరిగితే కేసీఆర్‌కు పేరు వస్తుందని, పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి వచ్చి 90 రోజులే అవుతోందని.. కానీ, 30 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారన్నారు. ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉద్యోగాలు ఇచ్చానని చెప్పుకోడం దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేసిన వారికి కూడా తేలుకుట్టిన దొంగ లెక్క అయ్యిందని.. చెప్పుకుంటే ఇజ్జత్ పోతుంది అన్నట్లుగా, ఓటు వేసి మోసపోయామని అనుకుంటున్నారని తెలిపారు. ఎంపీ బండి సంజయ్.. అమిత్‌షా చెప్పులు మోయడం తప్ప ఒక్క పని కూడా చేయలేదని విమర్శించారు. మోదీ కూడా దేశానికి ఏం చేశారో ఎవరికీ తెలియదని, ద్వారకలో మాత్రం నీళ్లలో మునిగి ఏదో చేశాడని ఎద్దేవా చేశారు.

# పార్టీ వీడిన వారిని మళ్లీ తీసుకోం

**అవకాశవాదులు వస్తుంటారు.. పోతుంటారు.. పార్టీ ఎల్లప్పుడూ ప్రజల్లో ఉండాలి**

» అసెంబ్లీ ఎన్నికల్లో ఈ తీర్పును ఊహించలేకపోయాం: కేసీఆర్

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో బీఆర్ఎస్‌ను వీడి.. ఇతర పార్టీల్లో చేరుతున్న వారిని మళ్లీ పార్టీలోకి తీసుకోబోమని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఉద్యమ పార్టీగా మొదలై, రాష్ట్రాన్ని సాధించి.. అధికారం చేపట్టిన బీఆర్ఎస్‌లో పలువురికి రాజకీయ భవిష్యత్తు దక్కిందని, కానీ.. ప్రస్తుత పరిస్థితుల్లో కొందరు పార్టీని వీడటం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నేతలతో తెలంగాణ భవన్‌లో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ భేటీలోనే మహబూబ్‌నగర్ అభ్యర్థిగా సిటింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేరును ప్రకటించారు. నాగర్‌కర్నూల్ అభ్యర్థి ఎవరనేది త్వరలో పార్టీ ముఖ్యులతో చర్చించి వెల్లడిస్తామన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఇలా ఉంటుందని ఊహించలేకపోయామన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఎంతో చేశామని, అయినా అక్కడ ఓటమి చవిచూడాల్సి వచ్చిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వలసలు అధికంగా ఉండే ఆ జిల్లాలో తమ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చిందని, వివిధ రంగాల్లో పురోభివృద్ధి సాధించామని, అక్కడ బీఆర్ఎస్ ఓడాల్సింది కాదని అన్నారు. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను తాము అధికశాతం పూర్తిచేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం కాల్వల నిర్మాణం పూర్తిచేయడం, నీళ్లు ఇవ్వడమే మిగిలి ఉందని చెప్పారు. సందర్భంగా.. కష్టకాలంలో పార్టీ నుంచి వెళ్తున్న వారిని మళ్లీ చేర్చుకోవద్దని కొందరు నేతలు కోరగా..



బీఆర్ఎస్ నేతలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్

వారిని మళ్లీ తీసుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. "నాగర్‌కర్నూల్ ఎంపీ రాములుకు ఏం తక్కువ చేశాం? రాములుతోపాటు ఆయన కుమారుడికీ పార్టీ అవకాశాలు కల్పించింది. ఇలాంటి అవకాశవాదులు వస్తుంటారు.. పోతుంటారు. దానిని మనం పట్టించుకోవాల్సిన అవసరం లేదు. గెలిచినా, ఓడినా.. మనం, మన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల్లో ఉండేలా చూడాలి" అని పార్టీ నేతలతో కేసీఆర్ అన్నారు.

**కాంగ్రెస్ అలవికాని హామీలు ఇచ్చి..**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు అలవికాని హామీలిచ్చి.. వెనకా ముందు చూడకుండా ప్రజల్లో ఆశలు రేకెత్తించారని కేసీఆర్ విమర్శించారు. నిన్నటిదాకా ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు హామీల అమలుపై నాలుక మడతపెట్టి తిట్లకు దిగుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలుసుకోకుండా హామీలిచ్చి.. ఇప్పుడు ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం ప్రభుత్వ అనాలోచిత చర్య అన్నారు. బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారాన్ని నమ్మి ఓటేసిన వారికి ఇప్పుడిప్పుడే వాస్తవాలు తెలుస్తున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమిని పక్కనపెట్టి.. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమిష్టి కృషితో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా బీఎస్పీతో పొత్తు పెట్టుకున్నామని కేసీఆర్ తెలిపారు. ఈ పొత్తు ద్వారా దళిత, బహుజనులను మరింత చేరువ చేసుకోగలమని అభిప్రాయపడ్డారు. ఒకటి, రెండు ఎంపీ స్థానాలను బీఎస్పీకి ఇచ్చినా.. రెండు పార్టీల సమన్వయంతో అభ్యర్థులను గెలిపించుకోవచ్చన్నారు.

### నాగర్‌కర్నూల్ అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్?

బీఆర్ఎస్, బీఎస్పీ మధ్య పొత్తు కుదిరిన నేపథ్యంలో నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం నుంచి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోటీచేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ ఎంపీగా ఉన్న పోతుగంటి రాములు ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి.. తన కుమారుడు భరత్ ప్రసాద్‌తో కలిసి బీజేపీలో చేరడం, వెంటనే ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిగా భరత్‌ను ప్రకటించడం తెలిసిందే. దీంతో అక్కడ బీఆర్ఎస్ తరఫున పోటీ చేయడానికి సరైన అభ్యర్థి లేకుండా పోయారు. తాజాగా బీఆర్ఎస్-బీఎస్పీ పొత్తుతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేరు ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సొంత జిల్లా కావడంతో ఆయన కూడా పోటీ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

## అర్హులందరికీ 'ఉచిత విద్యుత్' ఇవ్వండి

» 60 లక్షల కుటుంబాలు స్కీంకు దూరం

» సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్ లేఖ

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని రేషన్‌కార్డు ఉన్న అన్ని కుటుంబాలకూ వర్తింపజేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు.. సీఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులు ఉండగా.. ప్రభుత్వం 30 లక్షల కుటుంబాలకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేస్తోందన్నారు. దీంతో మిగిలిన 60 లక్షల కుటుంబాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పారు. హైదరాబాద్‌లో 30 లక్షల పేద కుటుంబాలకు గాను 10 లక్షల కుటుంబాలకు ఈ పథకం అమలు చేయాలని నిర్ణయించారని.. దీంతో మిగతా వారికి నష్టం కలుగుతోందని తెలిపారు. పేదలకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమైతే.. 90 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక, 200 యూనిట్ల వరకు వినియోగించిన వారికి అధికారులు జీరో బిల్లు ఇస్తున్నారని, ఒక్క యూనిట్ ఎక్కువ వచ్చినా బిల్లు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఇది సరికాదని, 200 యూనిట్ల వరకు అయ్యే భారాన్ని ప్రభుత్వమే భరించి.. అదనంగా వినియోగించిన యూనిట్ల ధరను ప్రజల నుంచి వసూలు చేయాలని సూచించారు. ఒక రేషన్ కార్డులో పేరు ఉన్న వారు రెండు, మూడు కుటుంబాలుగా విడిపోయి బతుకుతున్నారని, వారందరినీ ఒకే కుటుంబంగా లెక్కించడం సరైన పద్ధతి కాదన్నారు. ఎన్ని కుటుంబాలు ఉంటే అన్ని కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపచేయాలని హరీశ్ రావు కోరారు.

## ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ ధర్నాలు నేడు

తెలంగాణ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్(లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలతోపాటు హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపడతామని పేర్కొంది. ఎటువంటి ఫీజు వసూలు చేయకుండా ఎల్ఆర్ఎస్ అనుమతులు ఇవ్వాలని గురువారం కలెక్టర్లు, ఆర్డీవోలకు వినతిపత్రాలు ఇస్తామని బీఆర్ఎస్ ప్రకటించింది.

## అరూరి రమేశ్ యూటర్న్!

» కేటీఆర్, హరీశ్‌రావుతో ఫలించిన చర్చలు

» పార్టీ మారడం లేదంటూ వీడియో సందేశం

» వరంగల్ ఎంపీ టికెట్‌పై కేసీఆర్ హామీ!



వరంగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ యూటర్న్ తీసుకున్నారు. తాను పార్టీ మారుతున్నానని, బీజేపీలో చేరుతున్నానంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తాను పార్టీ మారడం లేదని, తనపై ప్రత్యర్థి పార్టీలు కుట్రతో దుష్ప్రచారం చేస్తున్నాయని పేర్కొంటూ రమేశ్ ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట స్థానంలో ఓటమిపాలైన అరూరి రమేశ్.. పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేయాలని భావించారు. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసి తనకు ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే కేసీఆర్ నుంచి ఎలాంటి హామీ లభించకపోగా, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తె కడియం కావ్యను ఎంపీ బరిలో దించుతున్నారనే ప్రచారం జరిగింది. దీంతో అసంతృప్తితో ఉన్న అరూరికి బీజేపీ పెద్దల నుంచి ఎంపీగా పోటీ చేయాలనే ఆఫర్ వచ్చినట్లు ప్రచారం జరిగింది. రమేశ్ తన ముఖ్య అనుచరులతో కలిసి ఐదారు రోజులుగా సంప్రదింపులు కూడా జరిపారు. బీజేపీలో చేరేందుకు అరూరి సిద్ధమైన విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఆయనతో సంప్రదింపులు జరిపారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కూడా నేరుగా చర్చలు జరిపినప్పటికీ ఆయన ససేమిరా అన్నారు. అయితే సోమవారం సాయంత్రం హైదరాబాద్‌కు వెళ్లిన అరూరి రమేశ్‌తో కేటీఆర్, హరీశ్‌రావు మరోసారి విడివిడిగా చర్చలు జరపడంతో ఆయన యూటర్న్ తీసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. వరంగల్ ఎంపీ టికెట్‌పై కూడా గులాబీ అధిష్ఠానం నుంచి హామీ లభించినట్లు సమాచారం.

# కారెక్కిన ఏనుగు!

(మొదటిపేజీ తరువాయి)



పొత్తు ప్రకటన తర్వాత మీడియాతో మాట్లాడుతున్న కేసీఆర్, ప్రవీణ్‌కుమార్

రెండు పార్టీల మధ్య సర్దుబాటు, బీఎస్పీ పోటీ చేసేందుకు అవకాశం కల్పించాల్సిన స్థానాలపై మంతనాలు జరిపినట్లు సమాచారం. ఇద్దరు నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో మంగళవారం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఎస్పీ ప్రతినిధుల బృందం నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి చేరుకుని ఆయనతో చర్చించారు. అనంతరం ఇరువురు నేతలు కలిసి పొత్తు విషయాన్ని ప్రకటించారు. కాగా, పొత్తులో భాగంగా ప్రవీణ్‌కుమార్‌కు నాగర్‌కర్నూల్ పార్లమెంటు స్థానాన్ని ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఎన్నికల ప్రచారంలో ఇరు పార్టీల నేతలు కలిసి పాల్గొనాలని, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్, బీఎస్పీ శ్రేణుల మద్దతు తీసుకొని ముందుకు సాగాలనీ నిర్ణయించినట్లు సమాచారం. దీంతోపాటు ఈ పొత్తు లోక్‌సభ ఎన్నికలకే పరిమితం కాకుండా భవిష్యత్తులో కూడా రెండు పార్టీలు కలిసి పనిచేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. చర్చల అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యూహంతో బీఎస్పీతో పొత్తు కుదుర్చుకున్నామని, చాలా అంశాల్లో కలిసి పనిచేస్తామని అన్నారు. సిద్ధాంత పరంగా రెండు పార్టీలు ఒకే రకంగా ఉన్నాయని, తాము అధికారంలో ఉన్నపుడు దళిత, బహుజనుల సంక్షేమం దృష్ట్యా.. దళిత బంధు సహా ఎన్నో కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. పొత్తుపై బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతితో ఇంకా మాట్లాడలేదని, ఆమెతో చర్చలు జరిపి స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రవీణ్‌కుమార్ ఎక్కడి నుంచి పోటీ చేయాలన్నది ఇంకా నిర్ణయించలేదన్నారు. పొత్తుకు సంబంధించి విధి విధానాలు, ఎన్ని సీట్లలో పోటీ చేయాలన్నది త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

**ప్రజల జీవితాలను బాగు చేసేందుకే: ప్రవీణ్‌కుమార్**

తెలంగాణలో బీఆర్ఎస్, బీఎస్పీ స్నేహం ప్రజల జీవితాలను బాగు చేస్తుందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలవడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో లౌకికవాదం ప్రమాదంలో ఉందని, బీజేపీ దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, కాంగ్రెస్ కూడా బీజేపీలాగే ప్రవర్తిస్తోందని ఆరోపించారు. లౌకికవాదాన్ని నిరంతరం కాపాడిన నేత కేసీఆర్ మాత్రమేనని, అందుకే ఆయనతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. పొత్తు విషయాన్ని తమ పార్టీ అధిష్ఠానానికి నివేదిస్తామని, అధినేత్రి మాయావతితో కేసీఆర్ మాట్లాడాక సీట్ల సర్దుబాటుపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి మూడు నెలలు కాకముందే నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గతంలో తీవ్ర విమర్శలు చేసిన బీఆర్ఎస్‌తోనే పొత్తు పెట్టుకోవడంపై అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ, తాను చేసిన వ్యాఖ్యలు అలాగే ఉంటాయన్నారు. బహుజనుల మీద ఎవరు దాడులు చేసినా.. అక్కడ తాను ఉంటానన్నారు. తాను వ్యక్తుల మీద పోరాటం చేయలేదని, ప్రజల హక్కులకు భంగం కలిగినపుడు మాత్రమే పోరాటం చేశానని అన్నారు.

### ఎలా స్పందించాలో తెలియడంలేదు: ఆకునూరి

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాలని బీఎస్పీ తీసుకున్న నిర్ణయంపై ఎలా స్పందించాలో తెలియడం లేదని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గత రెండేళ్లుగా బీఆర్ఎస్ గురించి చెప్పినవన్నీ తప్పులన్నట్లేనా? అప్పుడు దుర్మార్గుడిగా కనిపించిన కేసీఆర్.. ఇప్పుడు హీరో అయ్యారా? అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. "గాడిద మీద ఎక్కినా.. మీరు ఎంపీ అవ్వాల్సిందేనా? రేపు బీఆర్ఎస్ కేంద్రంలో ఎవరికి మద్దతు ఇస్తుందో మీకు తెలియదా? రాజ్యాంగాన్ని ఎవరు రద్దు చేస్తారో మీకు తెలియదా? రాజకీయాల్లో విలువలు ఉండవనే వాదనను మీరు కూడా అనుసరిస్తారా? అన్యాయం పోలీస్ బాస్.. మీ స్టెప్ కరెక్ట్ కాదు. మిమ్మల్ని, మీ రాజకీయాలను చూశాక యువత ఇక ఎవరినీ నమ్మరు. సారీ మిస్టర్ ఆర్ఎస్పీ.. బీఎస్పీ" అని మురళి ట్వీట్ చేశారు. మరోవైపు బీఆర్ఎస్, బీఎస్పీ మధ్య పొత్తుపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. నిన్నటిదాకా విమర్శలు చేసిన పార్టీతోనే పొత్తు పెట్టుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు.

# రేపే కాంగ్రెస్ తొలి జాబితా!

(మొదటి పేజీ తరువాయి)

చెబుతున్నారు. మహబూబ్‌నగర్‌లో ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డే తమ అభ్యర్థి అని సీఎం రేవంత్ ఇప్పటికే ప్రకటించారు. ఇక, మల్కాజ్‌గిరి సీటును సినీ హీరో అల్లు అర్జున్ మామ అయిన చంద్రశేఖర్‌రెడ్డికి, చేవెళ్ల సీటును వికారాబాద్ జెడ్పీ ఛైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డికి కేటాయించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. సికింద్రాబాద్‌లో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నల్లగొండ సీటుకు మాజీ మంత్రి జానారెడ్డి లేదా.. ఆయన తనయుడు రఘువీర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయనున్నట్లు సమాచారం. నిజామాబాద్ సీటును ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. మెదక్‌లో ముదిరాజ్ సామాజిక వర్గ నేత నీలం మధు, జహీరాబాద్‌లో మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ అభ్యర్థిత్వాలు ఖరారైనట్లేనని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పొన్నం ప్రభాకర్ కోసం హుస్నాబాద్ సీటును వదులుకున్న ప్రవీణ్ రెడ్డితోపాటు వెలమ సామాజిక వర్గ నేత రాజేందర్‌రావు పేర్లను కరీంనగర్ సీటు కోసం పరిశీలిస్తున్నారు. హైదరాబాద్ నుంచి పార్టీ నేత మస్కతితోపాటు మరో మహిళ పేరు వినిపిస్తోంది. ఇక, వరంగల్ సీటును మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్న నేపథ్యంలో దొమ్మాట సాంబయ్య పేరు ఖరారయ్యే సూచనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నాగర్‌కర్నూల్ సీటు తనదేనని, సీఎం రేవంత్ సైతం తనకు హామీ ఇచ్చారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి మీడియా ముఖంగానే చెబుతున్నారు. కానీ, ఆ స్థానం నుంచి మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ సైతం పోటీ పడుతున్నారు. పెద్దపల్లి నుంచి ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు వంశీతోపాటు మాదిగ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ సుగుణ కుమారి పేరునూ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక నేత పెర్క శ్యామ్ పేరు సైతం వినిపిస్తోంది. మహబూబాబాద్ సీటుకు బలరాం నాయక్, పార్టీ నేత విజయాబాయి అభ్యర్థిత్వాలు పరిశీలనలో ఉన్నాయి. కాగా, ఆదిలాబాద్ నుంచి బీజేపీ ఎంపీగా ఉన్న సోయం బాపూరావుకు ఆ పార్టీ తొలి జాబితాలో సీటు దక్కని సంగతి తెలిసిందే. పూర్వాశ్రమంలో కాంగ్రెస్, టీడీపీల్లో పని చేసిన ఆయనను పార్టీలోకి తీసుకుని టికెట్ ఇచ్చే ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఖమ్మం లేదా భువనగిరి నుంచి పోటీ చేయాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని సీఎం రేవంత్‌రెడ్డి కోరిన నేపథ్యంలో ఆ రెండు సీట్లకు అభ్యర్థుల ఎంపికను పెండింగ్‌లో పెట్టినట్లు చెబుతున్నారు. మరోవైపు.. ఖమ్మం సీటు కోసం ఉపముఖ్యమంత్రి భట్టి సతీమణి నందిని, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తనయుడు యుగంధర్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి రేసులో ఉన్నారు. అలాగే భువనగిరి సీటును టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆశిస్తుండగా, తన భార్య అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరుతున్నారు. అలాగే, అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్‌ను త్యాగం చేసిన పటేల్ రమేష్‌రెడ్డితోపాటు బీసీ కోటా కింద చనగాని దయాకర్‌గౌడ్ తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

# తెలంగాణ ప్రభుత్వంపై సర్జికల్ స్ట్రైక్స్

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య అవినీతి బంధం బలంగా ఉందని, ఈ విషయం తెలంగాణలోని ప్రజలతోపాటు ప్రపంచానికి కూడా తెలుసునని వ్యాఖ్యానించారు. "తెలంగాణను దోచుకోవడంలో ఇద్దరూ కలిసే ఉన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ కోట్లాది రూపాయలను దోచుకుంది. మరి, కాంగ్రెస్ ఏం చేస్తోంది!? బీఆర్ఎస్ అవినీతిపై విచారణ ఎందుకు చేయట్లేదు!? ఫైళ్లు తవ్వి.. వాస్తవాలన్నీ దాస్తోంది. కాళేశ్వరం అవినీతిలో కాంగ్రెస్ పాత్ర ఉండటం వల్లే చర్యలు తీసుకోవడం లే దు. బండారం బయటపడుతుందనే వాస్తవాలు వెల్లడించడం లేదు" అని విమర్శించారు. రెండు రోజులుగా తెలంగాణలో పర్యటిస్తున్నానని, ఇక్కడి ప్రజల ఉత్సాహం చూస్తుంటే తనలో ఆత్మ విశ్వాసం పెరుగుతోందని ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. "మీ ప్రేమను తెలంగాణ అభివృద్ధిలో రెండింతలు చేసి మీకు చూపిస్తాను. మీ ప్రేమ, ఉత్సాహం వృథా కానివ్వను. ఇది మోదీ గ్యారంటీ. మోదీ గ్యారంటీ అంటే కచ్చితంగా పూర్తయ్యే గ్యారంటీ. జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేస్తామని చెప్పామా..? లేదా..? ఆ హామీని అమలు చేసి, చూపించామా లేదా..? అయోధ్య రామ మందిరంలో శ్రీరామచంద్రుడిని స్వాగతం పలుకుతామని చెప్పాం. గౌరవంతో స్వాగతం పలికాం. మోదీ గ్యారంటీ పూర్తయిందా?లేదా? ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ మారింది. ప్రపంచానికే వెలుగు రేఖగా మారి కొత్త అంచులకు చేరింది. ఈరోజు మీకు ఒక గ్యారంటీ ఇస్తున్నా. రాసి పెట్టుకోండి. కొన్నేళ్లలో భారత్ మూడో ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా మారనుంది. ఈ హామీని కూడా అమలు చేసి చూపిస్తాం" అని ప్రకటించారు. 'అబ్‌కీ బార్ 400 పార్ (ఈదఫా పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు దాటేస్తాం) అని తెలంగాణలోని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని చెప్పారు.



సభా ప్రాంగణంలో ప్రధాని మోదీపై పూల వర్షం కురిపిస్తున్న అభిమానులు

### కుటుంబం కాదు.. నాకు దేశమే ఫస్ట్

జమ్మూ కశ్మీర్ నుంచి తమిళనాడు దాకా వారసత్వ పార్టీలు అధికారంలో ఉన్నచోట ఆ కుటుంబాలు బాగుపడ్డాయని, కానీ, రాష్ట్రాలు నాశనమయ్యాయని ప్రధాని మోదీ మండిపడ్డారు. "వారసత్వ పార్టీలకు దోచుకునే లైసెన్స్ ఏమైనా ఉందా? మీ కుటుంబం అధికారంలో ఉంటే దోచుకునే స్వేచ్ఛ ఉంటుందా? నేను ఒక ముఖ్యమంత్రిని చూశా. ఆయన కుటుంబం నుంచి 50 మంది దాకా రాజకీయాల్లో, వివిధ పదవుల్లో ఉన్నారు. ఇదేనా ప్రజాస్వామ్యం!?" అని నిలదీశారు. వారసత్వ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి, ప్రతిభకు, యువకులకు వ్యతిరేకమని, కొత్త ప్రతిభను వెలుగులోకి రానీయవని, యువత అవసరాలు తీర్చవని దుయ్యబట్టారు. తనకు కుటుంబం లేదని అంటున్నారని, కానీ, దేశంలోని ప్రతి తల్లి, చెల్లి, ప్రతి యువకుడూ.. మొత్తం 140 కోట్ల మంది ప్రజలూ తన కుటుంబ సభ్యులేనని మోదీ పునరుద్ఘాటించారు. దేశంలోని కోట్లాది మంది ప్రజలు తనను కుటుంబ సభ్యుడిగా చూస్తున్నారని, తెలంగాణ ప్రజలు కూడా తనను కుటుంబ సభ్యుడిగా భావిస్తున్నారని చెప్పారు. వేల కోట్ల రూపాయల కుంభకోణాలను వెలికి తీస్తున్నానని, వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నానని, ఆయా పార్టీలకు కంట్లో నలుసుగా మారానని, అందుకే తనను, తన కుటుంబాన్ని తిడుతున్నారని మండిపడ్డారు. "మోదీతో తమది సైద్ధాంతిక పోరాటమని వారసత్వ రాజకీయాలు చేసేవాళ్లు అంటున్నారు. దోచుకునే అధికారం మాకే కావాలనుకోవడం సైద్ధాంతిక పోరాటమా..? మీకు ఫ్యామిలీ ఫస్ట్. నాకు దేశమే ముఖ్యం (ఫస్ట్). మీకు, మాకు మధ్య ఇదే సైద్ధాంతిక పోరాటం" అంటూ దుయ్యబట్టారు. దేశం కోసం తాను తన జీవితాన్ని ఇచ్చానని, వాళ్లు తమ కుటుంబం కోసం దేశ హితాన్నే బలి చేశారని మండిపడ్డారు. వారసత్వ పార్టీలు దేశాన్ని దోచుకొని తమ ఖజానాను నింపుకున్నాయని ఆరోపించారు. అధికారంలో 75, 80, 85 ఏళ్ల పైబడిన వాళ్లే ఉండాలని వాళ్లు కోరుకుంటారని, 50 ఏళ్లలోపు వాళ్లు రాజకీయాల్లోకి వస్తే తమను ఓవర్ టేక్ చేస్తారని భయపడతారని, అందుకే యువతను రాజకీయాల్లోకి రాకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. దేశ రాజకీయాల్లో తాను నిజాయతీపరులనే ముందుకు తెస్తున్నానని చెప్పారు.

### నాకు ఒక్క ఇల్లు కూడా లేదు

నల్లధనాన్ని విదేశాల్లో దాచుకోవడానికి వారంతా ఆయా దేశాల్లో ఖాతాలు తెరిస్తే.. తాను కోట్లాది మంది పేదలకు జన్‌ధన్ ఖాతాలు తెరిపించానని, వాళ్లకు తనకు ఇదే తేడా అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. "వారసత్వ రాజకీయ నాయకులు బంగ్లాలు, అద్దాల మేడలు కట్టుకుంటే.. నేను నా కోసం ఒక్క ఇంటిని కూడా కట్టుకోలేదు. కానీ, దేశంలోని పేదలకు 4 కోట్ల ఇళ్లు కట్టించాను. వాళ్లు దేశాన్ని నాశనం చేసే ఏ అవకాశాన్నీ వదులుకోలేదు. ఖజానాను ఖాళీ చేశారు. భూములు అమ్మారు. కానీ, నేను దేశాన్ని, మీ భవిష్యత్‌ను నిర్మించడానికి భూవి, ఆకాశం, పాతాళాన్ని ఏకం చేస్తున్నాను" అని మోదీ వ్యాఖ్యానించారు. తెలంగాణలో మౌలిక సదుపాయాల కల్పనకు వేల కోట్లను వెచ్చిస్తున్నామని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, యువత కలలను సాకారం చేయడం మోదీ బాధ్యత అని హామీ ఇచ్చారు. కాగా తెలంగాణ పర్యటన ముగించుకొని ఢిల్లీ వెళుతున్న ప్రధాని మోదీకి బేగంపేట విమానాశ్రమంలో గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్ తదితరులు వీడ్కోలు పలికారు.

### వర్గీకరణకు సంపూర్ణ మద్దతు

మాదిగల వర్గీకరణకు సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నామని ప్రధాని పునరుద్ఘాటించారు. ఇందుకు ఉన్నత స్థాయి కమిటీని వేశామని, మాదిగలను కలిసి, సమస్యలను గుర్తించామని తెలిపారు. తెలంగాణను అభివృద్ధి చేసే విషయంలో ఏ అవకాశాన్నీ వదిలిపెట్టనని ప్రకటించారు.

### బహుమతులన్నీ ప్రజాహితం కోసమే

బహుమతుల రూపంలో తనకు వచ్చే శాలువాలు, విగ్రహాల నుంచి వచ్చే ఆదాయాన్ని పేదలకే పంచుతున్నానని ప్రధాని మోదీ వెల్లడించారు. "వారసత్వ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు విలువైన బహుమతులు తీసుకొని నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకున్నారు. కానీ, నాకు వచ్చే గిఫ్టులన్నిటినీ ఖజానాలో జమ చేస్తున్నా. వాటిని గంగా మాత సేవకు ఖర్చు చేస్తున్నా. గుజరాత్‌లో అధికారంలో ఉన్నప్పుడు నాకు వచ్చిన బహుమతుల ఆదాయాన్ని పేద అమ్మాయిల చదువు కోసం ఖర్చు పెట్టేవాణ్ని. బహుమతుల రూపంలో అందుకున్న రూ.150 కోట్లను ప్రజల సేవకే వెచ్చించాను. నేనూ వారసత్వ రాజకీయాల నుంచి వచ్చిన వాడినైతే ఇవన్నీ ఇంటికి తీసుకెళ్లేవాడిని" అని మోదీ వ్యాఖ్యానించారు.



### అభివృద్ధి పనులకు శ్రీకారం

- 1,165 కోట్లతో ఘట్‌కేసర్- లింగంపల్లి ఎంఎంటీఎస్ రైలు ప్రారంభం, సనత్ నగర్ - మౌలాలీ రైల్వే లైన్ డబ్లింగ్, విద్యుదీకరణ, 6 కొత్త స్టేషన్ భవనాలు ప్రారంభం
- సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి మదీనగూడ వరకు 31 కిలోమీటర్ల జాతీయ రహదారిని రూ.1,298 కోట్లతో ఆరు లైన్లుగా విస్తరించే పనులకు శంకుస్థాపన
- రూ.399 కోట్లతో మెదక్ - ఎల్లారెడ్డి జాతీయ రహదారి విస్తరణ, ఎల్లారెడ్డి నుంచి రుద్రూర్ వరకు రూ.500 కోట్లతో చేపట్టే రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన
- హైదరాబాద్ జంట నగరాలకు వంట గ్యాస్‌ను పైపులైన్ ద్వారా సరఫరా చేసేందుకు పరదీప్ చమురు క్షేత్రం నుంచి నిర్మించిన గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు.
- రూ.400 కోట్లతో నిర్మించిన సంగారెడ్డి జిల్లా కంది రామసానిపల్లె నాలుగు లైన్ల జాతీయ రహదారి ప్రారంభం
- రూ.323 కోట్లతో విస్తరించిన మిర్యాలగూడ - కోదాడ జాతీయ రహదారి ప్రారంభం
- హైదరాబాద్ బేగంపేటలో రూ.400 కోట్లతో ఏర్పాటుచేసిన సివిల్ ఏవియేషన్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ పరిశోధన సంస్థ ప్రారంభం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహాకాళి దేవాలయంలో అమ్మవారిని ప్రధాని మోదీ దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం 10.10 గంటలకు ఆలయానికి వచ్చిన ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మోదీ పేరిట ఆలయ ప్రధానార్చకులు రామతీర్థ శర్మ శ్రీచక్రానికి కుంకుమార్చన చేశారు. అనంతరం, 'భారతీయులందరికీ మంచి ఆరోగ్యం, శ్రేయస్సు, సౌభాగ్యం సిద్ధించాలని మహాకాళి దేవస్థానంలో ప్రార్థించాను' అని ఎక్స్ వేదికగా మోదీ పేర్కొన్నారు.



బేగంపేట విమానాశ్రయంలో ప్రధాని మోదీకి జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్

# విన్నపాలు వినండి..!

## 'తుమ్మిడిహెట్టి' నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించండి

'ఇంటింటికీ నల్లా నీరు'కు సహకరించండి

సెమీ కండక్టర్ల పరిశ్రమకు తోడ్పడండి: ప్రధాని మోదీకి సీఎం రేవంత్ విజ్ఞప్తులు

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమస్యలను పరిష్కరించడంలో సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని కోరారు. కేంద్ర ప్రభుత్వం సహకారం కోరుతూ పలు విజ్ఞప్తులు చేశారు. లిఖితపూర్వకంగా వినతి పత్రాలూ అందజేశారు. ప్రధానంగా తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించబోతున్నామని, దీనిపై మహారాష్ట్రతో ఏర్పడే వివాదం విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. ఇంటింటికీ నల్లా నీటిని అందించేందుకు కేంద్ర సహకారం అవసరమని తెలిపారు. ఇలా పలు డిమాండ్లను ప్రధానికి వివరించారు.

### ఇవీ విన్నపాలు..

- ఎన్టీపీసీలో 4000 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉంటే.. గత ప్రభుత్వం 1600 మెగావాట్లను మాత్రమే సాధించింది. మిగిలిన 2400 మెగావాట్ల ఉత్పత్తికి కేంద్రం సహకరించాలి.
- హైదరాబాద్ మెట్రో విస్తరణకు, మూసీ రివర్‌ప్రాజెక్టుకు సహకరించాలి.
- తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల నిర్మాణానికి భూసేకరణ, నీటి వాటాల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలి.
- హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై అమ్రాబాద్ ఫారెస్ట్ ఏరియా మీదుగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సహకరించాలి. 2022-23లోనే కేంద్రం దీని డీపీఆర్ తయారీకి రూ.3 కోట్లు మంజూరు చేసింది. రూ.7,700 కోట్లు ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును మంజూరు చేయాలి.
- రాష్ట్రంలో నూటికి నూరు శాతం ఇంటింటికీ నల్లా నీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందించాలి. దాదాపు 10 లక్షల కుటుంబాలకు ఇప్పటికీ నల్లా నీరు అందడం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జల జీవన్ మిషన్ నిధులివ్వాలి.
- తెలంగాణలో పెరిగిన జిల్లాలు, పోలీసు కమిషనరేట్ల సంఖ్యకు అనుగుణంగా ఐపీఎస్ కేడర్ రివ్యూ చేయాలి. కేంద్ర హోంశాఖ 2016లో రాష్ట్రానికి 76 ఐపీఎస్ పోస్టులను మంజూరు చేసింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ, పెరిగిన జనాభాను బట్టి పోలీసు అధికారుల అవసరం పెరిగింది. అత్యవసరంగా 29 ఐపీఎస్ పోస్టులను అదనంగా కేటాయించాల్సి ఉంది. వీలైనంత త్వరగా పోస్టులను మంజూరు చేయాలి.
- హైదరాబాద్-రామగుండం, హైదరాబాద్-నాగ్‌పూర్ రహదారులపై రక్షణ శాఖ భూముల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. వీటితో పాటు కారిడార్ల నిర్మాణానికి కంటోన్మెంట్ ఏరియాలో 178 ఎకరాలు, 10 టీఎంసీల కేశవాపురం రిజర్వాయర్ నిర్మాణానికి పొన్నాల గ్రామ సమీపంలోని 1350 ఎకరాల మిలిటరీ డెయిరీ ఫామ్ ల్యాండ్స్‌ను రాష్ట్రానికి బదిలీ చేయాలి. లీజు గడువు ముగిసిన శామీర్‌పేటలోని ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ (1038 ఎకరాల) భూములను తిరిగి అప్పగించాలి.
- ఐఐటీ, నల్సార్, సెంట్రల్ యూనివర్సిటీతో పాటు ప్రఖ్యాత పరిశోధన, ఉన్నత విద్యా సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి. అత్యున్నత విద్యా సంస్థలను అందరికీ అందుబాటులో ఉంచడానికి ప్రతి రాష్ట్రంలో ఒక ఐఐఎంను నెలకొల్పాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా హైదరాబాద్‌లోనూ ఒకటి నెలకొల్పాలి. అందుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తాం.
- జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాన్ని రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్నాం. 5259 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2023--24కు సంబంధించి కేంద్ర వాటాగా రావాల్సిన ఆయుష్మాన్ నిధులు రూ.347.54 కోట్లను వెంటనే విడుదల చేయాలి.

భారత్‌మాల పథకంలో భాగంగా తెలంగాణలోని కల్వకుర్తి-కొల్లాపూర్, గౌరెల్లి-వలిగొండ, తొర్రూర్-నెహ్రూనగర్, నెహ్రూనగర్-కొత్తగూడెం, జగిత్యాల-కరీంగర్ 4లేన్, జడ్చర్ల-మరికల్ 4లేన్, మరికల్-డియాసాగర్ పనుల టెండర్ల ప్రక్రియకు అనుమతులు మంజూరు చేయాలి.

తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సహకారాన్ని కోరుతున్నాం. సెమీ కండక్టర్లు, డిస్ప్లే మ్యానుఫ్యాక్చరింగ్ రంగంలో కొత్త శకానికి నాంది పలికేందుకు భాగంగా సాయం అందించాలి.

---

## జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసులో దొంగలు పడ్డారు

- రంగారెడ్డి కార్యాలయంలోకి నలుగురు దుండగులు
- గుర్తుపట్టకుండా ఉండేందుకు సీసీ కెమెరాల ధ్వంసం
- భూముల తాలూకు రికార్డులు ఎత్తుకెళ్లినట్లు అనుమానాలు
- ఘటనపై ప్రభుత్వం సీరియస్.. రంగంలోకి పోలీసులు
- అనుమానితుల గుర్తింపు..

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సమయం తెల్లవారుజామున సుమారు 3:50 గంటలు! నలుగురు ముసుగు దొంగలు మూడంతస్తుల భవనంలోకి చొరబడ్డారు. లోపల, ప్రవేశ మార్గాల్లో సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. కొన్ని కెమెరాల దిశ మార్చారు. భవనం లోపలికి వెళ్లేందుకు ఉన్న గ్రిల్స్ తొలగించారు. తలుపులు పగులగొట్టి లోనికి చొరబడ్డారు. అయిదు వాల్యూమ్స్ రికార్డులు ఎత్తుకెళ్లారు. ఇదంతా.. భూముల రికార్డులు భద్రంగా ఉండాల్సిన రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగింది. కోకాపేట, శేర్‌లింగంపల్లి, మాదాపూర్, శంకరపల్లి ప్రాంతాల్లోని ఖరీదైన భూములకు సంబంధించిన 1969, 1973, 1974 సంవత్సరాలకు చెందిన కీలక రికార్డులను అపహరించారు. ఇటీవల జరిగిన ఈ వ్యవహారం సంచలనమైంది. విషయం తెలిసిన వెంటనే అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ తరహా నేరాలు జరగడంపై పోలీసు శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. విలువైన భూములకు సంబంధించిన రికార్డులను దొంగలించే ముఠాలు జిల్లాల్లోనూ ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కరీంనగర్, భువనగిరి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ రికార్డుల చోరీ జరిగింది. ఖరీదైన భూములకు సంబంధించిన దస్త్రాలను కార్యాలయాల్లో చొరబడి దొంగలించడం ఇప్పుడు రిజిస్ట్రేషన్ శాఖలో సంచలనమైంది. ప్రభుత్వం కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గానే తీసుకుంది. ఈ తరహా నేరాలకు పాల్పడే వ్యక్తులు ఎవరై ఉంటారనే దానిపై పోలీసు శాఖ ద్వారా లోతైన విచారణ చేపట్టింది. ఇందులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నారా? లేక మరేదైనా అవసరాల కోసం దొంగతనాలు చేస్తున్నారా? లేక ఇందులో ఇతర కోణం ఏదైనా ఉందా అనే దిశగా పోలీసులు విచారణ చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చోరీకి పాల్పడిన వారికి సంబంధించిన ఆనవాళ్లను గుర్తించేందుకు పోలీసులు వేలిముద్రలను సేకరించారు. కార్యాలయంలోని సీసీ కెమెరాల్లో ఆధారాలు లభించకపోయినా ఆ కెమెరాలను పట్టుకున్న వారి ఫింగర్‌ప్రింట్స్ తీసి ఇప్పటికే ముగ్గురిని గుర్తించినట్లు తెలిసింది. అలాగే రికార్డుల చోరీకి పాల్పడిన వారిని కార్యాలయం ఎదురుగా ఉండే భవనాల్లో, రహదారిలో ఉండే కెమెరాల ఆధారంగా వారి చిత్రాలను పోలీసులు సేకరిస్తున్నారు.


### డిజిటల్ రికార్డులు సేఫ్

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఫిజికల్ రికార్డులను దొంగలించినప్పటికీ అన్ని రికార్డులకు సంబంధించిన డిజిటల్ రికార్డులు భద్రంగానే ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఆందోళన పడాల్సిన అవసరం లేదని.. రంగారెడ్డి జిల్లా పరిధిలో అన్ని డాక్యుమెంట్లను డిజిటలైజ్ చేసి ఉంచామని అన్నారు. ఇండెక్స్ రికార్డు, వేలిముద్రలకు సంబంధించిన రికార్డులు భద్రంగానే ఉన్నాయి. అయినా ఆ దొంగలు ఏయే డాక్యుమెంట్లు చోరీ చేశారు? వారు తీసుకెళ్లిన రికార్డుల అవసరం ఏమిటి? దీని వెనుక ఎవరున్నారు? అధికారుల ప్రమేయం ఏమైనా ఉందా? లేక బయటి వ్యక్తుల పనా? అనే కోణంలో కూడా రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు.

# పాపాలపుట్ట పగిలింది

(మొదటిపేజీ తరువాయి)

అన్నిరకాల క్రయవిక్రయాలూ నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. వట్టినాగులపల్లిలో దాదాపు రూ.2 వేల కోట్ల విలువైన 29.27 ఎకరాల భూదాన్ భూములను.. అధికారబలంతో అప్పటి ప్రభుత్వంలోని పెద్దలు చెరబట్టడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన 'ధరణి బూచితో భూమి స్వాహా', 'భూదాన భూముల్లో కాలనాగులు' కథనాలు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కథనాలపై వెంటనే స్పందించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక.. సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈమేరకు గండిపేట తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం ఆ భూములను పరిశీలించి సర్వే నిర్వహించింది. డ్రోన్ సర్వే ద్వారా నిర్మాణాలు, భూముల సరిహద్దులు గుర్తించడమే కాక.. నిషేధిత జాబితాలో ఉన్న ఈ భూదాన్ భూములకు సంబంధించి ఎవరెవరు ఎప్పుడెప్పుడు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారనే విషయాలపై విచారణ జరిపి కలెక్టర్‌కు సమగ్ర నివేదికను అందజేసింది. అందులో.. 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చిన అనేక మంది ప్రముఖుల పేర్లు ఉండడం గమనార్హం. బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ సోదరుడు, ప్రతిమ కన్‌స్ట్రక్షన్ అధినేత బోయినపల్లి శ్రీనివాసరావుతో పాటు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సినీ హీరో మేక శ్రీకాంత్, బీజేపీ నాయకురాలు చందుపట్ల కీర్తిరెడ్డి పేర్లు ఇందులో ఉన్నాయి. అలాగే మరికొందరు బడావ్యక్తులు కూడా ఇక్కడ బినామీల పేరుతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కుంభకోణంలో గ్రేటర్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పేర్లు కూడా వినిపిస్తున్నాయి. కానీ వారెక్కడా తెరపైన కనిపించకుండా కొందరికి అనుకూలంగా వ్యవహారం నడిపినట్లు తెలుస్తోంది. అయితే ఈ జాబితాలో ఉన్నవారిలో ఒకరిద్దరు వ్యక్తులు పాతికేళ్ల క్రితం తెలిసో తెలియకో ఈ భూములు కొన్నట్లు సమాచారం.



### భూదాన్ భూముల్లో పాగా వేసింది వీరే

| సర్వే నం. | విస్తీర్ణం (ఎకరాల్లో) | ఖాతా నంబరు | పట్టాదారు పేరు |
|---|---|---|---|
| 186/ఎ | 0-30 | 2099 | కె. నరేందర్ |
| 186/ఎఎ | 1-00 | 20001001 | భూదాన భూమి |
| 186/ఇ | 1-00 | 20001001 | భూదాన భూమి |
| 186/ఇఇ | 3-00 | 20001001 | భూదాన భూమి |
| 186/యూ | 2-03 | 2103 | తుకారం కోకోబా |
| 186/యూయూ1/1 | 2-09 | 569 | మేక శ్రీకాంత్ |
| 187 | 4-18 | 60981 | సులక్షణ డెవెలపర్స్ ప్రై.లి |
| 188/1/1/1/1 | 0-2293 | 60572 | శీతల్ సక్సేనా |
| 188/1/1/1/2 | 0-1503 | 60483 | ఎం. పృథ్వీరాజ్ |
| 188/1/1/1/1/2 | 0-1750 | 60483 | ఎం. పృథ్వీరాజ్ |
| 188/1/1/1/1/1/2 | 0-2004 | 60995 | కుందూరి హేమలత |
| 188/1/1/1/1/2 | 0-1750 | 60459 | ఎం. వెంకటరాజు |
| 188/1/1/1/2 | 0-1250 | 60456 | చందుపట్ల వాణి |
| 188/1/1/2 | 0-1250 | 60455 | చందుపట్ల కీర్తిరెడ్డి |
| 188/1/2 | 1-10 | 60435 | పల్లా రాజేశ్వర్‌రెడ్డి |
| 188/2 | 4-08 | 2083 | ఎన్ వాసు |
| 189/ఎఎ/2 | 0-20 | 60689 | బోయినపల్లి శ్రీనివాసరావు |
| 189/ఇఇ1 | 1-00 | 60689 | బోయినపల్లి శ్రీనివాసరావు |
| 189/ఇఇ2/2 | 3-35 | 60689 | బోయినపల్లి శ్రీనివాసరావు |
| 189/యూ/2 | 0-20 | 60689 | బోయినపల్లి శ్రీనివాసరావు |
| 189/యూయూ/2 | 0-20 | 60689 | బోయినపల్లి శ్రీనివాసరావు |
| 189/ఆర్‌యూ/2 | 0-20 | 60689 | బోయినపల్లి శ్రీనివాసరావు |

### పల్లా ఇపుడు ఏం చెబుతారు?

ఈ భూముల వ్యవహారంలో తనపై వస్తున్న ఆరోపణలు నిజం కాదని పేర్కొంటూ.. 'ఆంధ్రజ్యోతి' కథనాలను ఖండిస్తూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవల ఓ ప్రకటన విడుదల చేశారు. తాను సర్వే నంబర్ 188/1/1/2లో కొనుగోలు చేసిన 1.10 ఎకరాలు కూడా భూదాన్ భూమి కాదని ఆయన తెలిపారు. కానీ, ఇపుడు భూదాన్ భూములు రిజిస్ట్రేషన్ చేసుకుని దొడ్డిదారిన పాస్‌బుక్‌లు పొందిన వారి జాబితాలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరు కూడా ఉన్న నేపథ్యంలో ఆయన ఏమంటారో చూడాల్సి ఉంది. అలాగే ఆయన 2014లో భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకుంటే 2021 వరకూ ఎందుకు పహాణీల్లో నమోదు కాలేదు? ధరణి వచ్చాకే 2021లో పాస్‌బుక్ ఎలా వచ్చిందనే విషయాలకు సమాధానం లేదు. 2021 జూన్ 6న అప్పటి కలెక్టర్ ఈ 29.27 ఎకరాల భూదాన భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టినా కూడా ఆగస్టు 24న పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సర్వేనంబరు 188/1/2 పేరుతో పట్టాదార్ పాస్‌బుక్ జారీ కావడం విశేషం. ఇదిలా ఉంటే ఈ సర్వేనంబర్లు సబ్‌డివిజన్ కాలేదని, ఎంజాయిమెంట్ సర్వే జరగలేదని అధికారులు చెబుతున్నారు. కానీ అన్ని నిబంధనలు తుంగలో తొక్కి హైకోర్టు ఆదేశాలను పక్కన పెట్టి 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న ఈ భూములను అధికార అండతో పెద్దలంతా స్వాహా చేశారు. ఈ నేపథ్యంలో.. ఈ భూముల క్రయవిక్రయాలను నిలిపివేస్తే సరిపోదని.. ధరణిలో లొసుగులను అడ్డుపెట్టుకుని బడాబాబులు దొడ్డిదారిన తీసుకున్న కొత్త పట్టాదార్ పాస్‌బుక్‌లను రద్దుచేస్తేనే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



## రాష్ట్రంలో రాహుల్ ట్యాక్స్ వసూళ్లు

- రియల్ వ్యాపారులు, పారిశ్రామికవేత్తలే లక్ష్యం
- అవినీతికి తెరలేపిన కాంగ్రెస్ సర్కారు: కిషన్‌రెడ్డి

పటాన్‌చెరు, మార్చి 5: వచ్చే ఎన్నికల ఖర్చు కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు పెద్ద ఎత్తున రాహుల్ ట్యాక్స్ వసూళ్లకు పాల్పడుతోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు, పారిశ్రామికవేత్తలే లక్ష్యంగా వసూళ్లు జరుగుతున్నాయని అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ప్రధాని మోదీ పాల్గొన్న విజయ సంకల్ప సభలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అవినీతిలో బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోటీ పడుతోందని విమర్శించారు. కుటుంబ పార్టీలు వారసుల కోసం పని చేస్తే.. బీజేపీ, ప్రధాని మోదీ.. దేశం కోసం కృషి చేస్తారని తెలిపారు. తెలంగాణలో 17 సీట్లు గెలిచి మోదీకి కానుకగా ఇస్తామని కిషన్‌రెడ్డి అన్నారు.

## సీఎం రేవంత్ పరిపక్వతతో వ్యవహరించారు

- బీజేపీ నేత మురళీధర్ రావు

న్యూఢిల్లీ, మార్చి 5(ఫిబ్రవరి): తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీని సీఎం రేవంత్ రెడ్డి పెద్దన్న(బిగ్ బ్రదర్) అని పిలిచి తన పరిపక్వతను ప్రదర్శించారని బీజేపీ జాతీయ నేత మురళీధర్ రావు అన్నారు. మంగళవారం ఢిల్లీలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, మాజీ సీఎం కేసీఆర్‌ల కన్నా తాను భిన్నమైన వ్యక్తినని, స్వయం ప్రతిపత్తిని అనుసరించగల సమర్థుడని రేవంత్ నిరూపించుకున్నారు' అని మురళీధర్ తెలిపారు. రేవంత్ వ్యాఖ్యలతో తొలుత ఆశ్చర్య పోయానని, ఆయన పరిపక్వతను అభినందిస్తున్నానని అన్నారు. రేవంత్ పరిపక్వత తెలంగాణ ప్రజల అభివృద్ధికి దోహదపడుతుందని, వివిధ కోణాల్లో చాలా విస్తృతమైన ప్రభావాన్ని చూపుతుందని మురళీధర్ అభిప్రాయపడ్డారు.


ఉద్యోగం ఇవ్వాలని ప్రజావాణిలో డీఎస్సీ-2008 బాధితుల ఆందోళన

## ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి

- ప్రజావాణిలో డీఎస్సీ -2008 బాధితుల ఆందోళన
- మంగళవారం ప్రజావాణికి 2,095 దరఖాస్తులు

బేగంపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన మూడు నెలల లోపే 30వేల ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ కన్నీళ్లు కూడా తుడవాలని డీఎస్సీ- 2008 బాధితులు కోరారు. సుమారు 300 మంది డీఎస్సీ -2008 బాధితులు తమకు న్యాయం చేయాలంటూ ప్రజావాణిలో ఆందోళన నిర్వహించారు. మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో 2,095 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి 458, రేషన్‌కార్డుల కోసం 134, ఇందిరమ్మ ఇళ్ల కోసం 552, మైనారిటీ సంక్షేమశాఖకు సంబంధించి 333 దరఖాస్తులతో పాటు ధరణీ ఇతర సమస్యలపై పలు అర్జీలు వచ్చాయని వారు చెప్పారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్, ఇతర అధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీటెక్, బీఈడీ చదివి ఇటీవల గురుకుల నియామక పరీక్షలో ఎంపికైన 97 మందికి నియామక ఉత్తర్వులు నిలిపివేశారని అభ్యర్థులు ప్రజావాణిలో డా. చిన్నారెడ్డిని కలిసి విన్నవించుకున్నారు. డీఎస్సీ -2008 అభ్యర్థులు తమకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. గతంలో రేవంత్‌రెడ్డి తమకు ఉద్యోగాలు కల్పిస్తామని హామి ఇచ్చారని గుర్తు చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసే వరకు కదిలేది లేదని వారు ప్రజావాణిలో ఆందోళన చేపట్టడంతో వారితో డా. చిన్నారెడ్డి ప్రత్యేకంగా చర్చించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నారెడ్డిని తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.

## గొర్రెలు, చేపల పంపిణీపై సమగ్ర విచారణ

- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బాధ్యతలు
- ప్రాథమిక నివేదికలోని అంశాలు ఏసీబీకి
- ఏప్రిల్ నుంచి పాడి రైతులకు ప్రోత్సాహకాలు: రేవంత్

హైదరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, చేపల పంపిణీ పథకాలపై విచారణ జరుపుతామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ పథకాలకు సంబంధించి జరిగిన లావాదేవీలపై సమగ్ర విచారణ బాధ్యతలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అప్పగించారు. లబ్ధిదారుల ఎంపిక, గొర్రెల పంపిణీ తీరుపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని చెప్పారు. ప్రాథమిక నివేదికలో తేలిన అంశాలను వెంటనే ఏసీబీకి అందజేయాలని స్పష్టం చేశారు. మంగళవారం పశుసంవర్థక శాఖ అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే తమ వాటా కింద 25 శాతం డీడీలు కట్టిన లబ్ధిదారులకు ఎందుకు గొర్రెలను పంపిణీ చేయలేదని ప్రశ్నిస్తూ ఈ పథకం అమలు తీరుపై రకరకాల అనుమానాలున్నాయని పేర్కొన్నారు. ఏప్రిల్ నుంచి పాడి రైతులకు క్రమం తప్పకుండా ప్రోత్సాహకాలు చెల్లిస్తామని ఈ సందర్భంగా రేవంత్ వెల్లడించారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ నియామకాలకు వెయిటేజీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

## యూట్యూబ్, గూగుల్‌కు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఒకరికి పరువునష్టం కలిగించేలా ఉన్న సమాచారం(కంటెంట్)ను వెంటనే తొలగించాలని ఆదేశిస్తూ యూట్యూబ్, గూగుల్‌కు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రజత్ కుమార్ ఇటీవల దాఖలు చేసిన ఓ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం ఈ మధ్యంతర ఆదేశాలు ఇచ్చింది. తన కుమార్తె వివాహం అంశంలో తమ పరువుకు నష్టం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో ఉన్న సమాచారాన్ని తొలగించే విధంగా యూట్యూబ్, గూగుల్‌ను ఆదేశించాలని కోరుతూ రజత్ కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. తన కుమార్తె వివాహం జరిపించడంలో అక్రమాలు, అవినీతి జరిగాయంటూ 'ది న్యూస్ మినిట్ - టీఎన్ఎం' వెబ్ మ్యాగజైన్ తమ పరువునష్టం కలిగించే కంటెంట్‌ను సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తుందని పేర్కొన్నారు. ఆ కంటెంట్‌ను వినియోగదారులు వీక్షించేందుకు అవకాశం కల్పిస్తున్న యూట్యూబ్, గూగుల్‌పై ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్- డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ రూల్స్ - 2021 ప్రకారం చర్యలు తీసుకునేలా కేంద్ర ఐటీశాఖ మార్గదర్శకాల అమలుకు ఏర్పాటు చేసిన ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కమిటీ ఛైర్మన్‌ను ఆదేశించాలని కోరారు. వాదనలు నమోదు చేసుకున్న జస్టిస్ సూరేపల్లి నంద ధర్మాసనం.. కేంద్ర ప్రభుత్వం, ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కమిటీ ఛైర్మన్, యూట్యూబ్, గూగుల్‌కు నోటీసులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం మినహా ఇతర ప్రతివాదులకు పిటిషనర్ వ్యక్తిగతంగా నోటీసులు పంపేందుకు అనుమతించింది.

## హడ్కో రుణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ పథకంలో ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన రుణం పొందేందుకు ప్రభుత్వం అనుమతించింది. పట్టణాల్లో 57,141, గ్రామీణ ప్రాంతాల్లో 38,094 కలిపి మొత్తం 95,235 ఇళ్ల నిర్మాణానికి రూ. 3 వేల కోట్ల రుణం అవసరం కానుంది. ఈ రుణాన్ని హడ్కో నుంచి పొందేందుకు అనుమతించాలని ఇటీవలే గృహనిర్మాణ శాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు అనుమతిస్తూ రవాణా, రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కేఎస్.శ్రీనివాసరాజు ఉత్తర్వులు జారీ చేశారు.

## కోర్టు తీర్పు మేరకే మహిళలకు హారిజాంటల్ రిజర్వేషన్లు: సర్కారు

సుప్రీంకోర్టు, హైకోర్టుల తీర్పు మేరకే నియామకాల్లో మహిళలకు హారిజాంటల్ రిజర్వేషన్లు అమలుచేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వం జారీ చేసిన జీవో3 వల్ల ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్ శాతం తగ్గిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇటీవల మీడియా ద్వారా చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా జారీ చేసిన ఈ రిజాయిండర్‌లో.. హారిజాంటల్ రిజర్వేషన్ల వల్ల ఎటువంటి వ్యత్యాసం ఉండదని, మహిళలకు, పురుషులకు సమాన రిజర్వేషన్లు దక్కుతాయని ప్రభుత్వం వెల్లడించింది.

## జేటీసీ పాండురంగ నాయక్ స్వచ్ఛంద పదవీ విరమణ

రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(జేటీసీ) పాండురంగ నాయక్ స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. కొంత కాలం క్రితం ఆయన ప్రభుత్వానికి స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం అనుమతించింది. మార్చి 4 నుంచి వీఆర్ఎస్ అమల్లోకి వస్తుందని పేర్కొంది. రవాణా శాఖలో అడ్మిన్ జేటీసీగా పాండురంగ నాయక్ విధులు నిర్వహిస్తున్నారు. వీఆర్ఎస్ తీసుకోవడంతో ఆయన స్థానంలో మమతా ప్రసాద్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. కాగా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్ టిక్కెట్ కోసం పాండురంగ నాయక్ ప్రయత్నిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డితోపాటు పలువురు మంత్రుల్ని కలిసి అవకాశం ఇవ్వాలని కోరారు. 2014, 2018 ఎన్నికల్లోనూ టిక్కెట్ కోసం ప్రయత్నించినా... దక్కలేదు.

## ఎస్‌బీఐ చర్య సుప్రీం ధిక్కరణే: నారాయణ

సుప్రీం కోర్టు ఆదేశాల్ని ఎస్‌బీఐ ధిక్కరిస్తోందని, మార్చి 15వ తేదీలోపు ఎలక్టోరల్ బాండ్స్ వివరాలు ఇవ్వాలని ఆదేశిస్తే.. జూన్ వరకు గడువు ఇవ్వాలని ఇప్పుడు కోరడం ఏంటని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ప్రశ్నించారు. సాంకేతికత అభివృద్ధి చెందిన నేపథ్యంలో ఏ రోజుకు ఆ రోజు ఒక్క బటన్ నొక్కితే మొత్తం వివరాలు బయటపడతాయన్నారు. జూన్ వరకు టైం కావాలని అడగడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఎస్‌బీఐ ఉద్దేశపూర్వకంగానే దొంగ రాజకీయ నాయకులను, దొంగల డబ్బును కాపాడటానికే ఇలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కోర్టు ధిక్కరణ కింద పరిగణించి ఎస్‌బీఐపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# బీజేపీ, బీఆర్ఎస్ కలిసే పోటీ

(మొదటి పేజీ తరువాయి)

ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "మా ప్రభుత్వాన్ని 5 నెలల్లో దింపుతామని మాట్లాడుతున్నారంటే మోదీతో కలవాల్సిందే కదా! అంటే, మోదీతో కేసీఆర్ కలిసిన ట్రీగా!?" అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం రిపోర్టును నాలుగు నెలల్లో ఇస్తామని కమిటీ చెబుతోందని, అంటే, పార్లమెంటు ఎన్నికల్లో ఇద్దరూ కలిసి పోటీ చేసిన తర్వాత వచ్చే ఫలితాలను బట్టి రిపోర్టు వస్తుందని స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయన్న మోదీ వ్యాఖ్యలపైనా సీఎం రేవంత్ స్పందించారు. కాళేశ్వరం విషయంలో ఇప్పటికే అధికారులను సస్పెండ్ చేశామని, సిటింగ్ జడ్జితో విచారణ చేయాలని కోరితే.. కోర్టు రిటైర్డ్ జడ్జిని ఇస్తామని చెప్పిందని తెలిపారు. బాధ్యులపై క్రమంగా చర్యలుంటాయని, ఒకేసారి నిర్ణయం తీసుకోవడానికి తాను కేసీఆర్‌లా 80 వేల పుస్తకాలు చదవలేదని, మోదీలా విశ్వ గురువుని కాదని ఎద్దేవా చేశారు. రాష్ట్రాభివృద్ధి, పలు ప్రాజెక్టుల అంశాలకు సంబంధించి ప్రధాన మంత్రికి కేసీఆర్‌లా చెవిలో చెప్పలేదని, బహిరంగంగానే చెప్పానని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని అనాథల నుంచి ప్రజా ప్రతినిధుల వరకూ ఎవరైనా కలవవచ్చని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. సీఎంను ఎమ్మెల్యేలు కలిస్తే తప్పేంటని ప్రశ్నించారు. ఒక సీఎంను ప్రజా ప్రతినిధులు స్వేచ్ఛగా కలిసే పరిస్థితి పదేళ్లలో లేకుండాపోయిందని తప్పుబట్టారు. కేసీఆర్ తన విద్యార్హతల విషయంలోనూ పార్లమెంటుకు తప్పుడు పత్రాలను సమర్పించారని తెలిపారు. బీకాంలో ఫిజిక్స్ చదివిన జలీల్‌ఖాన్ గురించే అందరికీ తెలుసని, కానీ, ఎమ్మెస్సీలో పొలిటికల్ సైన్స్ చదివిన వ్యక్తిని తాను ఎక్కడా, ఎప్పుడూ చూడలేదంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కేసీఆర్ నోరు తెరిస్తే అబద్ధాలే చెబుతాడని విమర్శించారు. తన ఇల్లే తనకు క్యాంప్ ఆఫీస్ అని చెప్పారు. 7, 8 తేదీల్లో కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా విడుదలయ్యే అవకాశం ఉందని, అభ్యర్థులను కేంద్ర పార్టీ నిర్ణయిస్తుందని వెల్లడించారు. తమ అన్నదమ్ముల్లో ఎవరూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, తాను కూడా ప్రోత్సహించడం లేదని స్పష్టం చేశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం కేసీఆర్‌ను కలవడంపై స్పందించిన సీఎం.. రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే కొన్ని మబ్బులు తొలగిపోతున్నాయని అన్నారు.

### త్వరలో చట్టపరంగా చర్యలు తప్పవు

ఇప్పటికే రాష్ట్ర ప్రజలు వారికి రాజకీయంగా శిక్ష వేసి ఇంట్లో కూర్చోబెట్టారని, త్వరలో చట్టపరంగా కూడా చర్యలు ఉంటాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్ఆర్ఎస్‌పై అన్ని నియోజక వర్గాల్లో నిరసనలకు పిలుపునిచ్చిన కేటీఆర్ సిరిసిల్ల జంక్షన్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద దీక్ష చేయాలని, అలా చేస్తే తిన్నదన్నా అరుగుతుందని ఎద్దేవా చేశారు. ఇంత కాలం గాదె కింద పందికొక్కుల్లా తిన్నారని విమర్శించారు. వీలైతే కేటీఆర్ మంచినీళ్లు కూడా తాగకుండా దీక్ష చేస్తే ఆయనిచ్చిన నిరసన పిలుపునకు చిత్తశుద్ధి ఉన్నట్టన్నారు. "అసెంబ్లీలో ప్రతిపక్ష నేతే లేరు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆ సీట్లో పద్మారావు కూర్చున్నారు. అసెంబ్లీకి రాకుండానే మాకు పాలనపై పట్టు రాలేదని మాట్లాడితే ఎలా!?" అని రేవంత్ ప్రశ్నించారు.

### ఊర్లు కొట్టుకుపోతే బాధ్యత ఎవరిది!?

కాళేశ్వరం, మేడిగడ్డపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్ ఇష్టారీతిగా మాట్లాడుతున్నారని, కుంగింది రెండు పిల్లర్లేనని అంటున్నారని, కానీ ప్రాజెక్టు మొత్తంలో మేడిగడ్డే ముఖ్యమైనదని రేవంత్ స్పష్టంచేశారు. అన్నారం బ్యారేజీకి నీళ్లను ఎత్తిపోయాలని హరీశ్ అంటున్నారని, అక్కడ కూడా లీకేజీ అవుతుంటే నీటిని నింపడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వాళ్ల దొంగతనం కప్పిపుచ్చుకునేందుకే ఎత్తిపోయమంటున్నారని తప్పుబట్టారు. "ఇప్పుడు అన్నారంలో నీళ్లు నింపమంటున్నారు. తర్వాత ఊర్లకు ఊర్లు కొట్టుకుపోతే ఎవరిని అడగాలి. రిపేర్లను తమకు ఇస్తే చేసి చూపిస్తామని అంటున్నారు. వాళ్లు నిర్మిస్తేనే కదా ఇలా కుంగిపోయింది. ఈ విషయంపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ కమిటీ ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసే వరకూ దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేం. పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాతే చర్యలు తీసుకుంటాం. ఎవరిపైనా కక్ష పూరితంగా వ్యవహరించబోం. బహిరంగంగా కాల్చి చంపిన కసబ్‌ను కూడా విచారించారు. కాళేశ్వరంపైనా కేసీఆర్‌కు అవకాశం ఇవ్వాలి. ఆ తర్వాత విచారించాలి. అలా చేయకపోతే సమాజం మమ్మల్ని ప్రశ్నిస్తుంది" అని వ్యాఖ్యానించారు. లోపం నిర్మాణంలో ఉందా, నిర్వహణలోనా అన్న విషయాన్ని ఇంజనీరింగ్ నిపుణులే తేల్చాలన్నారు. చాలా మంది అధికారులు అవినీతిలో భాగస్వాములని, వారిపైనా చర్యలు ఉంటాయని చెప్పారు. సాగర్, శ్రీశైలం నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ఎలాంటి ఇబ్బంది రాలేదన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. 'రాష్ట్రంలోనూ కాళేశ్వరం కట్టారు, కూలింది' అన్నట్లుగా పరిస్థితి తయారైందన్నారు. తుమ్మిడిహెట్టితో కాళేశ్వరానికి ఎలాంటి సంబంధం లేదని, దాని ద్వారా ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 1.60 లక్షల ఎకరాలకు నీరు అందించవచ్చని స్పష్టం చేశారు. మహారాష్ట్రలోనూ బీజేపీ ప్రభుత్వమే ఉందని, అందుకే ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని మోదీని కోరానని తెలిపారు. కేంద్రం, మహారాష్ట్ర అంగీకరిస్తే గంటలో పనులు మొదలుపెడతామన్నారు.

### పెద్దన్న అంటే తప్పేముంది!?

ప్రధానిని పెద్దన్న అంటే తప్పేముందని, దేశానికి ఆయనే పెద్ద కదా అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. దేశ ప్రధాని అధికారిక కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రానికి వచ్చినప్పుడు రాష్ట్రాభివృద్ధి గురించి అడగకుండా చేతులు ఊపుకుంటూ వెళ్లి.. 'మీ ప్రేమలో మునిగి.. అమరులమవుతామ'ని చెబుతామా అని కేసీఆర్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై సర్జికల్ స్ట్రైక్స్ చేస్తామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించడంపై మాట్లాడుతూ.. 'అవినీతి ఉంటే పట్టుకోవాల్సిందే.. అది మంచిదేగా' అని వ్యాఖ్యానించారు. బీజేపీపై రేవంత్ ఎలాంటి విమర్శలు చేయడం లేదనే ప్రచారం జరుగుతోందని విలేకరులు ప్రశ్నించగా.. రాష్ట్రంలో లేని బీజేపీని ఏం తిట్టాలంటూ సీఎం ఎద్దేవా చేశారు. రాష్ట్ర బీజేపీ నాయకులు మోదీకి సగం సగం వివరాలే చెప్పి ఉంటారని, అందుకే కాళేశ్వరంపై అలా మాట్లాడి ఉంటారని అభిప్రాయపడ్డారు.

### ట్యాక్స్ పేయర్స్‌కు రైతు భరోసా ఉండదు

రైతు భరోసా విషయంలోనూ చాలా స్పష్టమైన యోచనతో ఉన్నామని, ట్యాక్స్ పేయర్స్, సంపన్నులకు అందించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఫామ్ హౌస్‌లకు ఇచ్చేది లేదని, గజ్వేల్, జన్వాడలో ఫామ్ హౌస్‌లో ఉంటున్న వారికి కూడా ఇవ్వబోమని కేసీఆర్, కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. వాస్తవంగా సాగు చేసే రైతులు, కూలీలకు మాత్రమే పెట్టుబడి సాయం అందుతుందన్నారు.

### అదానీకి ఆస్తులు రాసివ్వం

దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా కాంగ్రెస్ ఆస్తులను సృష్టించిందని, అంతే తప్పితే ఎవరికీ కట్టబెట్టలేదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. దావోస్‌లో అదానీ కంపెనీలతో ఒప్పందం చేసుకోవడంపై విమర్శలు వచ్చాయని విలేకర్లు ప్రశ్నించగా.. 'ఔను.. అదానీకి ఎలాంటి ఆస్తులను ఇచ్చేది లేదు. వాళ్లు రాష్ట్రంలో పెట్టుబడులు పెడతారు" అని స్పష్టతనిచ్చారు. సోనియా గాంధీ కుటుంబం నుంచి ఎవరో ఒకరు ఇక్కడ పోటీ చేస్తే రాష్ట్రంలో రాజకీయంగా మార్పులుంటాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో గతమనేది లేదని, ఇక నుంచి భవిష్యత్తే ఉంటుందని స్పష్టం చేశారు.



## సీఎం రేవంత్‌ని కలిసిన చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే

చేవెళ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎంను కలిసి శాలువాతో సత్కరించారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి మంజూరైన సీడీపీ నిధులు, ఇతర పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరినట్టు ఎమ్మెల్యే చెప్పారు. ఈ భేటీలో ఎలాంటి రాజకీయ కోణం లేదని ఈ సందర్భంగా యాదయ్య స్పష్టం చేశారు.

## మా 3 నెలల పాలన చూసి ఓటేయమని అడుగుతాం

డిసెంబర్ 7 నుంచి పార్లమెంటు ఎన్నికల నాటికి తాము చేసిన పాలనను చూసే ఓట్లు వేయాలని ప్రజలను కోరతామని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 14 స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు సీట్లు ఎన్ని వస్తాయని విలేకరులు అడగ్గా.. అది గాల్లో దీపమంటూ సమాధానమిచ్చారు. జీవో నంబర్ 3తో ఉద్యోగ నియామకాల్లో మహిళలకు అన్యాయం జరుగుతోందని అంటున్నారని ప్రశ్నించగా.. హారిజాంటల్, వర్టికల్ విషయంలో హైకోర్టు ఆదేశాల ప్రకారమే ముందుకు వెళ్తున్నామని స్పష్టతనిచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో కంటే ఇసుక విషయంలో రోజుకు రూ.2.50 కోట్ల మేర ఆదాయం పెరిగిందని, జీఎస్టీలోనూ ఫిబ్రవరిలో రూ.300 కోట్ల అదనపు ఆదాయం వచ్చిందని, వచ్చే నెలలో రూ.500 కోట్లు రాబోతోందని చెప్పారు. జీఎస్టీలో పెద్ద ఎత్తున దోపిడీ జరిగిందని, అందరి జాబితా బయటపెడతామని చెప్పారు. అణాపైసా పన్నులు వేయకుండానే తాము అదనపు ఆదాయాన్ని సాధించామని తెలిపారు. నీటిపారుదల శాఖ, గొర్రెల కొనుగోళ్లపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని, అవినీతిపరులపై చర్యలుంటాయని స్పష్టం చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్‌లో జరిగిన అవకతవకలపైనా విచారణ చేస్తామని, డీఎస్పీ ప్రణీత్‌రావుపైనా విచారణ జరుగుతోందని తెలిపారు. 2008 డీఎస్సీ అభ్యర్థుల అంశంపై పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

### ఎప్పుడైనా సీఎం చాంబర్ దాకా వచ్చారా?

సచివాలయంలోని సమావేశ మందిరంలో విలేకరులతో చిట్‌చాట్‌గా మాట్లాడిన రేవంత్.. గడిచిన పదేళ్లలో ఎప్పుడైనా సీఎం చాంబర్ వరకూ వచ్చారా!? కనీసం కాన్ఫరెన్స్ హాల్ గేటు వరకైనా వచ్చారా!? అంటూ ఛలోక్తులు విసిరారు.

# నేడే ఎన్‌డీఎస్‌ఏ కమిటీ రాక

- 6, 9 తేదీల్లో హైదరాబాద్‌లో అధికారులతో సమావేశం
- 7, 8న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిశీలన
- ప్రాధాన్య ప్రాజెక్టులను చేపట్టండి.. మంత్రి ఉత్తమ్ ఆదేశాలు



హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించడానికి జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ బుధవారం తెలంగాణకు రానుంది. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ, మరమ్మతులు చేపట్టడానికి వీలుగా వాటి నిర్మాణం, లోపాలపై అధ్యయనం చేయాలని కోరుతూ ఫిబ్రవరి 13 తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి ఎన్‌డీఎస్‌ఏకి లేఖ రాయగా.. ఈ నెల 2న కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఆరుగురితో ప్రభుత్వం కమిటీ వేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ హైదరాబాద్‌కు చేరుకున్నాక బుధవారం మధ్యాహ్నం జలసౌధలో నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇతర అధికారులతో సమావేశం కానుంది. 7, 8 తేదీల్లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించనుంది. మళ్లీ 9వ తేదీన హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ అధికారులతో పాటు ఆయా బ్యారేజీల నిర్మాణంలో పాలుపంచుకున్న అధికారులు, నిర్మాణ సంస్థలతో సమావేశం కానుంది. ఆరోజు సాయంత్రం ఢిల్లీకి వెళ్లనుంది. ఈ నేపథ్యంలో.. బ్యారేజీల ప్లానింగ్, డిజైన్లు, నిర్మాణం, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) అధికారులు తమ వెంట ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరింది. అలాగే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి.. దిగువ/ఎగువ భాగాల ఫొటోలు, అన్ని గేట్ల పరిస్థితి, స్టాప్‌లాగ్ గేట్లు, సర్వీస్ గేట్ల పరిస్థితి సహా 19 రకాల ప్రాథమిక సమాచారం అందించాలని కోరింది. కాగా.. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించే ప్రాధాన్య ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జలసౌధలో నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, నీటిపారుదల శాఖ సంయుక్త కార్యదర్శి భీంప్రసాద్‌లతో పాటు ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ, నెట్టెంపాడు, బీమా, నారాయణపేట-కొడంగల్, చిన్న కాళేశ్వరం, చనాకా కొరాటా, మొడికుంటవాగు, దేవాదుల, ఇందిరమ్మ ఫ్లడ్ ఫ్లో కెనాల్, పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలను పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

## ఇసుక జారడం వల్లే బ్యారేజీ కుంగింది

- మేడిగడ్డ ఏడో బ్లాక్‌పై ఈఆర్‌టీ నివేదిక ఇచ్చిన ఎల్ అండ్ టీ

హైదరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పిల్లర్ల పునాదుల్లో(రాఫ్ట్ సీకెంట్ పైల్) ఉన్న ఇసుకంతా జారి పోవడం వల్లే మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిందని ఈఆర్‌టీ(ఎలక్ట్రో రెసెస్టివిటీ టెస్ట్) పరీక్షలో తేలింది. ఎక్కువ రోజులు భారీగా నీటిని నిల్వ చేయడం వల్ల బ్యారేజీపై ఒత్తిడి పెరిగి అది పునాదుల మధ్య ఇసుక జారేలా చేసిందని ఆ పరీక్షలో గుర్తించారు. బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ జనవరి 4-9 తేదీల్లో మేడిగడ్డలో ఈఆర్‌టీ చేపట్టింది. ఇందుకు సంబంధించిన నివేదికను తాజాగా నీటి పారుదల శాఖకు అందించింది. ఏడో బ్లాకు కింది నుంచి ఇసుక జారడమే బ్యారేజీ కుంగుబాటుకు కారణమని అందులో పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాకులోని 19, 20, 21 పిల్లర్లు గతేడాది అక్టోబరు 21న కుంగిపోయాయి. బ్యారేజీ సామర్థ్యం 16.17 టీఎంసీలు కాగా ఆ సమయంలో 10.33 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఈ నిల్వల వల్లే బ్యారేజీపై ఒత్తిడి పెరిగి ప్రమాదం జరిగి ఉంటుందని గుర్తించారు. నిజానికి, 2019 జూన్‌లో మేడిగడ్డ బ్యారేజీని ప్రారంభించారు. ఆ ఏడాది నవంబరులో వచ్చిన వరదల అనంతరం గేట్లను దించారు. ఈ క్రమంలో కాంక్రీట్ బ్లాకులు చెల్లాచెదురు కావడంతోపాటు డౌన్‌స్ట్రీమ్, అప్‌స్ట్రీమ్ అప్రాన్లు దెబ్బతిన్నాయి. దీంతో వరద తీవ్రతను తట్టుకునే విధంగా బ్యారేజీ డిజైన్ లేదని అప్పట్లోనే అధికారులు గుర్తించారు. అప్పట్లోనే మరమ్మతులు లేదా పునరుద్ధరణకు ఉపక్రమించి ఉంటే ప్రస్తుత పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదని పేర్కొన్నారు.

# చేతులు మారిన 'టానిక్'

- ఓడిపోగానే షాపును అమ్మేసుకున్న బీఆర్ఎస్ నేతలు
- అంతకుముందు నుంచే ఎలైట్ వైన్‌షాప్ అక్రమ మార్గం
- రెండో రోజు కూడా 'టానిక్'లో జీఎస్టీ అధికారుల తనిఖీలు

హైదరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న 'టానిక్' ఎలైట్ వైన్ షాపులో జీఎస్టీ అధికారులు చేపట్టిన సోదాల్లో కొత్త విషయాలు బయటపడుతున్నాయి. టానిక్ షాపు మొదటి యజమానులైన బీఆర్ఎస్ నేతలు.. రాష్ట్రంలో ఆ పార్టీ ఓడిపోగానే షాపును అమ్మేసుకున్నట్లు తేలింది. ప్రస్తుతం షాపు.. కొత్త యాజమాన్యం చేతుల్లో ఉందని తెలుసుకుని జీఎస్టీ అధికారులు విస్తుపోయారు. 2016లో బీఆర్ఎస్ ప్రభుత్వం 'ఏ-4 ఎలైట్ వైన్ షాపు' కింద టానిక్‌కు లైసెన్స్ జారీ చేసింది. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా, దేశంలోని ఏ రాష్ట్రం నుంచైనా రకరకాల మద్యం బ్రాండ్లను తెచ్చుకుని టానిక్‌లో విక్రయించుకునేలా అనుమతులు ఇచ్చారు. 2017లో ఇది అమ్మకాలను మొదలు పెట్టింది. తదనంతరం అక్రమ మార్గం పట్టింది. మొన్నటి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉండటంతో అక్రమాలు బయటపడలేదు. బీఆర్ఎస్‌కు చెందిన ఒక రాజ్యసభ సభ్యుడు, ఒక ఎమ్మెల్సీ దీని యజమానులు కావడంతో అటు రాష్ట్ర జీఎస్టీ అధికారులుగానీ, ఇటు ఎక్సైజ్ అధికారులుగానీ ఎలాంటి తనిఖీలు చేపట్టలేదు. రెండు నెలల క్రితం ప్రభుత్వం మారడంతో అప్రమత్తమైన ఆ నాయకులు షాపులోని తమ వాటాలను అమ్మేసుకున్నారు. ఇప్పుడు ఆ షాపును కొత్త యాజమాన్యం నడుపుతోంది. ఈ విషయం తెలియక జీఎస్టీ అధికారులు సోమవారం సోదాలు ప్రారంభించారు. నిజానికి బీఆర్ఎస్ నేతలే టార్గెట్‌గా ఈ సోదాలు ప్రారంభమైనట్లు చర్చ జరిగింది. ఇప్పుడు వారే యజమానులుగా లేరని తేలింది. కాగా, మంగళవారం కూడా జీఎస్టీ అధికారులు సోదాలు నిర్వహించారు. టానిక్‌తో పాటు దానికి అనుబంధంగా ఉన్న 'క్యూ బై టానిక్' మద్యం షాపుల్లోనూ తనిఖీలు నిర్వహించారు. జీఎస్టీ, వ్యాట్ ఎగవేత కోణాల్లో వివరాలు సేకరిస్తున్నారు. మద్యం బదిలీ, పన్ను చెల్లించని మద్యం అంశాలను కూడా పరిశీలిస్తున్నారు. ఈ షాపు ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు మద్యాన్ని సరఫరా చేస్తున్నట్లు వస్తున్న వార్తల కోణంలోనూ వివరాలు సేకరిస్తున్నారు. అక్కడ లభించని కొన్ని బ్రాండ్లను టానిక్ ద్వారా ఎగుమతి చేస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

## జర్నలిస్టులెప్పుడూ ప్రతిపక్షమే

- జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే తెలుగువారిని ప్రోత్సహిస్తాం: సీఎం రేవంత్ రెడ్డి
- జర్నలిస్టు వెంకట నారాయణకు 'పొత్తూరి' స్మారక పురస్కారం ప్రదానం

హైదరాబాద్ సిటీ, మార్చి5(ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టులు ఎప్పుడూ ప్రతిపక్షమేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయ నాయకులు మోర్ పవర్ అంటే పాత్రికేయులు మోర్ ఫ్రీడమ్ అంటారని తెలిపారు. ప్రముఖ పాత్రికేయుడు పొత్తూరి వెంకటేశ్వరరావు స్మారక కమిటీ ఆధ్వర్యంలో రవీంద్ర భారతీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి.. ప్రముఖ జర్నలిస్టు వెంకట నారాయణకు ఉత్తమ పాత్రికేయ పురస్కారం అందజేశారు. శాలువా, జ్ఞాపికతోపాటు రూ.లక్ష నగదు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పాత్రికేయులు లేవనెత్తిన అంశాలను వీలైనంత వరకు పరిష్కరించాలనే ఆలోచనతో తమ ప్రభుత్వం ఉందన్నారు. రాజకీయ, న్యాయ, సామాజిక రంగాలలో జాతీయ స్థాయిలో తెలుగువారి పాత్ర అధికమవ్వాలని ఆకాంక్షించారు. ఏపీ, తెలంగాణ నుంచి జాతీయ రాజకీయాలను ప్రభావితం చేయగలిగే వారిని తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ప్రకటించారు. జాతీయ, అంతర్జాతీయ జర్నలిజంలో వెంకట నారాయణ అందిస్తోన్న సేవలను కొనియాడారు. ఇక, పొత్తూరి స్మారక పురస్కారం అందుకోవడం అత్యంత గౌరవంగా భావిస్తున్నానని పురస్కార గ్రహీత వెంకట నారాయణ పేర్కొన్నారు. కాగా, 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ వంటి విలువలు కలిగిన వారు ఇంకా పాత్రికేయ రంగంలో ఉండడం వల్లే.. సమాజానికి నాలుగో స్తంభమైన మీడియా కూలిపోకుండా ఉందని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు కె. రామచంద్రమూర్తి, పాశం యాదగిరి, రచయిత వోలేటి పార్వతీశం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సీఎం పీఆర్వోగా సీనియర్ జర్నలిస్టు శ్రీనివాసరావు నియామకం



హైదరాబాద్, మార్చి 5: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజాసంబంధాల అధికారి (పీఆర్వో)గా సీనియర్ జర్నలిస్టు వి. శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఊట్లపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ గత 20 ఏళ్లుగా జర్నలిస్టు వృత్తిలో ఉన్నారు. ఈటీవీ, మహాన్యూస్, బిగ్‌టీవీతో పాటు పలు సోషల్ మీడియా సంస్థల్లో ఆయన రిపోర్టర్‌గా, ప్రజంటర్‌గా విధులు నిర్వహించారు.

## మల్కాపూర్-విజయవాడ రహదారిని 6 లేన్లుగా మార్చండి

- ప్రధాని మోదీకి రోడ్లుభవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ - విజయవాడ జాతీయరహదారిని విస్తరించాలని, మల్కాపూర్ నుంచి 44 కి.మీ వరకు రహదారిని 6 లేన్లుగా మార్చాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రధాని మోదీని కోరారు. రాష్ట్రంలో 1767 కి.మీ. మేర కలిగిన 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా ఉన్నతీకరించాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రధానిని ఆయన సంగారెడ్డిలో కలిసి వినతి పత్రం అందించారు. హైదరాబాద్-శ్రీశైలం 765 కి.మీ.లలో 62 కి.మీ రహదారిని జాతీయరహదారిగా మార్చేందుకు సంబంధితశాఖకు డీపీఆర్ పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రీజినల్‌రింగ్‌రోడ్డులోని ఉత్తర భాగంలో 'సంగారెడ్డి-తూప్రాన్-చౌటుప్పల్' మార్గాన్ని జాతీయ రహదారి 161ఏఏగా గుర్తించడంతో పాటు, వికసిత్ భారత్-2047 పథకం కింద గుర్తించాలని, కాజీపేటలో రైల్ కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని పీఎంను కోరారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
# దిక్సూచి
హైదరాబాద్ ● బుధవారం 6 మార్చి 2024
diksuchi@andhrajyothy.com

## ఐఐఐటీఎంలో ఎంబీఏ

గ్వాలియర్‌లోని అటల్ బిహారీ వాజపేయి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఐఐఐటీఎం)- 'మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులోనే రీసెర్చ్ బేస్డ్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది.

**విభాగాలు:** మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, ఐటీ అండ్ సిస్టమ్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్

**అర్హత:** ప్రథమ శ్రేణి మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

**ఎంపిక:** అకడమిక్ మెరిట్, క్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు.

సందర్భానుసారం రైటింగ్ కాంప్రహెన్షన్ కూడా ఉండవచ్చు. సంస్థ నిర్ణయం మేరకు అర్హులైన వారికి అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** మార్చి 30
- **అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ:** ఏప్రిల్ 4, 5
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 8న
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఏప్రిల్ 12
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఏబీవీ-ఐఐఐటీఎం గ్వాలియర్ (ఎంపీ)-474015
- **వెబ్‌సైట్:** iiitm.ac.in

# సమ్మర్ ఇంటర్న్‌షిప్



## ఐఐటీ తిరుపతి

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. ఇది మే 15 నుంచి ప్రారంభమౌతుంది. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు.

**విభాగాలు**
- కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

**అర్హత**
గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఈ/బీటెక్/బీఎస్సీ/ఎమ్మెస్సీ/బీఏ/ఎంఏ ప్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

**స్టయిపెండ్**
ప్రతి విభాగంలో మొదటి అయిదు స్థానాల్లో ఉన్న వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.5,000 స్టయిపెండ్ ఇస్తారు.

**ముఖ్య సమాచారం**
- దరఖాస్తు ఫీజు లేదు
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31
- సమ్మర్ ఇంటర్న్‌షిప్ 2024: మే 15 నుంచి జూలై 14 వరకు
- ఈ-మెయిల్: research@iittp.ac.in
- వెబ్‌సైట్: www.iittp.ac.in

## విశాఖ ఐఐపీఈ

**విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ)- సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ 2024లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఎనిమిది వారాలు. ఈ ప్రోగ్రామ్ మే 6 నుంచి ప్రారంభమౌతుంది. ఇందులో భాగంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమెటిక్స్ విభాగాల్లో రీసెర్చ్ వర్క్‌కు సంబంధించి అవగాహన కల్పిస్తారు. లైబ్రరీ, స్పోర్ట్స్, కంప్యూటర్ సెంటర్, ఇంటర్నెట్ తదితర సౌకర్యాలు కల్పిస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తారు.**

'ఫండింగ్ ఫ్రం ఎస్ఐపీ' కింద వర్క్ చేసినవారికి, సంస్థలో ప్రాజెక్ట్ వర్క్ చేసినవారికి ఇంటర్న్‌షిప్ పూర్తయ్యాక నిబంధనల ప్రకారం రూ.10,000ల స్టయిపెండ్ ఇస్తారు.

**విభాగాలు**
- బయోసైన్సెస్/బయోటెక్నాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎర్త్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్

**అర్హత**
ప్రస్తుతం బీఈ/బీటెక్ ఆరో సెమిస్టర్, ఎంఎస్/ఎమ్మెస్సీ/ఎంటెక్ రెండో సెమిస్టర్, ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ ఎనిమిదో సెమిస్టర్, ఎమ్మెస్సీ డ్యూయెల్ డిగ్రీ ఎనిమిదో సెమిస్టర్ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాక్‌లాగ్స్ ఉన్న అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. పదోతరగతి, ఇంటర్ స్థాయుల్లో కనీసం 65 శాతం మార్కులు ఉండాలి. ఐఐటీలు, ఐసర్‌లు, నైసర్, ఐఐఈఎస్‌టీ, ఐఐఎస్సీ, సీఎఫ్‌టీఐ, నిట్ సంస్థల అభ్యర్థులకు డిగ్రీ స్థాయిలో కనీసం 7.5 సీజీపీఏ ఉండాలి. ఇతర కళాశాలల్లో చదివే అభ్యర్థులకు కనీసం 8.5 సీజీపీఏ ఉండాలి.



**ఎంపిక**
అకడమిక్ మెరిట్, రీసెర్చ్ అనుభవం, అవార్డ్‌లు, ప్రపోజ్‌డ్ వర్క్, రికమండేషన్ లెటర్స్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**ముఖ్య సమాచారం**
- దరఖాస్తు ఫీజు: రూ.500
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 25
- ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల: ఏప్రిల్ 8న
- వెబ్‌సైట్: www.iipe.ac.in

# భోపాల్ 'స్పా'లో పీజీ

**భోపాల్‌లోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా)- ఫుల్ టైం పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. సీడ్ వ్యాలిడ్ స్కోర్, సీసీఎంటీ(గేట్ స్కోర్), డైరెక్ట్ అడ్మిషన్ కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. నిర్దేశించిన ప్రకారం సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు ప్రోగ్రామ్‌లకు అప్లయ్ చేసుకోవచ్చు. సీడ్ 2024/గేట్ 2024 స్కోర్ ఉన్నవారికి ఇన్‌స్టిట్యూట్ పీజీ స్కాలర్‌షిప్ లభిస్తుంది.**

**పీజీ ప్రోగ్రామ్‌లు**
- మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(కన్జర్వేషన్/ల్యాండ్‌స్కేప్/అర్బన్ డిజైన్)
- మాస్టర్ ఆఫ్ కన్జర్వేషన్
- మాస్టర్ ఆఫ్ ల్యాండ్‌స్కేప్ డిజైన్
- మాస్టర్ ఆఫ్ ప్లానింగ్(అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్/ ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్/ ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్)
- మాస్టర్ ఆఫ్ డిజైన్

**ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు**
- ఇందులో జనరల్ ఎంసీక్యూ, డిపార్ట్‌మెంటల్ ఎంసీక్యూ, ఇంటర్వ్యూ ఉంటాయి. మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సులో ప్రవేశానికి స్పా డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ మిగిలిన కోర్సుల్లో ప్రవేశానికి డిపార్ట్‌మెంటల్ డిస్క్రిప్టివ్ టెస్ట్ (స్కెచింగ్/డ్రాయింగ్/కంప్యూటేషన్స్) కూడా ఉంటాయి. డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో డిజైన్ టాస్క్ ఉంటుంది. దీనిని ఇచ్చిన పోర్టల్‌లో అయిదు గంటలలోపు అప్‌లోడ్ చేయాలి. జనరల్ ఎంసీక్యూలో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాలనుంచి; డిపార్ట్‌మెంటల్ ఎంసీక్యూలో డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, విజువల్ కమ్యూనికేషన్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- సీడ్ 2024 స్కోర్ ఉన్నవారు స్పా డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాసి ఇంటర్వ్యూలో అర్హత పొందాలి. డైరెక్ట్ అడ్మిషన్ కేటగిరీ కింద అప్లయ్ చేసేవారికి గేట్/సీడ్ స్కోర్ అవసరం లేదు. వీరు ఎంట్రెన్స్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

**సీట్ల వివరాలు**
- ఈ ప్రోగ్రామ్‌లన్నింటిలో కలిపి మొత్తం 188 సీట్లు ఉన్నాయి. వీటిలో 113 సీట్లను సీసీఎంటీ లేదా సీడ్ స్కోర్-స్పా డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్-ఇంటర్వ్యూ ఆధారంగా భర్తీ చేస్తారు. మిగిలిన 75 సీట్లను డైరెక్ట్ అడ్మిషన్ ప్రక్రియ ద్వారా నింపుతారు. డైరెక్ట్ అడ్మిషన్ కింద ఎంయుఆర్‌పి ప్రోగ్రామ్‌లో 15 సీట్లు; మిగిలిన ప్రతి కోర్సులో 10 సీట్లు ఉన్నాయి.

**అర్హత వివరాలు**
- బీఆర్క్/బీప్లాన్/(బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్) పూర్తిచేసినవారు అన్ని ప్రోగ్రామ్‌లకూ దరఖాస్తు చేసుకోవచ్చు. మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(ల్యాండ్‌స్కేప్), మాస్టర్ ఆఫ్ ల్యాండ్‌స్కేప్ డిజైన్ ప్రోగ్రామ్‌లకు (బీఎస్సీ+ఎమ్మెస్సీ)(హార్టికల్చర్/అగ్రికల్చర్/ఫారెస్ట్రీ/ఎకాలజీ/బోటనీ/జువాలజీ/జియాలజీ/జియోమార్ఫాలజీ); మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(కన్జర్వేషన్), మాస్టర్ ఆఫ్ కన్జర్వేషన్ ప్రోగ్రామ్‌లకు ఎంఏ(హిస్టరీ/కల్చరల్ స్టడీస్/హెరిటేజ్ స్టడీస్/ఆంత్రోపాలజీ)/(ఎంఏ/ఎమ్మెస్సీ/పీజీ డిప్లొమా)(మ్యూజియాలజీ/ఆర్కియాలజీ)/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ(లా-హెరిటేజ్ లా); మాస్టర్ ఆఫ్ ప్లానింగ్‌లో అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌కు (ఎంఏ/ ఎమ్మెస్సీ) (జాగ్రఫీ/ఎకనామిక్స్)/ఎంఏ సోషియాలజీ, ఎన్విరాన్‌మెంట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌కు (ఎంఏ/ఎమ్మెస్సీ) (జాగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ)/ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ఇంటిగ్రేటెడ్ డిగ్రీ(లా-ఎన్విరాన్‌మెంటల్ లా/జనరల్ లా); ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు (ఎంఏ/ఎమ్మెస్సీ)(జాగ్రఫీ/ఎకనామిక్స్)/ఎమ్మెస్సీ(స్టాటిస్టిక్స్/ఆపరేషన్స్ రీసెర్చ్/ఎకనామెట్రిక్స్) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఎండిజైన్ ప్రోగ్రామ్‌నకు బీడిజైన్ పూర్తిచేసినవారు, బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (విజువల్ కమ్యూనికేషన్) ఉత్తీర్ణతతోపాటు ఏడాది అనుభవం ఉన్నవారు, మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(విజువల్ కమ్యూనికేషన్) ఉత్తీర్ణులు కూడా అర్హులే.

డిగ్రీ స్థాయిలో ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి.

**ముఖ్య సమాచారం**
- దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 1
- ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ: మే 15న
- ఇంటర్వ్యూలు: మే 16, 17
- వెబ్‌సైట్: www.spabhopal.ac.in



## జాబ్ కార్నర్

### ఏఎస్ఆర్‌బీలో అసిస్టెంట్ డైరెక్టర్లు

న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్..కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

**ఖాళీలు: 21**

**పోస్టు:** అసిస్టెంట్ డైరెక్టర్

**అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి. డిగ్రీ స్థాయిలో తప్పనిసరిగా హిందీ, ఇంగ్లిష్ చదివి ఉండాలి. పనిచేసిన అనుభవం కూడా ఉండాలి.

**వయోపరిమితి:** 35 సంవత్సరాలు మించకూడదు

**దరఖాస్తు రుసుం:** జనరల్ అభ్యర్థులకు రూ.1000. ఎస్సీ, ఎస్టీ,పీడబ్ల్యూ అభ్యర్థులు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు.

**దరఖాస్తుకు చివరి తేదీ:** మే 2

**వెబ్‌సైట్:** http://www.asrb.org.in/

### ఎన్ఐఏబీలో ఇంజనీర్, క్లర్క్‌లు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ(ఎన్ఐఏబీ)...డైరెక్ట్ రూక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

**1. సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ ఇంజనీర్:** 1 పోస్టు

**2. క్లర్కులు:** 2 పోస్టులు

**అర్హత:** పోస్టును అనుసరించి ఇంటర్, డిగ్రీ(సివిల్/ఎలక్ట్రికల్/మెకానికల్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం, టైప్‌రైటింగ్ నైపుణ్యాలు ఉండాలి.

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా

**దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 22

**వెబ్‌సైట్:** https://www.niab.res.in/

### 'ఫిన్‌లాండ్' లోగో డిజైన్ విన్నర్ ఇండియన్ స్టూడెంట్

సోనిపట్‌లోని వరల్డ్ యూనివర్సిటీ ఆఫ్ డిజైన్‌లో రెండో ఏడాది కోర్సు చేస్తున్న విద్యార్థి అమన్ నారాయణ్ - లోగో డిజైన్ చాలంజ్‌లో విజయం సాధించాడు. ఇండియాతో దౌత్య సంబంధాలకు 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ పోటీని ఫిన్‌లాండ్ ఎంబసీ నిర్వహించింది. ఇదే వర్సిటీకి చెందిన 40 మంది విద్యార్థులు 70 డిజైన్లను సమర్పించారు. ఇండియా, ఫిన్‌లాండ్‌కు చెందిన వ్యక్తులు జడ్జీలుగా వ్యవహరించారు. ప్రత్యేకంగా నిర్వహించిన ఫంక్షన్‌లో అమన్ నారాయణ్‌కు ప్రైజ్‌మనీగా రూ.50,000 అందించారు.

## SCHOLARSHIP ALERT

### The Anant Fellowship 2024-25

**Description:** The Anant Fellowship 2024-25 is an opportunity offered by Anant National University (India's First DesignX University) for undergraduate degree holders in any discipline. This global, year-long postgraduate programme prepares and empowers individuals to become solutionaries who can design, build, and preserve equitable built environments.
**Eligibility:** Open for undergraduate degree holders in any discipline who demonstrate a commitment to improving the built environment. Applicants must possess a strong academic record and extracurricular achievements.
**Prizes & Rewards:** Up to 100% of the tuition fee and other benefits. **Last Date to Apply:** 31-07-2024
**Application mode:** Online applications only
**Short Url:** www.b4s.in/aj/TAFM1

### British Council Scholarship for Women in STEM 2024

**Description:** British Council Scholarship for Women in STEM 2024 is an opportunity offered by the British Council in partnership with UK universities for females pursuing postgraduate degrees in Science, Technology, Engineering, and Mathematics (STEM) fields at selective universities in the UK.
**Eligibility:** * Open for females from a specific country participating in the program.
* Applicants must hold a bachelor's degree in STEM subject and have secured admission to a pre-selected postgraduate program at a participating UK university.
* Applicants must demonstrate a need for financial support/socio-economic need.
* Applicants must meet the English language proficiency requirements for postgraduate study in the UK.
**Prizes & Rewards:** Full tuition fees, living stipend and other benefits
**Last Date to Apply:** 30-04-2024
**Application mode:** Online applications only
**Short Url:**www.b4s.in/aj/BCSM1

### Teach for India Fellowship 2024



**Description:** Teach for India Fellowship 2024 is an opportunity offered by Teach For India (a non-profit organisation) to young graduates from universities and workplaces to serve as full-time teachers for children belonging to underserved communities. Under this fellowship, the selected fellows will explore the leadership knowledge, skills, and mindset required in the movement for educational equity.
**Eligibility:** Open for Indian citizens or Overseas Citizens of India (OCI) who have completed graduation by June/July 2024. Applicants must be applying for the first time for the 2024 Fellowship cohort (since July 2023).
**Prizes & Rewards:** A monthly stipend of ?23,040 and other benefits
**Last Date to Apply:** 17-03-2024
**Application mode:** Online applications only
**Short Url:**www.b4s.in/aj/TFIF2



## విదూషక్



### నిజాయితీకి పట్టం


ఒక ఊరిలో కట్టెలు కొట్టుకుని బతికే వ్యక్తి ఉండేవాడు. అతనికి ముగ్గురు పిల్లలు. ఎన్ని కష్టాలున్నా నిజాయితీగా ఉండేవాడు. అతని పేరు రామయ్య. అతని పని అంతా అడవికి వెళ్లి కట్టెలు కొట్టడం.. వాటిని దగ్గర ఉండే దళారులకు ఇచ్చి డబ్బులు తీసుకుని.. తన కుటుంబాన్ని పోషించుకునేవాడు. దీంతో అతను ఎవ్వరితో పెద్దగా కలసిపోయేవాడు కాదు. తన పనిలో తాను ఉండేవాడు.

ఒక రోజు అడవికి వెళ్లాడు. విపరీతమైన వర్షం. దీంతో కట్టెలు కొట్టలేకపోయాడు. ఇంటికి వచ్చాడు. ఆ వర్షం తుపానైంది. మూడు రోజుల తర్వాత వెలిసింది. మరుసటి రోజు ఎండ పడుతూనే ఇక రామయ్య తన గొడ్డలితో బయలుదేరాడు. చెట్లను కొడుతుండగా లోపల చావ ఉండటంతో ఆ గొడ్డలి వేగంగా వెనక్కి ఎగిరి పడిపోయింది. క్షణాల్లో గొడ్డలి ఎలా వెనక్కి వెళ్లిందో కూడా అర్థం కాలేదు రామయ్యకు. తన బతుకు తెరువుకు ఉపయోగపడే గొడ్డలి నదిలో పడింది. ఆ లోతైన నదిలో పడిన గొడ్డలి ఇక రాదని ఎంతో వేదన చెందాడు. బాధపడ్డాడు.



రామయ్య బాధపడుతోంటే ఓ దేవత ప్రత్యక్షమైంది. 'నీ ఏడుపు ఎందుకూ?' అని అడిగింది. విషయం చెప్పాడు రామయ్య. వెంటనే ఆ దేవత మాయమైంది. నదిలోపల నుంచి బంగారు గొడ్డలి తెచ్చింది. ఈ గొడ్డలి నీదేనా? అని అడిగింది. 'ఇది నాది కాదు. ఇంత మెరవలేదు' అన్నాడు. దీంతో దేవత మరోసారి అదృశ్యమైంది. రెండోసారి మళ్లీ ప్రత్యక్షమై వెండి గొడ్డలిని ఇచ్చింది. అది చూసిన రామయ్య.. 'ఇది నాది కానే కాదు' అంటూ బాధపడ్డాడు. దీంతో దేవత మళ్లీ మాయమైంది. ఇది నీ గొడ్డలే అని చేతికి ఇచ్చింది. కట్టె చివర్లో విరిగిపోయిన ఆ పాత గొడ్డలిని చూసి మురిసిపోయాడు రామయ్య. ఎంతో ఆనందంగా 'ఇదే నా గొడ్డలి' అన్నాడు. రామయ్య నిజాయితీకి మెచ్చి వెంటనే 'ఆ రెండు గొడ్డళ్లను ఇచ్చేస్తా' అన్నది. రామయ్య వద్దన్నాడు. దేవత తీసుకోమని ఇచ్చింది. అతని నిజాయితీకి మెచ్చిన దేవత మరిన్ని బంగారు నాణేలను ఇచ్చింది.

### ఎన్ని చేపలు ఉన్నాయి



### 7 తేడాలను గుర్తించండి



### దారి కనుక్కోండి



### డైలీ సుడోకు - 247

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 4 | | 6 | | | 8 | |
| | 3 | | | 8 | 2 | | | |
| 7 | | 8 | | | | | | 2 |
| | | 1 | 8 | | | | 6 | 5 |
| | | | | 2 | | | | |
| 6 | 7 | | | | 9 | 4 | | |
| 5 | | | | | | 7 | | 6 |
| | | | 6 | 1 | | | 9 | |
| | 1 | | | 3 | | 5 | | |

**సుడోకు - 246 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 3 | 1 | 4 | 8 | 9 | 2 | 5 | 6 |
| 4 | 2 | 8 | 5 | 6 | 3 | 1 | 7 | 9 |
| 9 | 5 | 6 | 2 | 7 | 1 | 3 | 8 | 4 |
| 1 | 6 | 2 | 8 | 9 | 4 | 5 | 3 | 7 |
| 3 | 8 | 9 | 7 | 5 | 2 | 6 | 4 | 1 |
| 5 | 4 | 7 | 3 | 1 | 6 | 8 | 9 | 2 |
| 8 | 1 | 5 | 6 | 4 | 7 | 9 | 2 | 3 |
| 6 | 7 | 3 | 9 | 2 | 8 | 4 | 1 | 5 |
| 2 | 9 | 4 | 1 | 3 | 5 | 7 | 6 | 8 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.